
www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI



సోమవారం | 16-9-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 170 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, శుక్లపక్షం; తిథి: త్రయోదశి మ. 2.10 తదుపరి చతుర్దశి; నక్షత్రం: ధనిష్ఠ సా. 4.33 తదుపరి శతభిషం; వర్జ్యం: రా.10.57-12.22, దుర్ముహూర్తం: మ.12.33-1.22, మ.2.59-3.47; అమృతఘడియలు: ఉ.7.07-8.34; రాహుకాలం: ఉ.7.30-9.00; సూర్యోదయం: 6.06; సూర్యాస్తమయం: 6.12 | వరంగల్

Warangal |Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



హాట్ ఫేవరెట్ భారత్


హర్మన్‌ప్రీత్

కొరియాతో సెమీస్ పోరు నేడు
ఆసియా చాంపియన్స్ హాకీ

హులున్‌బుయిర్ (చైనా): ఆసియా చాంపియన్స్ ట్రోఫీ లీగ్ దశలో ఆడిన ఐదు మ్యాచ్‌ల్లోనూ నెగ్గి, టాపులో ఉన్న భారత హాకీ జట్టు సెమీఫైనల్లో హాట్ ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. సోమవారం కొరియాతో డిఫెండింగ్ చాంపియన్ భారత్ అమీతుమీ తేల్చుకోనుంది. లీగ్ మ్యాచ్‌ల్లో కొరియాతో సహా ఆతిథ్య చైనా, జపాన్, మలేసియా, పాకిస్థాన్‌ను భారత్ ఓడించి, సత్తా చాటింది. ఫార్వర్డ్‌లైన్, మిడ్‌ఫీల్డ్, డిఫెన్స్‌తో సహా అన్ని విభాగాల్లోనూ అత్యుత్తమ ప్రదర్శన కనబరుస్తోండడంతో భారత్‌పై అంచనాలు పెరిగాయి. యువ స్ట్రయికర్లు సుఖ్‌జీత్ సింగ్, అభిషేక్, ఉత్తమ్ సింగ్, గుర్జోత్ సింగ్ మంచి ఫామ్‌లో ఉండగా మన్‌ప్రీత్ సింగ్, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కూడా స్థాయికి తగినట్టుగా ఆడుతుండడం భారత్‌ను బలీయంగా తయారు చేసింది. ప్రత్యర్థి కొరియా లీగ్ దశలో టీమిండియా చేతిలో ఓడినా నాకౌట్ పోటీల్లో అంచనాలను తలకిందులు చేయగల సత్తా ఆ జట్టుకు ఉండడంతో సెమీస్ పోరు రసవత్తరంగా సాగే అవకాశముంది. కాగా, సోమవారమే జరిగే మరో సెమీఫైనల్లో పాకిస్థాన్‌తో చైనా తలపడనుంది.



భారీ భద్రత నడుమ భారత్ చేరిన బంగ్లా జట్టు

చెన్నై: టీమిండియాతో రెండు టెస్టులు, మూడు టీ20 మ్యాచ్‌ల సిరీస్ ఆడేందుకు బంగ్లాదేశ్ జట్టు భారత్‌కు చేరుకుంది. ఈనెల 19 నుంచి తొలి టెస్టు ఆరంభం కానుంది. ఆదివారం మధ్యాహ్నం ఆటగాళ్లంతా ఢాకా నుంచి చెన్నైలో అడుగుపెట్టారు. అయితే బంగ్లాలో ఇటీవల చోటుచేసుకున్న పరిస్థితుల నేపథ్యంలో అక్కడి మైనార్టీ హిందువులపై దాడులకు నిరసనగా ఈ సిరీస్‌ను రద్దు చేయాలనే డిమాండ్ ఎక్కువగా వినిపిస్తోంది. దీంతో బంగ్లా టీమ్‌కు పోలీసులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. ఎయిర్‌పోర్టు నుంచి వీరు బస చేసే హోటల్ వరకు రెండు పోలీస్ వ్యాన్లతో ఎస్కార్ట్‌ను ఏర్పాటు చేశారు. హోటల్‌లో అక్కడి స్టాఫ్ నుంచి సాదర ఆహ్వానం లభించింది. అందరినీ ఒకే ఫ్లోర్‌లో ఉంచడంతో పాటు ఆయుధాలు కలిగిన అధికారులు వారికి కాపలాగా ఉండనున్నారు.



గిల్‌కు విశ్రాంతి!

న్యూఢిల్లీ: బంగ్లాదేశ్‌తో జరుగబోయే మూడు టీ20ల సిరీస్‌కు ఓపెనర్ శుభ్‌మన్ గిల్‌కు విశ్రాంతి కల్పించే అవకాశం ఉంది. త్వరలో కివీస్‌తో జరిగే టెస్టు సిరీస్ కోసం పని ఒత్తిడి కారణంగా గిల్‌తో పాటు పలువురు ఆటగాళ్లను కూడా తప్పించనున్నట్టు సమాచారం. టెస్టు ఫార్మాట్‌లో వన్‌డౌన్ బ్యాటర్‌గా గిల్ కీలక పాత్ర పోషిస్తున్నాడు. ఈ సీజన్‌లో జరుగబోయే పది టెస్టుల్లోనూ అతడిని ఆడించాలనే ఆలోచనలో టీమ్ మేనేజ్‌మెంట్ ఉంది.

మూడో టీ20 వర్షార్పణం

1-1తో సిరీస్ సమం

మాంచెస్టర్: ఇంగ్లండ్-ఆస్ట్రేలియా జట్ల మధ్య జరగాల్సిన మూడో టీ20 మ్యాచ్ వర్షం కారణంగా రద్దయ్యింది. మధ్యాహ్నం ఆట ప్రారంభానికి ముందే వర్షం మొదలైంది. ఫలితంగా కనీసం టాస్ కూడా వీలు పడలేదు. దీంతో అంపైర్లు మ్యాచ్ రద్దుకే మొగ్గుచూపారు. ఈ మూడు టీ20ల సిరీస్‌లో ఇరు జట్లు చెరో మ్యాచ్ గెలిచాయి. దీంతో ఈ సిరీస్ 1-1తో డ్రాగా ముగిసింది. ఇక, ఇరుజట్ల మధ్య ఈనెల 19 నుంచి ఐదు వన్డేల సిరీస్ మొదలవనుంది.

పరాజయం పరిపూర్ణం

డేవిస్‌కప్‌లో స్వీడన్ చేతిలో భారత్ ఓటమి

స్టాక్‌హోమ్: డేవిస్ కప్‌లో చావో రేవో తేల్చుకోవాల్సిన మ్యాచ్‌లో భారత్ చేతులెత్తేసింది. డేవిస్ కప్ వరల్డ్ గ్రూప్-1లో భాగంగా శనివారం స్వీడన్‌తో ముగిసిన రెండు సింగిల్స్ మ్యాచ్‌ల్లో ఓడిన భారత్ ఆదివారం జరిగిన నిర్ణయాత్మక డబుల్స్ పోరులోను చతికిలపడింది. దీంతో స్వీడన్ 3-0తో విజేతగా నిలిచింది. డేవిస్‌కప్‌లో భారత్‌పై స్వీడన్ గెలవడం ఇది ఆరోసారి. డబుల్స్ మ్యాచ్‌లో భారీ అంచనాలతో బరిలోకి దిగిన రామ్‌కుమార్ రామనాథన్-శ్రీరామ్ బాలాజీ ద్వయం 3-6, 4-6తో ఆండ్రీ గోరాన్సన్-ఫిలిప్ బెర్గివి చేతిలో ఓటమి పాలైంది.

విరిగిన చేయితో బరిలో దిగి
సెంటీ మీటర్ తేడాతో..

టైటిల్ మిస్సయిన నీరజ్ చోప్రా
డైమండ్ లీగ్ ఫైనల్లో రన్నరప్‌తో సరి





బ్రస్సెల్స్: గత టోక్యో ఒలింపిక్స్‌లో స్వర్ణంతో చరిత్రకెక్కి, ఈ ఏడాది పారిస్ ఒలింపిక్స్‌లో రజత పతకంతో డబుల్ ధమాకా సృష్టించిన స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా.. ప్రతిష్ఠాత్మక డైమండ్ లీగ్ ఫైనల్లోనూ తనదైన ప్రదర్శనతో మెరిపించి ఈ సీజన్‌ను బాగానే ముగించాడు. శనివారం అర్ధరాత్రి ఇక్కడ జరిగిన లీగ్ సీజన్ ఫైనల్లో నీరజ్ రన్నరప్‌గా నిలిచాడు. 2022లో తొలిసారి డైమండ్ లీగ్ విజేతగా నిలిచిన నీరజ్.. ఈమారు కేవలం సెంటీమీటర్ తేడాతో టైటిల్ మిస్సయ్యాడు. ఈ బల్లెం వీరుడు మూడో ప్రయత్నంలో ఈటెను 87.86 మీటర్లు త్రో చేసి వరుసగా రెండో ఏడాది రెండోస్థానంలో నిలిచాడు. గ్రెనెడాకు చెందిన రెండుసార్లు వరల్డ్ చాంపియన్ అండర్సన్ పీటర్స్ 87.87 మీటర్లు త్రో చేసి టైటిల్ విజేతగా నిలిచాడు. జర్మనీ త్రోయర్ జులియన్ వెబర్ 85.97 మీటర్ల త్రోతో మూడోస్థానంలో నిలిచాడు. పీటర్స్ తొలి ప్రయత్నంలోనే ఈటెను అత్యధిక దూరం విసరగా.. ఆ తర్వాత ఎవరూ అతడిని అందుకోలేకపోయారు. కాగా, కొద్దిలో విజయాన్ని దూరం చేసుకున్న నీరజ్ ఈ పోటీలకు గాయంతోనే బరిలోకి దిగడం గమనార్హం. ఫ్రాక్చర్ (విరిగిన) చేతితోనే ఫైనల్లో పోటీపడ్డ నీరజ్, నొప్పిని భరిస్తూనే ఈటెను విసిరాడు. గాయం విషయాన్ని అతడు పోటీలు ముగిశాక వెల్లడించాడు. విరిగిన తన ఎడమ చేతి ఎక్స్‌రే ఫొటోను కూడా సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. 'ఈ టోర్నీకోసం ప్రాక్టీస్ చేస్తున్నప్పుడు చేతి గాయానికి గురయ్యా. ఎక్స్‌రే తీయిస్తే, ఎడమ చేతి నాలుగో వేలి దగ్గర ఎముక విరిగినట్టు బయటపడింది. అయినా, నా టీమ్ సహాయంతో బ్రస్సెల్స్‌లో పోటీపడ్డా. ఈ ఏడాదికి ఇదే నా చివరి పోటీ. నా అంచనాలను అందుకోలేకపోయినా, ఈ సీజన్‌లో ఎన్నో పాఠాలు నేర్చుకున్నా. మరింత పట్టుదలగా పోరాడతా, పూర్తి ఫిట్‌గా మీ ముందుకొస్తా. మళ్లీ 2025లో కలుద్దాం' అని 26 ఏళ్ల నీరజ్ ఎక్స్‌లో పోస్ట్ చేశాడు. నీరజ్.. సాధారణంగా కుడిచేతితో ఈటెను విసిరిన వెంటనే ఫాలోత్రూ యాక్షన్‌లో తన ఎడమ అరచేతిని బలంగా నేలపై ఉంచుతాడు. కానీ, ఈసారి పోటీలకు ఎడమ అరచేతికి కట్టుతో దర్శనమిచ్చిన నీరజ్.. భరించరాని నొప్పి కారణంగా తన ఆరు ప్రయత్నాల్లోనూ అరచేతిని నేలపై ఉంచలేదు.


పీటర్స్

పట్టుదలకు సలాం..

కొన్నాళ్లుగా గాయంతోనే బాధపడుతున్న నీరజ్.. ఇటీవలి ఒలింపిక్స్ మినహాయిస్తే ఈ సీజన్‌లో ఒకేఒక్క అంతర్జాతీయ ఈవెంట్‌ను గెలిచాడు. జూన్‌లో ఫిన్లాండ్ వేదికగా జరిగిన పావో నుర్మి గేమ్స్‌లో స్వర్ణం సాధించాడు. ఆ తర్వాత గజ్జల్లో కండరాల సమస్యతో బాధపడ్డ నీరజ్.. గాయంతోనే పారిస్ ఒలింపిక్స్ బరిలో దిగాడు. ఈ క్రమంలో ప్రాక్టీస్ సరిగా లేకున్నా కూడా విశ్వక్రీడల్లో పాల్గొన్నాడు. పారిస్‌లో ఈటెను ఏకంగా 89.45 మీటర్లు విసిరిన నీరజ్.. రెండోస్థానంలో నిలిచి వరుసగా రెండో ఒలింపిక్ పతకంతో చరిత్ర సృష్టించాడు. మళ్లీ ఇప్పుడు డైమండ్ లీగ్ ఫైనల్లోనూ గాయంతోనే పోటీపడి కేవలం సెంటీ మీటర్ తేడాతో టైటిల్‌ను చేజార్చుకున్న నీరజ్ పట్టుదలకు సలాం కొట్టకుండా ఉండలేం.

రికీ శతకబాదినా..
ఇండియా 'ఎ'దే విజయం

చిత్తుగా ఓడిన ఇండియా 'డి'



అనంతపురం క్లాక్‌టవర్ (ఆంధ్రజ్యోతి) : ఇండియా 'డి' బ్యాటర్ రికీ భుయ్ (113) శతకం బాదినా తమ జట్టు ఓటమిని అడ్డుకోలేకపోయాడు. మిగతా బ్యాటర్ల నుంచి అతడికి పెద్దగా సహకారం అందలేదు. దీంతో దులీప్ ట్రోఫీలో భాగంగా ఆదివారం ముగిసిన ఈ మ్యాచ్‌లో ఇండియా 'ఎ' 186 పరుగుల భారీ తేడాతో ఘనవిజయం సాధించింది. ఈ విజయంతో ఇండియా 'ఎ' 6 పాయింట్లతో టైటిల్ రేసులో ఉండగా, వరుసగా రెండు మ్యాచ్‌లు ఓడిన ఇండియా 'డి' పోటీ నుంచి వైదొలిగింది. 488 పరుగుల లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన ఇండియా 'డి' 301 పరుగుల వద్ద ఆలౌటైంది. తనుష్ కోటియన్‌కు నాలుగు, ములానికి మూడు వికెట్లు దక్కాయి. తొలి ఇన్నింగ్స్‌లో ఇండియా 'ఎ' 290, ఇండియా 'డి' 183 పరుగులు చేయగా రెండో ఇన్నింగ్స్‌లో ఇండియా 'ఎ' 380/3 స్కోరు వద్ద డిక్లేర్ చేసింది.

అన్షుల్‌కు 8 వికెట్లు..: ఇండియా 'సి' యువ పేసర్ అన్షుల్ కాంబోజ్ ఎనిమిది వికెట్లతో చెలరేగాడు. దీంతో ఇండియా 'బి' రెండో ఇన్నింగ్స్‌లో 332 పరుగులకు ఆలౌటైంది. అభిమన్యు ఈశ్వరన్ (157 నాటౌట్) అజేయ శతకంతో నిలిచాడు. ఆ తర్వాత ఇండియా 'సి' రెండో ఇన్నింగ్స్‌లో 128/4 వద్ద డిక్లేర్ చేసింది. రుతురాజ్ గైక్వాడ్ (62), రజత్ పటీదార్ (42) రాణించారు. అయితే చివరి సెషన్ ఆట ఉన్నప్పటికీ మ్యాచ్‌లో ఫలితం తేలే అవకాశం లేకపోవడంతో ఇరు జట్లు డ్రాకు అంగీకరించాయి. తొలి ఇన్నింగ్స్‌లో 525 పరుగులు చేసిన ఇండియా 'సి'కి 193 పరుగుల ఆధిక్యం లభించింది. దీంతో మూడు పాయింట్లు దక్కించుకున్న ఈ జట్టు ప్రస్తుతం టేబుల్ టాపర్ (9)గా ఉంది.


అర్జున్

మనోళ్లు తగ్గేదేలె..

భారత జట్లకు వరుసగా ఐదో గెలుపు
చెస్ ఒలింపియాడ్

బుడాపెస్ట్: చెస్ ఒలింపియాడ్‌లో భారత జట్ల జైత్రయాత్ర కొనసాగుతోంది. అటు పురుషులు, ఇటు మహిళలు వరుసగా ఐదో రౌండ్లోనూ గెలుపొందారు. ఆదివారం జరిగిన పురుషుల విభాగంలో భారత్ 3-1తో అజర్‌బైజాన్‌ను చిత్తుచేయగా.. మహిళల బృందం 2.5-1.5తో కజకిస్థాన్‌పై గెలిచింది. టోర్నీలో ఓటమన్నదే లేకుండా దూసుకెళుతున్న తెలుగు గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఇరిగేసి వరుసగా ఐదో విజయాన్ని నమోదు చేశాడు. తెల్లపావులతో ఆడిన అర్జున్ 54 ఎత్తుల్లో రౌఫ్ మమెదోవ్ ఆట కట్టించగా, గుకేష్ 47 ఎత్తుల్లో అదిల్ సులేమన్లిపై గెలిచాడు. మరో గేమ్‌లో నిజత్ అబసోవ్‌తో ప్రజ్ఞానంద డ్రా చేసుకున్నాడు. ఇక ఆఖర్లో మమెదో షఖిర్యార్‌తో గేమ్‌ను విదిత్ సంతోష్ గుజరాతి డ్రాగా ముగించాడు. ఇక..కజకిస్థాన్‌తో పోరులో భాగంగా అసుబయేవా బిబిసార చేతిలో తెలుగమ్మాయి ద్రోణవల్లి హారిక ఓటమిపాలైంది. ఆ తర్వాత సుర్మాన్‌పై వంతికా అగర్వాల్ నెగ్గగా.. బలబయేవాతో గేమ్‌ను దివ్యా దేశ్‌ముఖ్ డ్రా చేసుకుంది. దీంతో నిర్ణాయక ఆఖరిగేమ్‌లో కమలిదెయోవా మెరుట్‌ను వైశాలి ఓడించి భారత్‌కు గెలుపును కట్టబెట్టింది.

సహజ జోడీకి రన్నరప్ టైటిల్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): డబ్ల్యూ 35 టెన్నిస్ టోర్నమెంట్ డబుల్స్‌లో హైదరాబాద్ అమ్మాయి సహజ జోడీ రన్నరప్‌గా నిలిచింది. ఆదివారం కరీబియన్ దీవుల్లోని డొమినికన్ రిపబ్లిక్‌లో జరిగిన ఈ పోటీల ఫైనల్లో సహజ-జిబెక్ (కజకిస్థాన్) ద్వయం పోరాడి ఓడింది.

బిజినెస్

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ.		వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్	
హైదరాబాద్	106	విజయవాడ	123
వరంగల్	106	గుంటూరు	125
కరీంనగర్	106	ఒంగోలు	125
మహబూబ్‌నగర్	106	చిత్తూరు	115
కర్నూలు	106	నెల్లూరు	115
విశాఖపట్నం	106	అనంతపురం	115
గోదావరి	123		



ఆర్‌బీఐ నగదు నిర్వహణ మరింత పటిష్ఠం

న్యూఢిల్లీ: వచ్చే నాలుగైదు సంవత్సరాల్లో ఏర్పడే నగదు అవసరాలు తీర్చేందుకు ఆర్‌బీఐ ఇప్పటి నుంచే సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా కొత్త నగదు నిర్వహణ కేంద్రాల ఏర్పాటు, వేర్‌హౌస్‌ల ఆటోమేషన్, నగదు నిల్వ కేంద్రాల వద్ద గట్టి నిఘా, భద్రత పటిష్ఠత, ఇన్వెంటరీ మేనేజ్‌మెంట్ వ్యవస్థల ఏర్పాటు, కేంద్రీకృత కమాండ్ కేంద్రం ఏర్పాటు, ఇప్పటికే ఉన్న మౌలిక సదుపాయాలను మరింత పటిష్ఠం చేయడం వంటి చర్యలకు సిద్ధమైంది. ఈ ఏర్పాట్ల కోసం ఇప్పటికే టెండర్లు ఆహ్వానించింది.

ఇంకా పెరుగుడే: నిజానికి డిజిటల్ చెల్లింపుల విస్తరణతో గత మూడేళ్లలో చలామణిలో ఉన్న నగదు (ఎన్‌ఐసీ) వృద్ధిరేటు తగ్గింది. అయినా ఆర్థిక వృద్ధితో పాటు నోట్ల గిరాకీ కూడా వచ్చే పదేళ్లలో మరింత పెరగుతుందని నిపుణుల అంచనా. నిజానికి చలామణిలో ఉన్న నోట్ల పరిమాణం, విలువ రెండూ గత ఏడాది కాలంగా బాగా పెరిగాయి. గత ఏడాది మార్చి 31 నాటికి చలామణిలో ఉన్న నోట్ల పరిమాణం 13,621 కోట్ల నుంచి ఈ ఏడాది మార్చి 31 నాటికి 14,687 కోట్లకు చేరింది. ఇదే సమయంలో చలామణిలో ఉన్న నాణేల పరిమాణం 12,792 కోట్ల నుంచి 13,235 కోట్లకు చేరింది. ఇది చాలదన్నట్టు పాడైపోయిన నోట్ల పరిమాణం కూడా పెరిగిపోతోంది. దీంతో కరెన్సీ నోట్ల నిర్వహణ మరింత కట్టుదిట్టంగా చేపట్టాల్సిన అవసరం ఏర్పడుతోంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

16వ తేదీ			
హైదరాబాద్	505	విజయవాడ	535
వరంగల్	507	గోదావరి	530
చిత్తూరు	553	విశాఖపట్నం	540
		దజను గుడ్లు రూ. 72	



ఐపీఓకు స్విగ్గీ సిద్ధం!



ఈ వారమే సెబీకి దరఖాస్తు
రూ.8,400 కోట్లకు పైగా సమీకరణ

న్యూఢిల్లీ: మరో ఫుడ్ డెలివరీ కంపెనీ 'స్విగ్గీ' ఐపీఓకు సిద్ధమవుతోంది. దీనికి సంబంధించి ఈ వారమే సెబీకి దరఖాస్తు చేయబోతున్నట్టు సమాచారం. స్విగ్గీ ఈ ఐపీఓ ద్వారా 100 కోట్ల డాలర్లకు పైగా (సుమారు రూ.8,400 కోట్లు) సమీకరించే అవకాశం ఉందని భావిస్తున్నారు. అయితే స్విగ్గీ ఈ వార్తలపై నోరు మెదపడం లేదు. 2014లో ఏర్పాటైన ఈ ఫుడ్ డెలివరీ కంపెనీ ప్రస్తుతం దేశవ్యాప్తంగా లక్షన్నరకు పైగా రెస్టారెంట్లతో టై అప్ పెట్టుకుని భోజనప్రియుల ఆకలి తీరుస్తోంది. జొమాటో, అమెజాన్.కామ్ ఇండియా యూనిట్‌తో పాటు టాటా గ్రూప్ బిగ్ బాస్కెట్‌తో ప్రస్తుతం స్విగ్గీ పోటీపడుతోంది.

మరిన్ని ఐపీఓలు: సెకండరీ మార్కెట్ జోరుతో ప్రస్తుతం ప్రైమరీ మార్కెట్ కూడా మంచి జోరు మీద ఉంది. బజాజ్ హౌసింగ్‌తో సహా అనేక మంచి కంపెనీల ఐపీఓలు సూపర్ డూపర్ సక్సెస్ అయ్యాయి. దీంతో ఈ సంవత్సరం ఇప్పటి వరకు కంపెనీలు ఐపీఓల ద్వారా దాదాపు 700 కోట్ల డాలర్ల (సుమారు రూ.58,500 కోట్లు) వరకు సమీకరించాయి. త్వరలో హ్యుండయ్ మోటార్ కంపెనీ, ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ వంటి దిగ్గజాలు కూడా ఐపీఓలకు రానున్నాయి. ఇందులో ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఒక్కటే రూ.12,500 కోట్ల ఐపీఓ జారీ చేస్తుందని సమాచారం. అయితే కొన్ని ఎస్‌ఎంఈల ఐపీఓలు మాత్రం ఈ బూమ్‌ను అడ్డుపెట్టుకుని మదుపరులకు కుచ్చుటోపీ పెడుతూ నిండా ముంచుతున్నాయి. వాటి వాల్యుయేషన్లకు వత్తాసు పలుకుతున్న మర్చంట్ బ్యాంకర్లకు కళ్లెం వేస్తే తప్ప, ఈ గూడు పుఠానీకి తెరపడదని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి.

13 రోజుల్లో రూ.27,856 కోట్లు
సెప్టెంబరు నెలలో ఎఫ్‌పీఐ పెట్టుబడులు

న్యూఢిల్లీ: విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ) మళ్లీ భారత మార్కెట్‌పై దృష్టి పెట్టారు. ఈ ఏడాది ఏప్రిల్, మే నెలల్లో మార్కెట్ నుంచి రూ.34,252 కోట్లు ఉపసంహరించిన ఎఫ్‌పీఐలు సెప్టెంబరు 13నాటికి అందుబాటులో ఉన్న గణాంకాల ప్రకారం ఈ నెలలో రూ.27,856 కోట్లు ఇన్వెస్ట్ చేశారు. భారత మార్కెట్లో గల అంతర్గత బలంతో పాటు అమెరికాలో వడ్డీరేట్లు తగ్గుతాయన్న సంకేతాలు జూన్ నుంచి వారు పెట్టుబడుల దిశగా ఆకర్షితులు కావడానికి దోహదపడిన అంశాలని అంటున్నారు. ప్రస్తుతం అందరి దృష్టి అమెరికన్ ఫెడరల్ సమావేశంలో తీసుకునే నిర్ణయం పైనే కేంద్రీకృతమై ఉంది. ఈ నిర్ణయమే సమీప కాలంలో భారత మార్కెట్లో వారి పెట్టుబడులను ప్రభావితం చేస్తుందని పరిశీలకులంటున్నారు. సెప్టెంబరు పెట్టుబడితో కలిపితే ఈ ఏడాది ఇప్పటివరకు ఎఫ్‌పీఐ పెట్టుబడుల పరిమాణం రూ.70,737 కోట్లుంది.

అమెరికాలో రేట్లు తగ్గితే మనకే లాభం: అమెరికన్ ఫెడరల్ వడ్డీరేట్ల నిర్ణయంపై ఈ వారంలో సమావేశం అవుతోంది. అక్కడ వడ్డీరేట్లు వరుసగా ఐదు నెలలుగా తగ్గుతూ ప్రస్తుతం 43 నెలల కనిష్ఠ స్థాయిలో ఉన్నాయి. ఈ కారణంగా ఈ వారంలో జరిగే సమావేశం నుంచే వడ్డీరేట్ల తగ్గింపును ప్రారంభించవచ్చునన్నది పరిశీలకుల అభిప్రాయం. అదే జరిగితే ఎఫ్‌పీఐ పెట్టుబడులు అమెరికా నుంచి వర్ధమాన దేశాలకు..ప్రత్యేకించి మన దేశానికి మరలవచ్చునంటున్నారు. అయితే ప్రస్తుతం భారత ఈక్విటీల విలువలు గరిష్ఠంగా ఉండడం మాత్రం ఆందోళనకరమని చెబుతున్నారు.

మహారాష్ట్రకు అదానీ పవర్ విద్యుత్

న్యూఢిల్లీ: అదానీ పవర్ కంపెనీకి భారీ కాంట్రాక్టు లభించనుంది. దాదాపు 6,600 మెగావాట్ల థర్మల్, సౌర విద్యుత్ సరఫరా కోసం మహారాష్ట్ర విద్యుత్ పంపిణీ కంపెనీ (ఎంఎస్ఈడీసీఎల్) ఫ్లోట్ చేసిన టెండర్‌కు అదానీ పవర్ కంపెనీ యూనిట్‌కు రూ.4.08 ధర కోట్ చేసింది. జేఎస్‌డబ్ల్యు ఎనర్జీ, టోరెంట్ ఎనర్జీ కంపెనీల కంటే ఇది తక్కువ ధర. దీంతో ఈ కాంట్రాక్టు దాదాపుగా అదానీ పవర్‌కే లభిస్తుందని భావిస్తున్నారు. విద్యుత్ కొనుగోలు ఒప్పందం (పీపీఏ) కుదిరిన 48 నెలల్లో అదానీ పవర్ ఈ విద్యుత్ సరఫరా ప్రారంభిస్తుంది.

25000 పైన బుల్లిష్

(సెప్టెంబరు 16-20 తేదీల మధ్య వారానికి)


డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

ఆస్ట్రో గైడ్

గత వారం నిఫ్టీ : 25357 (+504)

నిఫ్టీ గత వారం 25433-24801 పాయింట్ల మధ్యన కదలాడి 504 పాయింట్ల లాభంతో 25357 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 25600 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 25161, 25061, 25114, 24832 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి. 50 డీఎంఏ 200 డీఎంఏ కన్నా పైన ఉండడం దీర్ఘకాలిక బుల్లిష్ ట్రెండ్ సంకేతం.

బ్రేకౌట్ స్థాయి: 25600 **బ్రేక్‌డౌన్ స్థాయి:** 25000
నిరోధ స్థాయిలు: 25560, 25660, 25760 (25460 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 25150, 25050, 24950

లార్జ్ క్యాప్ షేర్లే బెటర్..

గత వారం కన్స్యూమర్ డ్యూరబుల్స్, ఎఫ్‌ఎంసీజీ, ఐటీ, మెటల్, మీడియా కంపెనీల షేర్లు మంచి లాభాలతో ముగిశాయి. ఎఫ్‌ఐఐల కొనుగోళ్లతో బ్యాంకింగ్, ఫైనాన్స్ కంపెనీల షేర్లలో మళ్లీ బుల్లిష్‌నెస్ కనిపిస్తోంది. ఎఫ్‌ఐఐల కొనుగోళ్లు, చమురు ధర తగ్గడం, ప్రధాన కరెన్సీలతో డాలర్ మారకం రేటు నీరసించడం, ప్రపంచవ్యాప్తంగా సెంట్రల్ బ్యాంకులు వడ్డీరేట్ల కోతకు సిద్ధమవడం ఈ వారం మార్కెట్‌కు కలిసొచ్చే అంశాలు. అయినా ఈ వారం సూచీలు మిశ్రమంగానే ట్రేడయ్యే అవకాశం ఉంది. నిఫ్టీ ఈ వారంలో కూడా 25000 శ్రేణిలోనే కొనసాగవచ్చు. మదుపరులు ఈ వారం లార్జ్ క్యాప్ షేర్లలో కొనసాగడమే మంచిది.

స్టాక్ రికమండేషన్లు

ఎల్‌ఐసీ హౌసింగ్ ఫైనాన్స్: ఆగస్టులో ఈ కంపెనీ షేర్లు జీవితకాల గరిష్ఠస్థాయిని తాకాయి. అయితే హెడ్ లైన్ సప్లై రావడంతో ఒక్కసారిగా 23 శాతం మేర దిద్దుబాటుకు లోనయ్యాయి. ప్రస్తుతం కీలక మద్దతు స్థాయి రూ.700 వద్ద ట్రేడవుతున్నాయి. రిలెటివ్ స్ట్రెంత్ పెరగడం, కొనుగోళ్ల మద్దతుతో ఈ కౌంటర్‌లో మళ్లీ అప్‌ట్రెండ్ కనిపిస్తోంది. శుక్రవారం 2.79 శాతం లాభంతో రూ.723 వద్ద ముగిశాయి. రూ.770/805 టార్గెట్‌తో మదుపరులు రూ.720/700 శ్రేణిలో ఈ కౌంటర్‌లో పొజిషన్లు తీసుకోవచ్చు. అయితే రూ.685ను గట్టి స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

పిరామల్ ఎంటర్‌ప్రైజెస్: రెండేళ్లుగా డౌన్‌ట్రెండ్‌లో ఉన్న ఈ కంపెనీ షేర్లలో గోల్డెన్ క్రాస్ ఓవర్‌తో మళ్లీ అప్‌ట్రెండ్ కనిపిస్తోంది. రూ.800 వద్ద మద్దతు తీసుకున్న ఈ కౌంటర్ ప్రస్తుతం రూ.1,120 వద్ద గట్టి నిరోధం ఎదుర్కొంటోంది. దీనిని అధిగమిస్తే అప్‌ట్రెండ్ మరింత బలపడుతుంది. శుక్రవారం ఈ కంపెనీ షేర్లు 4.69 శాతం లాభంతో రూ.1,119 వద్ద ముగిశాయి. రూ.1,250/1,310 టార్గెట్‌తో మదుపరులు రూ.1,100 స్థాయిలో ఈ కౌంటర్లో పొజిషన్లు తీసుకోవచ్చు. అయితే రూ.1,070ను స్ట్రిక్ట్ స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

బంధన్ బ్యాంక్ : చాలా కాలంగా డౌన్‌ట్రెండ్‌లో ఉన్న ఈ కౌంటర్లో ప్రస్తుతం బేస్ ఏర్పడుతోంది. మరోసారి కీలక మద్దతు స్థాయి రూ.170 వద్ద బలం కనిపిస్తోంది. చివరి త్రైమాసిక ఆర్థిక ఫలితాలు బాగుండడం, డివిడెండ్ ప్రకటనతో ప్రస్తుతం ఈ బ్యాంక్ షేర్లలో సంస్థాగత మదుపరులు కూడా పెట్టుబడి పెడుతున్నారు. ఈపీఎస్ సైతం 1841 శాతం పెరిగింది. శుక్రవారం 5.41 శాతం లాభంతో రూ.207 వద్ద ముగిశాయి. రూ.245 టార్గెట్‌తో మదుపరులు ఈ కౌంటర్లో రూ.205/200 వద్ద పొజిషన్లు తీసుకోవచ్చు. అయితే రూ.190ను కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

గోద్రెజ్ ప్రాపర్టీస్: జీవితకాల గరిష్ఠ స్థాయికి చేరాక, ఈ కంపెనీ షేర్లు 16 శాతం వరకు దిద్దుబాటుకు లోనయ్యాయి. ప్రస్తుతం ఈ కౌంటర్లో కన్సాలిడేషన్ కొనసాగుతోంది. రూ.2,850 స్థాయిలో మద్దతు లభించింది. శుక్రవారం 2.46 శాతం లాభంతో రూ.2,950 వద్ద ముగిశాయి. రూ.3,250 టార్గెట్‌తో మదుపరులు ఈ కౌంటర్లో రూ.2,940/2,920 శ్రేణిలో పొజిషన్లు తీసుకోవచ్చు. అయితే రూ.2,880ను గట్టి స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.


అపోలో టైర్స్: ప్రస్తుతం ఈ కంపెనీ షేర్లు కన్సాలిడేషన్ ఆఖరి దశలో ఉన్నాయి. మరోసారి జీవితకాల గరిష్ఠ స్థాయివైపు పయనిస్తున్నాయి. సరఫరా తక్కువగా ఉండడంతో డిమాండ్ పెరుగుతోంది. శుక్రవారం రూ.526 వద్ద ముగిశాయి. మదుపరులు రూ.570 టార్గెట్‌తో రూ.520/500 శ్రేణిలో ఈ కౌంటర్లో పొజిషన్లు తీసుకోవచ్చు. అయితే రూ.480ను కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com



25000 పైన నిలదొక్కుకోవడం కీలకం

టెక్ వ్యూ


వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం ప్రారంభంలో 25000 స్థాయిలో రికవరీ సాధించి మరింత పురోగమించింది. గురువారం ఏర్పడిన ఆకస్మిక ర్యాలీలో 470 పాయింట్లకు పైగా లాభపడి 25000 కన్నా పైన క్లోజయింది. ముందు వారంతో పోల్చితే 500 పాయింట్ల మేరకు లాభపడి 25356 వద్ద జీవితకాల గరిష్ఠ స్థాయిల్లో ముగిసింది. అలాగే మిడ్‌క్యాప్-100 ఇండెక్స్ 1500 పాయింట్లు, స్మాల్‌క్యాప్-100 ఇండెక్స్ 230 పాయింట్లు లాభపడి జీవితకాల గరిష్ఠ స్థాయిల్లో ముగిశాయి. అయితే గత కొద్ది వారాల్లో పలు మధ్యస్థాయి, చిన్న స్థాయి షేర్లు కరెక్షన్ చవి చూశాయి. టెక్నికల్‌గా మార్కెట్ పటిష్ఠంగానే క్లోజయినప్పటికీ గరిష్ఠ స్థాయిల్లో కన్సాలిడేషన్ ఏర్పడాల్సి ఉంది. అమెరికన్ స్టాక్ మార్కెట్ సూచీ డో జోన్స్ కూడా 41,600 వద్ద నిలిచి ఉంది. గతంలో ఈ స్థాయిలోనే రెండు సార్లు కరెక్షన్ ఏర్పడింది. మార్కెట్ ఇప్పటికీ ఓవర్ బాట్ స్థితిలో ఉన్నందు వల్ల అప్రమత్తత తప్పదు. గత వారంలో బ్రేకౌట్ ఏర్పడినందు వల్ల పుల్‌బ్యాక్ రియాక్షన్‌కు కూడా ఆస్కారం లేకపోలేదు.

బుల్లిష్ స్థాయిలు: పాజిటివ్ ట్రెండ్‌లో ట్రేడయితే తదుపరి నిరోధం 25440. ప్రధాన నిరోధ స్థాయిలు, మానసిక అవధులు 25500, 25550. ఈ స్థాయిలో కన్సాలిడేషన్ ఏర్పడవచ్చు. మరింత అప్‌ట్రెండ్‌లో పురోగమించేందుకు స్వల్పకాలిక నిరోధం 25500 కన్నా పైన నిలదొక్కుకోవాలి.

బేరిష్ స్థాయిలు: బలహీనత ప్రదర్శించినా మైనర్ మద్దతు స్థాయి 25250 కన్నా పైన నిలదొక్కుకోవడం తప్పనిసరి. విఫలమైతే మైనర్ బలహీనతలో పడుతుంది. ప్రధాన మద్దతు స్థాయి 25000. భద్రత కోసం ఈ స్థాయి కన్నా పైన నిలదొక్కుకోవాలి. విఫలమైతే స్వల్పకాలిక బలహీనతలో ప్రవేశిస్తుంది.

బ్యాంక్ నిఫ్టీ: గత వారం పునరుజ్జీవం సాధించిన ఈ సూచీ 1360 పాయింట్ల మేరకు లాభపడి 51940 వద్ద ముగిసింది. ఇప్పటికీ జీవితకాల గరిష్ఠ స్థాయి 53350 కన్నా దిగువనే ఉంది. మరింత పాజిటివ్ ట్రెండ్‌లో ట్రేడయితే ప్రధాన నిరోధం 52400 కన్నా పైన నిలదొక్కుకోవాలి. విఫలమై ప్రధాన మద్దతు స్థాయి 51500 కన్నా దిగజారితే స్వల్పకాలిక బలహీనత తప్పదు.

పాటర్న్: నిఫ్టీ 25000 వద్ద "అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్‌లైన్" కన్నా దిగజారితే బలహీనత సంకేతం ఇస్తుంది. అయితే ఈ స్థాయి కొంత దూరంగానే ఉంది. అలాగే 25500 వద్ద "ఏటవాలుగా ఏర్పడిన రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్" వద్ద నిరోధం ఎదుర్కొంటోంది. సానుకూలత కోసం ఈ స్థాయి కన్నా పైన నిలదొక్కుకోవాలి.

టైమ్: ఈ సూచీ ప్రకారం బుధవారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	25,440, 25,500
మద్దతు	25,250, 25,170

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సోమవారం | 16-9-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 170

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

వరంగల్

పోటాపోటీగా 'సెప్టెంబరు 17'!

పబ్లిక్ గార్డెన్స్‌లో 'తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం'

రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహణ

అమిత్‌షా సహా నలుగురు కేంద్ర మంత్రులకు ఆహ్వానం

పరేడ్ గ్రౌండ్‌లో 'తెలంగాణ విమోచన దినోత్సవం'

కేంద్ర సర్కారు వేడుకలు.. సీఎం రేవంత్‌కు పిలుపు

పేరు మార్పు సబబు కాదు.. నేను రాలేను: కిషన్‌రెడ్డి

12



ఏపీలో ఐపీఎస్‌లపై వేటు

సీనియర్ ఐపీఎస్‌లు పీఎస్ఆర్, కాంతిరాణా, విశాల్ గున్నీ సస్పెన్షన్

శాంతిభద్రతలకు సంబంధం లేని నాటి నిఘా విభాగం అధిపతి పీఎస్ఆర్ ఆంజనేయులు జనవరి 31న తాడేపల్లిలోని సీఎం కార్యాలయానికి విజయవాడ సీపీ కాంతిరాణా తాతా, డీసీపీ విశాల్ గున్నీని పిలిపించుకుని ఒక మహిళ (ముంబై నటి కాదంబరి)ను అన్యాయంగా కేసులో ఇరికించేందుకు కుట్ర చేశారు. వైసీపీ నేతలతో కలిసి చేసిన కుట్రలో ముగ్గురు ఐపీఎస్‌లు భాగస్వాములయ్యారు. ఆలిండియా సర్వీస్ రూల్స్ 1969లోని సెక్షన్ 3(1)కింద ఐపీఎస్‌లకు ఉన్న అధికారాలను అతిక్రమించారు.

కాంతిరాణా తన పరిధిలోని స్టేషన్‌లో నమోదైన ఈ కేసు పర్యవేక్షణలో దారుణంగా విఫలమయ్యారు. మహిళను అరెస్టు చేసే ముందు ఫిర్యాదును పరిశీలించకుండా నిఘా చీఫ్ చెప్పగానే గుడ్డిగా ముందుకెళ్లారు. జెత్వానీ కేసులో నాటి విజయవాడ డీసీపీ విశాల్ గున్నీ చర్యలు దుష్ప్రవర్తనకు ఏ మాత్రం తీసిపోవు. బాధితురాలు వివరణ ఇచ్చేందుకు ప్రయత్నించినా వినకుండా ఏకపక్షంగా వ్యవహరించారు.

- ఐపీఎస్‌ల తీరును దుయ్యబడుతూ ప్రభుత్వానికి ఏపీ డీజీపీ సమర్పించిన 16 పేజీల నివేదికలోని అంశాలు



పీఎస్ఆర్ ఆంజనేయులు



కాంతి రాణా తాతా



విశాల్ గున్నీ

ముంబై నటి జెత్వానీ కేసులో సంచలనం.. డీజీపీ నివేదిక పరిశీలించాక ఉత్తర్వులు జారీ

వైసీపీ హయాంలో పెద్దల ఆదేశాల మేరకు అడ్డగోలుగా వ్యవహరించిన అధికారులు

జగన్ స్నేహితుడు సజ్జన్‌ను కాపాడేందుకు కాదంబరిపై అక్రమ కేసు బనాయింపు

వైసీపీ నేత విద్యాసాగర్ ఫిర్యాదుతో నమోదు.. ఆంజనేయులు ప్లాన్.. రాణా, గున్నీ యాక్షన్

ముంబైలో జెత్వానీ కుటుంబాన్ని అరెస్ట్ చేసి విజయవాడ నగరానికి తరలింపు

పరిధి దాటి వ్యవహరించారన్న డీజీపీ.. ఐపీఎస్‌లు, పోలీసులు తప్పు చేశారని వెల్లడి

అమరావతి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఐపీఎస్‌లమనే విషయాన్ని మరిచి ఏపీలో జగన్ ప్రభుత్వ హయాంలో అడ్డగోలు పనులు చేసిన అధికారుల పాపం పండింది. అధికారాన్ని అడ్డు పెట్టుకుని విచ్చలవిడిగా చెలరేగిన ముగ్గురు సీనియర్ ఐపీఎస్‌లపై వేటు పడింది. ముంబై నటి కాదంబరి జెత్వానీ వ్యవహారంలో ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ పీఎస్ఆర్ ఆంజనేయులు, విజయవాడ మాజీ పోలీస్ కమిషనర్ కాంతి రాణా తాతా, విజయవాడ మాజీ డీసీపీ విశాల్ గున్నీని రాష్ట్ర ప్రభుత్వం సస్పెండ్ చేసింది. వంద గొడ్లను తిన్న రాబందు ఒక్క గాలివానకు కూలిపోయినట్లు లెక్కలేనన్ని అక్రమాలు చేసిన ఐపీఎస్‌లు ఎక్కడో ముంబైలో ఉండే ఒక మహిళ కన్నీటికి మూల్యం చెల్లించుకున్నారు. జెత్వానీ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి విజయవాడ పోలీసులు ఇచ్చిన నివేదికను డీజీపీ ద్వారకా తిరుమల రావు ప్రభుత్వానికి నివేదించారు. దీన్ని పరిశీలించిన ప్రభుత్వం ముగ్గురు ఐపీఎస్ అధికారులను సస్పెండ్

మిగతా 9వ పేజీలో...

రాజీనామా చేస్తా

పదవి నుంచి తప్పుకొంటానని ఢిల్లీ సీఎం కేజ్రీ ప్రకటన

ఇది నాకు నేను విధించుకునే అగ్నిపరీక్ష

పార్టీని చీల్చేందుకు బీజేపీ కుట్రలు

దేవుడు అండగా ఉండి రక్షించాడు

రాజ్యాంగాన్ని కాపాడాలనే

ఇంతకాలం రాజీనామా చేయలేదు

నిర్దోషిగా నిరూపించుకునే వరకు

ముఖ్యమంత్రి కుర్చీలో కూర్చోను

నవంబరులోనే ఎన్నికలు నిర్వహించాలి

సీఎం పదవిని ప్రజాకోర్టు నిర్ణయిస్తుంది

కార్యకర్తల భేటీలో కేజ్రీవాల్ వ్యాఖ్యలు

కొత్త సీఎంగా అతిషికి అవకాశాలు!

హరియాణాపై దృష్టి సారించనున్న కేజ్రీ

ఆయన రాజీనామా ఓ గిమ్మిక్కు: కాంగ్రెస్

అది పబ్లిసిటీ కోసం నాటకం: బీజేపీ



ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలను ఫిబ్రవరిలో కాదు.. నవంబరులోనే నిర్వహించాలని ఎన్నికల సంఘాన్ని డిమాండ్ చేస్తున్నా. మహారాష్ట్రతోపాటు ఢిల్లీ ఎన్నికలూ జరగాలి. ఇంటింటికీ వెళ్లి ఓట్లడుగుతా. నేను నిర్దోషినని నమ్మితేనే ఓట్లు వేయాలని ప్రజలను కోరుతా.

- ఢిల్లీ సీఎం కేజ్రీవాల్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 15: ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) చీఫ్ అరవింద్ కేజ్రీవాల్ సంచలన నిర్ణయాన్ని ప్రకటించారు. రెండ్రోజుల్లో సీఎం పదవికి రాజీనామా చేస్తానని వెల్లడించారు. "నేను నిర్దోషిగా నిరూపించుకునేంత వరకు సీఎం పదవిలో ఉండను. వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఆప్‌ను గెలిపించి, అధికారం కట్టబెట్టేవరకు సీఎం పీఠాన్ని అధిరోహించను" అని వ్యాఖ్యానించారు. రాజీనామా తర్వాత.. తదుపరి సీఎంను ప్రకటిస్తామని పేర్కొన్నారు. ఆదివారం ఢిల్లీలోని ఆప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో కేజ్రీవాల్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఆప్ కష్టాల్లో ఉన్నప్పుడు భగవంతుడే తమ వెంట ఉండి, ముందుకు నడిపించారని, దేవుడిచ్చిన ధైర్యంతోనే శత్రువులపై పోరాడుతామని ఉద్ఘాటించారు. కాగా, ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో సుప్రీంకోర్టు శుక్రవారం కేజ్రీవాల్‌కు బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే.! ఆర్నెల్లుగా జైలులో ఉన్న ఆయన సుప్రీంకోర్టు తీర్పుతో విడుదలయ్యారు. అప్పుడు విలేకరులతో మాట్లాడుతూ దేశాన్ని బలహీనపరుస్తూ.. విభజించే ప్రయత్నాలు చేస్తున్న శక్తులపై తాను పోరాటం చేస్తానని ప్రతినబూనారు. ఆదివారం కార్యకర్తలతో భేటీ అయ్యారు. "మా నేతలు సత్యేందర్ జైన్, అమానతుల్లాఖాన్ ఇంకా

మిగతా 10వ పేజీలో...

కాంగ్రెస్‌లో ఒకటే పవర్ సెంటర్

అది రాహుల్‌గాంధీ మాత్రమే: మహేశ్‌కుమార్ గౌడ్

టీపీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతల స్వీకరణ

నేడు సచివాలయం ఎదుట రాజీవ్ విగ్రహావిష్కరణ

సీఎం రేవంత్ చేతుల మీదుగా కార్యక్రమం

పాల్గొననున్న మంత్రులు, ప్రజా ప్రతినిధులు, నేతలు

11



మహేశ్‌గౌడ్ బాధ్యతల స్వీకార కార్యక్రమంలో రేవంత్, భట్టి, పొంగులేటి, వీహెచ్, పొన్నం

స్థానిక సంస్థల ఎన్నికలు

బీసీల లెక్క తేలాకే!

నాలుగు నెలల్లో బీసీ జనాభా వివరాలు తీస్తాం.. ఎన్నికల్లో ఎవరి వాటా వారికి ఇస్తాం

కాంగ్రెస్ కార్యకర్తలను గెలిపించుకుంటాం

మా క్యాడర్ జోలికి వస్తే ఒళ్లు చింతపండే

మనవాళ్ల ఇంటికి వస్తామని వాళ్లే అన్నారు

తీరా మనవాళ్లే వెళ్తే.. తన్నారంటున్నారు

చూసుకుందాం రమ్మని ఎందుకు పిలిచినట్లు?

రాజీనామా చేస్తానన్న సన్నాసి ఏమయ్యాడు?

మహేశ్‌గౌడ్ టీపీసీసీ చీఫ్ కావడం సంతోషకరం

ఇద్దరం సమన్వయంతో పనిచేస్తాం: సీఎం రేవంత్

మహేశ్‌గౌడ్ బాధ్యతల స్వీకారంలో వ్యాఖ్యలు

హైదరాబాద్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీ జనాభా లెక్కలు తేలాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. బీసీ కమిషన్ ద్వారా రానున్న మూడు, నాలుగు నెలల్లో బీసీ జనాభా లెక్కలు తీస్తామని, ఆ వర్గాలకు దక్కాల్సిన వాటా ఇచ్చి.. ఎన్నికలు నిర్వహిస్తామని అన్నారు. టీపీసీసీ నూతన అధ్యక్షుడిగా నియమితుడైన బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్ ఆదివారం గాంధీభవన్‌లో బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఇందిరాభవన్ ఆవరణలో నిర్వహించిన సభలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. బీసీ నేత అయిన మహేశ్ కుమార్‌గౌడ్.. టీపీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించడం తామందరికీ సంతోషం కలిగిస్తోందన్నారు. 2023 ఎన్నికలు సెమీఫైనల్స్ మాత్రమేనని, 2029 పార్లమెంటు ఎన్నికలు ఫైనల్స్ అని సీఎం అభివర్ణించారు. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించి రాహుల్‌గాంధీని ప్రధానిని చేయాలని పిలుపునిచ్చారు. ఎవరైనా తమ కార్యకర్తల జోలికివస్తే ఊరుకోబోమని, కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ఇక.. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి కారణమైన కార్యకర్తలను

మిగతా 11వ పేజీలో...

పార్టీని నడుపుతున్నారా? లేక సర్కస్సా?

ఒకే అంశంపై సీఎం, మంత్రులు

తలో మాట మాట్లాడతారేంటి..

నా ఎత్తు పైన పదేపదే విమర్శిస్తే..

సన్నాసి, లిల్లీపుట్ అని అనలేనా?

రేవంత్ పదవిలో ఉండేది ఐదేళ్లే

సీఎంపై హరీశ్‌రావు ధ్వజం

12



కాగితరామచంద్రాపురంలో గండ్లు పడిన చోటును పరిశీలిస్తున్న ఉత్తమ్

యుద్ధ ప్రాతిపదికన గండ్లకు మరమ్మతు

వారం రోజుల్లో పనులు పూర్తి

కేంద్రం సహకరిస్తుందనే ఆశ

వారు నిధులిచ్చినా.. ఇవ్వకున్నా రాష్ట్ర ప్రభుత్వం తరపున చేస్తాం

కాళేశ్వరంపై బీఆర్ఎస్‌ది నిస్సిగ్గు సమర్థన: మంత్రి ఉత్తమ్

కోదాడ, హుజూర్‌నగర్‌లో దెబ్బతిన్న కాల్వల పరిశీలన

11



వైద్యానికి 5 వేల కోట్లు!

ప్రపంచ బ్యాంకు సాయం కోసం సర్కారు యత్నం?

ప్రతి 30 కిలోమీటర్లకు ఒక ట్రామాకేర్ సెంటర్

డయాలసిస్, క్యాన్సర్ పరీక్షా కేంద్రాల ఏర్పాటు

ఎనిమిది నిమిషాల్లోనే బాధితుల వద్దకు అంబులెన్స్

టీ డయాగ్నస్టిక్ కేంద్రాల బలోపేతంపై ప్రతిపాదనలు

హైదరాబాద్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వైద్య ఆరోగ్య శాఖలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. ప్రజారోగ్యాన్ని బలోపేతం చేసి, సామాన్య ప్రజలకు ప్రభుత్వ వైద్యాన్ని మరింత చేరువ చేయాలని చూస్తోంది. వైద్యరంగంలో మౌలిక సదుపాయాలను మెరుగుపర్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తోంది. ఇందుకోసం ప్రపంచ బ్యాంకు సాయం కోరాలని యోచిస్తోంది. వైద్య, ఆరోగ్య విభాగంలో చేపట్టనున్న వివిధ కార్యక్రమాలకు సుమారు రూ.5 వేల కోట్ల సాయాన్ని పొందేందుకు ప్రతిపాదనలను వైద్య ఆరోగ్యశాఖ సిద్ధం చేస్తోంది. వీటిని తొలుత కేంద్ర ఆరోగ్య శాఖకు పంపుతారు. ఇప్పటికే అమల్లో ఉన్న పథకాలు, కొత్తగా చేపట్టాలనుకునే పథకాలకు అవసరమైన మానవ వనరులు, ఇతర సౌకర్యాలు

మిగతా 9వ పేజీలో...

జమిలి ఈ టర్మ్‌లోనే!

ఒక దేశం-ఒకే ఎన్నికకు అన్ని పార్టీల మద్దతుపై మోదీ సర్కారు ఆశాభావం

ఎన్డీయే పక్షాల మధ్య సమన్వయం భేష్

ఈ బంధం ఐదేళ్లూ కొనసాగుతుంది!

త్వరలోనే జనాభా లెక్కల సేకరణ

కులగణనపై ఇంకా నిర్ణయించలేదు

కేంద్ర ప్రభుత్వ వర్గాల వెల్లడి

10



గణేశా.. ట్యాంక్‌బండ్ పిలిచె!



హుస్సేన్‌సాగర తీరాన నిమజ్జనానికి తొలగిన అడ్డంకులు

అధికారులు అనుమతివ్వకుంటే ఎక్కడి విగ్రహాలు అక్కడే..

గణేశ్ ఉత్సవ సమితి హెచ్చరిక

ట్యాంక్‌బండ్‌పై ఫ్లెక్సీల తొలగింపు

దిగొచ్చిన అధికార యంత్రాంగం

ఖైరతాబాద్ గణపతి దర్శనానికి ఒక్కరోజే 6 లక్షల మంది రాక

ట్రాఫిక్‌జాం.. సొమ్మసిల్లిన కొందరు

12



ప్రధాని మోదీపై.. పుతిన్ గుర్రు

జెలెన్‌స్కీతో భేటీపై రష్యా అధ్యక్షుడి అసంతృప్తి?


ప్రధాని ఆదేశంతో హుటాహుటిన రష్యాకు దోభాల్

ఉక్రెయిన్ అధినేతతో సమావేశంపై వివరణ!

పుతిన్‌తో చర్చల వీడియోను విడుదల చేసిన స్పుత్నిక్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 15: రష్యా-ఉక్రెయిన్ యుద్ధం నానాటికీ తీవ్రమవుతుండగా.. ప్రధాని మోదీ ఉక్రెయిన్ వెళ్లి.. ఆ దేశాధ్యక్షుడు జెలెన్‌స్కీతో ముఖాముఖి చర్చలు జరపడంపై రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అసంతృప్తిగా ఉన్నారా..? ఇది తెలిసే ఆయనకు వివరణ ఇచ్చేందుకు మోదీ హుటాహుటిన జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోభాల్‌ను మాస్కోకు పంపారా..? తాజా పరిణామాలు దీనినే సూచిస్తున్నాయి. ఈ నెల 12న దోభాల్ రష్యాలోని సెయింట్ పీటర్స్‌బర్గ్ వెళ్లారు. అక్కడ పుతిన్‌తో అంతర్గతంగా చర్చలు జరిపారు. ఆయన అధ్యక్షుడితో మాట్లాడిన వీడియోను అక్కడి వార్తాసంస్థ స్పుత్నిక్ విడుదల చేసింది. ఇది సోషల్ మీడియాలో ఇప్పుడు వైరల్ అవుతోంది. 'తన ఉక్రెయిన్ పర్యటన, జెలెన్‌స్కీతో చర్చల సారాంశాన్ని మీకు వివరించేందుకు ఆసక్తిగా ఉన్నట్లు ఫోన్

మిగతా 10వ పేజీలో...



నవలా శిల్పం

తనను తాను 'ఈ నేలకు ఆస్థాన లేఖకుడి'నని ప్రకటించుకున్న రాయలసీమ నవలాకారుడు సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి. ఆ మాటలో లేశమాత్రమైనా అతిశయం లేదు. వారి రచనలన్నీ ఆ పుత్తడి పుడమి చుట్టే తిరుగుతాయి. సగటు మనిషి జీవితాన్ని పట్టితూచినట్టుగా వారి రచనలు ఉంటాయి. 'తానా' బహుమతి పొందిన 'కొండపొలం' వంటి నవల రాయడం వేరొకరికి దుస్సాధ్యం. గొల్ల కాపర్లలో ఒక కాపరిగా, మూగజీవాల మనసు చదివే పెద్దకాపరిగా మారిన తరువాతనే అలాంటి మేలైన రచనను ఆయన చేయగలిగారు. తొమ్మిది నవలలు రాసిన సన్నపురెడ్డి వెంకట్రామిరెడ్డితో 'నవలా శిల్పం' శీర్షక కోసం జరిపిన సంభాషణ ఇది.

"నవల వందల ఎకరాల వ్యవసాయ క్షేత్రం లాంటిది"

- సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి

ఒక ఇతివృత్తం గాని, ఐడియా గానీ స్ఫురించినప్పుడు 'ఇది కథ కాదు నవలే అవుతుంది' అని మీరు ఎలా గుర్తు పడతారు?

నేను వ్యవసాయ కుటుంబంలో పుట్టినవాడిని. ఇప్పటికీ రైతుల, రైతు కూలీల మధ్యన బతుకుతూ ఉన్నవాడిని. ఓవైపు రైతుగా విత్తనాల్ని, మరోవైపు రచయితగా అక్షరాల్ని విత్తి పంటలు పండించే సృజనకారుడిని. విత్తనాలు చేతిలోకి తీసుకోగానే అర్థమైపోతుంది- అవి దీర్ఘకాలిక పంటకు సంబంధించినవా, స్వల్పకాలిక పంటకు సంబంధించినవా? అని. ఎదురైన సంఘటన విస్తృతిని బట్టి మనస్సులో ఇంకేటప్పుడే అది కథగానో నవలగానో దాని రూపానికి సంబంధించిన సంకేతాలు ఇస్తుంది.

కవిత, కథ, నవల... మీరు ఈ మూడు ప్రక్రియల్లోనూ రాస్తారు. ఆయా ప్రక్రియల్ని మీరు అప్రోచ్ అయ్యే తీరు ఏ రకంగా భిన్నంగా ఉంటుంది?

ఇన్నేళ్ల సాహిత్య జీవితంలో భిన్న ప్రక్రియలుగా పరిచయమైన సాహిత్యం ఇప్పుడు ఒకే రూపంతో వచ్చి పక్కన కూచుంటోంది. ఏ ప్రక్రియ అయినా చేతుల్లో ఒదుగుతోంది. నాకిప్పటికీ కవిత రాయడమంటే ఇష్టం. కష్టం కూడా. నాకు కవిత ఫ్రేములో బిగించినట్టుండాలి. ఒక పదం ఎక్కువా ఉండకూడదు, తక్కువా ఉండకూడదు. వాక్యం అదిమిపెట్టిన స్ప్రింగ్‌లా ఉండాలి. ఎదురుగా నిలుచుంటే అందులో నన్ను నేను సంస్కరించుకునే క్రమంలోనే నా చుట్టూ ఉన్న సమాజంలోని మహిళలకు సంబంధించిన ఎన్నో సంఘటనలు అర్థమయి, అవి కథలుగా, నవలల్లోని సంఘటనలుగా రూపొందాయి. అలాగే దళితులు బడుగు బలహీన వర్గాల గురించిన కథలు కూడా.

నవల మనసులో రూపుదిద్దుకునే, రాసే ప్రక్రియ గురించి చెప్పండి? నవల పూర్తి కావటానికి ఎంత కాలం పడుతుంది? రివైజ్ చేసే ప్రక్రియ ఎలా జరుగుతుంది?

నాకైతే నవల రాయడం అనేది ఒక దీర్ఘకాలపు వ్యూహం. అప్పటికప్పుడు ఏదో ఒక విషయాన్ని ఊహించుకొని, కాగితాలు ముందేసుకొని రాయటం మొదలుపెట్టిన పరిస్థితి అయితే ఎప్పుడూ లేదు. చాలాకాలంగా రకరకాల విషయాలు మనసులో రగులుతూ ఉంటాయి. వాటికి సంబంధించిన అనేక సంఘటనలు ఎదురవుతూ ఉంటాయి. అవన్నీ నాలో జ్ఞాపకాలుగా మారిపోతుంటాయి. మనస్సులో నవలకు సంబంధించిన స్వరూపం ఒకటి రూపుదిద్దుకుంటూ ఉంటుంది. అప్పటికీ రాసేందుకు నేను కనిపించాలి. నేనే కాదు జన సమూహమంతా నిలుచున్నా కనిపించగలగాలి. అంత ఖచ్చితమైన కొలతలు ఉన్నాయి కాబట్టి నేను ఇప్పటిదాకా వందకు మించి కవితలు రాయలేదు. కథకు కూడా హద్దులు ఉన్నాయి. నాలుగు గట్ల మధ్య మడికయ్యలో నాటిన పైరు లాంటిది కథ. దానికి గెట్ల హద్దులుంటాయి. నేలను వృథా కానీని పొదుపరితనం ఉంటుంది. కథ రాయటం కవితంత కష్టం కాదు. కొంత వెసులుబాటు ఉంటుంది.

నవల వందల ఎకరాల వ్యవసాయ క్షేత్రం లాంటిది. ఉద్యానవనాల సాగు లాంటిది. మొక్కల మధ్యన చాళ్ళ వెంట వాహనాల్లో విహరించవచ్చు. తెలిసిన జీవితాల గురించిన నవల రాయటం నాకు కొంత సులభంగా ఉంటుంది. వయస్సుపెరిగేకొద్దీ అనుభవాలు తోడయ్యేకొద్దీ నవల రాయడాన్నే ఎక్కువ ఎంజాయ్ చేస్తాం.

నవలలో భిన్న పాత్రల స్వభావాలను చిత్రించేటప్పుడు మీరు ఎలాంటి ఘర్షణను ఎదుర్కొంటారు? ముఖ్యంగా పురుష రచయితగా స్త్రీ పాత్రల స్వభావాలు చిత్రించటంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటారు?

నవలలోని పాత్రలు మనం తయారు చేసినట్టు ఉండకూడదు. జనాల్లోంచి పేజీల మీదకు నడిచి వచ్చినట్లు ఉండాలి. చదివే పాఠకుడు అలాంటి నమూనాను తనలోనో, తన చుట్టుపట్లనో పోల్చుకోగలగాలి. ఆ పాత్ర సాధారణ పాఠకుడిలో అంతర్గతంగా చైతన్యాన్ని ప్రేరేపించేదిగా ఉండాలి. రోజూ వెళతోన్న దారిలో పాఠకుడు ఏ కారణం వల్లనో తను చూడలేని, ఏ భయం వల్లనో చూసేందుకు ఇష్టపడని, సహాయం చేయవలసి వస్తుందనే ఏ పిరికితనం వల్లనో చూడబుద్ధిగాని దృశ్యాల్ని ఆ పాత్ర చూపించగలగాలి. అలాంటి పాత్రను సృష్టించినపుడు నేను కూడా పాఠకుడిగా మారిపోయి సదరు సంఘటన చదివినప్పుడు నాకు కూడా ఆ సమస్య ఎదురవుతుంది. ఆ చూడలేని తనం, ఆ పిరికితనం, ఆ భయం నాలో కూడా ఉన్నట్లు అర్థమవుతుంది. నన్ను నేను ప్రక్షాళన చేసుకుంటే గాని ముందుకు సాగలేని పరిస్థితి కలుగుతుంది.

నేను ఎన్నుకొన్న అలాంటి పాత్రలవల్ల రచయితగా చాలా సంఘర్షణకు గురయ్యాను. స్త్రీలు, దళితులు, బహుజనులు, కులాలు, మతాల విషయంలో నా రక్తంలో ఇంకివున్న పాత వాసనల నెన్నింటినో నా సాహిత్యం వేలెత్తి చూపించింది. స్త్రీల విషయంలో తరతరాలుగా అనువంశికంగా వెంట వస్తోన్న మగ అహంకారపు అవలక్షణాలు నాలోనూ ఉన్నాయి. వాటి ఉనికిని గురించిన స్పృహ సాహిత్యమే నాకు ఇచ్చింది.

సిద్ధపడను. ప్రారంభమూ, కథా పరిణామమూ, ముగింపుకు సంబంధించిన దృశ్యము మెదడులో ఖాయమైన తర్వాత దానికి అవసరమయ్యే సంఘటనల్ని జ్ఞాపకాల్లోంచి ఏరుకొని నోట్స్ రాసుకొంటాను. ఎప్పుడూ జనాల్లో ఉంటాను కాబట్టి వాళ్ళ జ్ఞాపకాల తేనె తుట్టెలను కూడా కదిలిస్తాను. ఏ చిన్న విషయం దొరికినా దాచుకొంటాను. తర్వాత నవల రాయడానికి కూచుంటాను. నవలకు సంబంధించిన కాలంలోకి, వ్యక్తుల సమూహంలోకి, వాళ్ళ మాండలికాల్లోకి, వాళ్ళ జీవన విధానంలోకి వెళ్లిపోయినప్పుడు బయట ప్రపంచంతో చాలావరకు సంబంధాలు తెంచుకొంటాను. రచనా ప్రపంచంలోనే బతుకుతాను. నిద్రాహార సమయపాలన కూడా గతి తప్పుతుంది. నవల పూర్తయ్యేసరికి మోచేయి లేదా వెన్నెముకనొప్పిని మొదటి పురస్కారంగా అందుకొంటాను. ఈ పనంతా వేసవి సెలవుల్లో పూర్తి చేస్తాను.

ఇంతా చేసి ఇదొక ముడి సరుకు మాత్రమే. ఇప్పుడు నేను పాఠకుడిగా రెండవ రూపంలోకి మారతాను. రచయితగా భావోద్వేగానికి గురై చూపించిన దృశ్యాన్ని పాఠకుడిగా అదే స్థాయిలో అనుభూతిస్తున్నానో లేదో పరీక్షించుకొంటాను. నేను తృప్తిపడేదాకా అనవసరతను కత్తిరించుకొంటూ, అవసరాన్ని చేర్చుకొంటూ, రెండవసారి రాస్తాను. అప్పటికీ తృప్తి పడకుంటే, మూడోసారి రాసేందుకు కూడా వెనకాడను. రాసేందుకు సిద్ధం కావడానికి ఏళ్ళు పడుతుంది. రాయడం మొదలు పెట్టిన తర్వాత కొన్ని రోజుల్లోనే పూర్తవుతుంది. నాకు టైప్ చేయడం రాదు. ఇప్పటికీ చేత్తోనే రాస్తుంటాను.

'కొండపొలం' వంటి పరిశోధనాత్మక నవల రాయడంలో మీకు ఎదురైన సవాళ్ళేమిటి?

నాది కాని జీవితం కొండపొలం. గొర్ల కాపర్ల తోటి నాకు జీవితకాలపు పరిచయం వుండొచ్చు. కష్టాలు పంచుకొనేంత దగ్గరితనం వుండొచ్చు. వాళ్ళు వాటితో మాట్లాడే భాష గురించి, చేసే ప్రయాణం గురించి, కలిసి జీవించే సాన్నిహిత్యం గురించి, గొర్లను పోషించేందుకు ఎదుర్కొనే కష్టాల గురించి సంపూర్ణ అవగాహన వుండొచ్చు. కానీ అవన్నీ 'గొర్లకాపరుల' గురించి మంచి వ్యాసం రాసుకోవడానికి పనికొస్తాయి. వాళ్లను పాత్రను చేసి నవల రాయాలంటే గొల్లవాడిగా మారితే తప్ప కుదరదు. నవల రాసే సమయంలో నేను అనుభవించిన మానసిక వేదనంతా గొర్లకాపరిగా మార్పు చెందేటందుకు పడిన యాతనే.

గొర్రెల మంద వెనక బొట్టికట్టె భుజాల మీద పెట్టుకొని నడుస్తూ వుంటే వాటి కాళ్ల కింద లేచిన దుమ్మును పీల్చుకొని ఊపిరితిత్తులు లబలబలాడ్డం, చీదిన చీమిడి రాల్చిన పెంటికల మదపు వాసనకు ముక్కుపుటాలు కుంచించుక పోవడం, దుమ్ము తెరలు కళ్లనిండా చేరి పుసులు కట్టడం, తక్కువ నీళ్ళతో శరీరం అలవాటు పడక రాత్రిళ్ళు మూత్రం చుక్కలు చుక్కలుగా మండుతూ కారటం, ఈ వెతలన్నీ అనుభవించే గొర్ల కాపరిగా మారితే గాని నవల ముందుకు సాగలేదు. నలభై కిలోమీటర్ల పరిధిలోని కొండలన్నీ తిరిగాను. నీళ్ళ తావులు చూశాను. రాత్రుళ్ళు మంటలు తగిలించి పక్కన పడుకొని భయం భయంగా నిద్ర పొలం చేశాను. మైళ్ళకొద్దీ దూరాన్ని ఏకబిగిన ఎక్కుతూ దిగుతూ ప్రయాణించాను. నల్లమల అడవులతో, గొర్ల కాపరులతో నాకు ప్రత్యక్ష అనుభవాలు లేకుంటే ఆ నవల రాయగలిగి ఉండేవాన్ని కాదు.

కొత్త రచయితలు నవలా రచనను చేపట్టాలంటే... మీరిచ్చే సూచనలు సలహాలేమిటి?

బాగా రాయాలనుకున్న వాళ్లు బాగా చదవాలి. చదవటం అనేది ఒక తీరని దప్పికగా మారాలి. ఒకప్పుడు చదవాలనుకొన్నా పుస్తకాలు దొరికేటివి కాదు. ఇప్పుడు అరుదైన పుస్తకాలు కూడా సులభంగా దొరుకుతున్నాయి. కానీ తీరిక సమయాన్ని చదవడానికి కేటాయించే వాళ్ళు తక్కువయ్యారు.

తొలకరింపుల్లో మా వూరి రైతులు కొందరు కృష్ణాజిల్లాలోని కంచికచెర్ల, కోదాడ సంతలకు పోతారు. వారం పదిరోజులు పల్లెలన్నీ తిరిగి ఎద్దుల్ని బేరంజేసి తెచ్చుకొంటారు. ఆ ప్రయాణాన్ని గురించి చిన్న విషయాన్ని కూడా వదలకుండా వాళ్ళు యేడాది పొడవునా చెబుతూనే వుంటారు. మనం బస్సెక్కి ఢిల్లీకి వెళ్ళి వచ్చినా మన పక్క సీట్లో కూచున్న వాన్ని పలకరించము. రచనలు చేసే వాళ్ళెపుడూ రైతుల్లాగా వుండాలి. మన చుట్టూ వున్న జీవజాలంతోటి సత్సంబంధాలే సాహిత్య సృజనకు ప్రధాన వనరు.

ఇంటర్వ్యూ ■ **కమల్**



AKBAR

కొండవీరుల చిందు

ఈ రోజు పొలంలో కొన్ని పక్షులు వాలాయి
నల్లమల చివరి దాపులో ఉండే మా ఊళ్లలో
ఏనాడూ అవి కనిపించింది లేదు
వాటినే చూస్తున్న నన్ను
పారతో కాలవ చెక్కుతున్న మా నాన్న
"పెందలాడే పని అయిపుచ్చుకొని పోవా" అన్నాడు.

వాటి రెక్కల మీద మబ్బులు తేలుతూ ఉన్నాయి.
మా నాన్న మాటలు వినకుండా వాటివైపు వెళ్లాను
"ఎక్కణ్నుంచి వస్తున్నారని" ఆరా తీశాను.

ఎవరో తమ గూళ్ళలో కత్తులూ, తుపాకులూ ఉంచారని
అవి వాటిని వేటాడుతున్నాయని చెప్పాయి.
ఆ చోటుని వదిలి కొండలు వెతుకుతూ ఇక్కడికొచ్చామన్నాయి
కానీ కొద్దిమందే మిగాలాయంటా.

"మీ గూళ్లలో ఎవరు వాటిని ఉంచారు?"

"మేం ఆ కొండలు పుట్టినప్పుడు పుట్టాం
ఆ కొండలు పెరుగుతుంటే వాటితోపాటూ
ఆటలాడుతూ పెరిగాం.
ఆ మధ్య తట్టున కొండల్లోనే మా నివాసం ఉండేది.
మా చోటుని ఎవరో ఆక్రమించుకుంటుంటే
కాపలాగా మా రెక్కలపై ఈ మబ్బులు వచ్చాయి.

ఈ మబ్బులను తొలగించాలని
ప్రభుత్వం అనేవాళ్ళు వెంటాడారు.
మా పూర్వీకమైన కొండలు
చెల్లాచెదురు దేహాలుగా విరిగిపోయాయి.
మేమంతా వాటికోసం ఏడ్చాం.
కొన్ని నెలలపాటు మేం అలుపులేకుండా
ఎగురుతూ ఏడుస్తూ ఉంటే
మాపై కత్తులూ, తుపాకులూ వచ్చి పడి
చాలా మందిమి చనిపోయాం.

అయినా మా కన్నీళ్లు కొండల్ని బతికిస్తాయని నమ్మాం.
మిగిలిన కొద్దిమందిమి వేరైపోయాం
ఎప్పటికైనా అవి బతికి చిగురేస్తే అక్కడికి వెళ్తాం."

అవి కన్నీళ్లు కారుస్తుంటే,
మా ఊరి చుట్టూ ఉన్న కొండలు రోదించాయి.
"మేం మీతోపాటు ఆ అడవుల్లోకి వస్తాం" అన్నాయి.

కొండలన్నీ ఏకమైనట్టు చుట్టూ మబ్బులు కమ్ముకున్నాయి.
ఆ పక్షులు అందులో తడుస్తూ
"కొండల్ని మింగేవాడి కోరపళ్ళు లాగుతాం
అడవుల్ని నలిపేవాడి చేతుల్ని పెరుకుతాం
మా పూర్వీకుల కొండలపై మళ్లీ మా గూళ్ళను కట్టుతాం
మా కన్నీళ్లు చిగురిస్తాయి
మా కన్నీళ్లు రాళ్లవుతాయి
మా కన్నీళ్లు అడివవుతుంది
తుపాకులనూ, కత్తులనూ మా కొండలు నుజ్జుచేస్తాయి
మేం అడివి లేత ఆకుల మీద వాలి
ఈ పాటలు వినిపిస్తాం
సెలయేరుల మీద ఎగిరి ఈ పాటలను వల్లిస్తాం
మా కన్నీళ్లు చిగురిస్తాయి
మా అడవులు కొండల్ని కంటాయి" అని పాడుతుంటే
మా కొండలన్నీ మెరుపుల్నీ ఉరుముల్నీ
బల్లెములుగా, ఈటెలుగా పట్టుకొని చిందాడాయి.

"వాన పడుతుంది. పోదాం"
అని మా నాన్న ఇంటికి తీసుకొచ్చాక కూడా
రాత్రంతా ఆ పాట వినిపిస్తూనే ఉంది
కొండలు చిందాడుతూనే ఉన్నాయి.

■ **గూండ్ల వెంకట నారాయణ**
70325 53063

సోమవారం 16 సెప్టెంబరు 2024

వివిధ

vividha@andhrajyothy.com

సాహిత్య వేదిక

బొమ్మలు: అక్బర్

తాటికొండాల సాహిత్య పురస్కారాలు

కథా రచయత, నాటక ప్రయోక్త, పరిశోధకుడు, నంది అవార్డు గ్రహీత తాటికొండాల నరసింహారావు సతీమణి తాటికొండాల భ్రమరాంబ సాహిత్య పురస్కారాల సభ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో సెప్టెంబర్ 21 సాయంత్రం 6 గంటలకు దొడ్డి కొమరయ్య హాలు, సుందరయ్య విజ్ఞాన కేంద్రం, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్‌లో జరుగుతుంది. 2023కి గాను ఎస్. గోపి, 2024కి గాను ప్రసేన్ పురస్కారాలను స్వీకరిస్తారు. సభలో నందిని సిధారెడ్డి, ఏనుగు నరసింహారెడ్డి, గౌరీశంకర్, సీతారాం, యాకూబ్, ఆనందా చారి, ఎస్. రఘు ప్రసంగిస్తారు. వివరాలకు: 95734 27422

వంశీకృష్ణ

ఉపాధ్యాయులతో జ్ఞాపకాలు

సంగీత సాహిత్య నృత్య నాటక సంస్థ 'సంస్కృతి' (గుంటూరు) ఉపాధ్యాయులపై ఒక ప్రత్యేక సంచికను ప్రచురించబోతున్నది. మీ ఉపాధ్యాయుల గొప్పతనాన్ని, మానవీయ కోణాన్ని తెలియచేసే సంఘటనలు, మీకు వారితో ఉన్న అనుబంధం గురించి రాసి 9440320580 నంబర్‌కి వాట్సాప్ ద్వారా పంపితే, ప్రచురణార్హత ఉన్న వాటిని పుస్తక రూపంలో తెస్తాం.

యస్. బాలచందర్

కాళోజీ పురస్కారం


తెలంగాణ మహిళా సాహిత్య, సాంస్కృతిక సంస్థ ప్రతి ఏటా అందించే కాళోజీ పురస్కారానికి రాయారావు సూర్యప్రకాశ్ రావు ఎంపికయ్యారు. మహబూబ్ నగర్ లోని భారత్ స్కౌట్స్ భవనంలో సెప్టెంబర్ 22న జరిగే సభలో ఆయన ఈ పురస్కారాన్ని స్వీకరిస్తారు.

రావూరి వనజ

నా మొదటి పుస్తకం

ఆనాటి 'మండుతున్న తరా'నికి అంకితమిచ్చాను!

– నిఖిలేశ్వర్



వ్యక్తిగతంగా నా మొదటి కవితా సంపుటి 'మండుతున్న తరం' 1972 అక్టోబర్‌లో వెలువడింది. అంతకు పూర్వమే 1965-68 మధ్య 'దిగంబరకవులు' మూడు సంకలనాల్లోని ఆరుగురు కవులలో ఒకడిగా నా కవితలున్నాయి. వాటిని మినహాయించి, నేను 1969-1972లో రాసిన కవితల్లోంచి ఏరి 24 కవితలను 'మండుతున్న తరం'లో చేర్చాను. ఈ కవితలన్నీ వివిధ పత్రికల్లో ఆ కాలంలో వెలుగు చూసినవే!

అసలు 1960 నుంచి 1965 వరకు కె. యాదవరెడ్డిగా రాసిన కవితలన్నీ ఒక సంపుటిగా ఆనాడే రావలసింది. వచన కవితోద్యమ రోజులవి. స్వంత ఖర్చుతో ఎవరికి వారు పుస్తకం వేసుకోవలసిందే తప్ప పబ్లిషర్స్ లేరు. నేను ఆర్థికంగా వెలుసుబాటు లేనందువల్ల, వడ్డీకి అప్పు చేసి పుస్తకం అచ్చు వేయించాలనే ధైర్యం లేక ప్రచురించలేదు. 1970లో విరసం ఆవిర్భావం తర్వాత, సంస్థాగత నిమగ్నత వల్ల 1972 దాకా ఆగవలసి వచ్చింది.

ఆనాడు అందరి మిత్రులు 'నవయుగ పబ్లిషర్స్' సాంబశివరావు గారు ప్రచురణ పరంగా ఆదరించారు. తెనాలిలోని భారతీప్రెస్‌లో నా 'మండుతున్న తరం' తోపాటు, జ్వాలాముఖి, సి.యస్. రావు రచనలను కూడా ముద్రించారు. 60 పేజీలలో 24 కవితలతో చిత్రకారుడు చంద్ర వేసిన ముఖచిత్రంతో, రెండు రూపాయల వెలతో 1972లో వెలువడింది.



నేను 'విరసం' సంస్థాపక సభ్యుడిగా తర్వాత కార్యదర్శిగావున్న రోజులవి. ఈ మొదటి సంపుటిని- "ఈ దేశంలో రాజుకొన్న/ శ్రామిక విప్లవం కోసం/ మహత్తరమైన మార్పు కోసం/ మండిన – మండుతున్న/ ఈనాటి తరం కోసం" అని అంకితమిచ్చాను. ఈ సంపుటిలోని 'భయం' కవిత వివిధ భాషల్లోకి అనువాదమై ప్రశంసలు పొందింది. 'రక్తాన్ని చిందించిన కత్తి' ఏడు పేజీల దీర్ఘ కవిత– ఇది ఇతివృత్తంతో కూడినది. 'కంటి లోంచి జారిపోతున్న జైత్రిపోతు' కవిత ఆనాటి ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సందర్భంగా విమర్శనాత్మకంగా రాసిన ఖండిక. ఇక ఈ సంపుటిపై వచ్చిన సమీక్షల్లో 'ఆంధ్రజ్యోతి' వీక్లీలో ఇంద్రగంటి శ్రీకాంతశర్మ గారి సమీక్ష పేర్కొనదగినది.

ఈ పుస్తకానికి 'ఈ కవిత్వం ఎందుకు' అని నేనే ముందు మాట రాసి ఆనాటి పరిస్థితులను వివరించాను. 1969-70లో ప్రత్యేక తెలంగాణ ఉద్యమం దారి తప్పి, యువకుల త్యాగాలతో కొందరు నాయకులు గద్దెనెక్కారని ఎండగట్టాను. విప్లవ యువతను మండుతున్న తరంగా (The burning generation) భావించి, విప్లవ కవితా ఝంఝ విస్తృతంగా వీస్తూనే ఉంటుందని- "సమాజం లోంచి ప్రతిధ్వనించి తిరిగి సమాజం లోకి- శాస్త్రీయ మార్క్సిస్టు దర్శనం దిక్కు చూపించగా ఆనాటి యువతరం తిరుగుబాటు, నక్సల్బరీ – శ్రీకాకుళ పోరాటాల ఊపునిచ్చి ముందుకు తోశాయి" అని కవితల నేపథ్యాన్ని స్పష్టం చేశాను.

✆ 91778 81201

'ఆమె' జయించిన అడవి



'ఆమె అడవిని జయించింది' అన్న గీతాంజలి గారి నవల పేరు వినగానే వెంటనే స్ఫురించేది కేశవరెడ్డి గారి 'అతడు అడవిని జయించాడు' నవల. పురుషాధిక్య సమాజాల్లో 'అతడు' జయించడం ఉంటుంది గానీ, 'ఆమె' జయించటం ఉంటుందా?

గీతాంజలి 'ఆమె అడవిని జయించింది' నవల శీర్షికలో 'అడవి' అంటే– విశృంఖలతకూ, బంధనాలకూ, చీకటికీ, అజ్ఞానానికీ, కట్టుబాట్లకూ, యథాతథ స్థితికీ, అమాయకత్వానికి అర్థంపర్థంలేని ప్రేమలకూ, మోహాలకూ ప్రతీక. అడవిని జయించడం అంటే, వెలుగుని కనుక్కోవడం.

సమాజ దాష్టీకాల్ని మార్క్సిస్ట్ జ్ఞానంతో నిలవరించడం నేర్చుకున్న జానకి కథను రంగనాయకమ్మ 'జానకి విముక్తి' నవలలో చెప్పిన తర్వాత, కళా గీత 'వెనుదిరగని వెన్నెల' నవలలో స్త్రీ భావోద్వేగాలనీ, సమస్యల్నీ చిత్రిస్తూ, పరిష్కారాల దిశగా ప్రయత్నం చేసిన తర్వాత, అదేకోవలో గీతాంజలి 'ఆమె అడవిని జయించింది' నవల స్త్రీ భావోద్వేగాల్ని బలంగా ప్రతిఫలిస్తుంది.

సంధ్య వైద్య విద్యార్థినిగా చంద్రంతో రిలేషన్‌లో ఉంటూ ప్రేమా మోహాల్లో మునిగి తేలుతూ ఒక బిడ్డని కనడం, సిద్ధార్థ అనే కొలీగ్‌తో మోహంలో పడటం, ఎలానో బయటపడటం, అత్త మామల, తల్లిదండ్రుల ఫ్యూడల్ ఆచార వ్యవహారాల్ని నిరసిస్తూ బలహీనవర్గ స్త్రీ సామాజికంగా, కుల పరంగా, ఆరోగ్యపరంగా ఎదుర్కొనే ఆరళ్ళకు పరిష్కార మార్గాన్ని అన్వేషించడం... ఇలా ఆమె అడవి నుంచి వెలికి రావడం స్థూలంగా ఈ నవల కథాంశం. కథనం ఉత్తర తెలంగాణ యాసలో సమ్మోహనంగా సాగుతుంది. ఒక్కోసారి చైతన్య స్రవంతి టెక్నిక్‌ని వాడతారు రచయిత్రి. సంధ్యలో కాంట్రాడిక్టరీ ఎలిమెంట్స్‌ను సహజంగా చిత్రీకరించారు గీతాంజలి. ఎక్కడా మాస్కులుండవు, ముసుగులుండవు! సంధ్య, చంద్రం, సిద్ధార్థ– ఈ పాత్రలు కళ్ళ ముందు కనపడే వ్యక్తుల ప్రతీకలు. రియల్ లైఫ్ వ్యక్తిత్వాలు.


స్త్రీ మాంసాన్ని సౌందర్యారాధన పేరుతో కళ్ళతోనే కబళించే తన భర్త చంద్రాన్ని ఒకవైపు చీదరించుకుంటూనే, అవే ఎంగిలి చూపులు తనని తడుముతుంటే సంధ్య దాన్ని రొమాన్స్‌గా ఫీలవడంలోని నేలబారు భావాల్ని వెరపు లేకుండా చిత్రిస్తారు రచయిత్రి. సంధ్య ఒకపక్క భర్త చంద్రం గుండెలపై సేదతీరుతుంది, మరోపక్క మూడేళ్ల నుంచీ "నువ్వు కావాలి" అంటూ వెంటాడే సిద్ధార్థ "అనురాగ వర్షంలో తడిచి"పోతుంది, గుండె కరిగి అతని వైపు ప్రవహిస్తుందేమోనని "వణికి" పోతుంది. ఇలా సంధ్యలోని మీనెస్ట్ కోణాన్నీ, అంతకంటే దిగజారి "నీకు ఇష్టమైతే అతనితో వెళ్ళు, కానీ ఇలా దుఃఖించకు" అంటూ ఓదార్చే చీపెస్ట్ చంద్రం టేస్ట్‌నూ నిర్భయంగా వెల్లడిస్తారు రచయిత్రి.

ఇంత అమాయకంగా, ఇంత రొమాంటిక్‌గా, ప్రేమలకూ మోహాలకూ మొహం వాచిపోయినట్టు ఉండే సంధ్య క్రమంగా మహిళా సమస్యల పట్ల అవగాహన పెంచుకుంటుంది. తర్వాత ఆ అవగాహనతో, "చదువుకుంటూ, తింటో, తిరుగుతో, బట్ట కడుతో, చంద్రంతో సుఖపడుతో, పిల్లల్ని కంటో, వాళ్ళ జంజాటంలో పడి నలిగి, పిగిలి, రంగు మాసి, వ్యక్తిత్వం మారి, జీర్ణ వస్త్రంలా మిగలకుండా," కొత్తిమీర మొక్కంతైనా ఉపయోగపడాలన్న ఉద్దేశంతో, స్త్రీ సమస్యలపై పోరాడే 'మానవి' సంస్థ తలుపు తడుతుంది. అక్కడి చర్చలకు మొహమెత్తి, తేజస్విని అందించిన చైతన్యంతో స్త్రీ విమోచన దిశగా అడుగులు వేస్తుంది.

ప్రేమలూ, మోహాలూ, బాంధవ్యాల కీకారణ్యంలో అల్లుకుపోయిన తీగ వలల్ని ఛేదించుకొని, అజ్ఞానపు చీకటి పొరలని చీల్చుకొని, కుళ్ళిన సమాజానికి స్కాల్పెల్ సరిపోదనీ, 'మానవి' సంస్థ లాంటి బిహేవియరల్ థెరపీలు కూడా చాలవనీ అర్థం చేసుకుని, చివరకు విమోచన మార్గాన్ని ఎంచుకున్న సంధ్య... అడవిని జయిస్తుంది.



■ **వి. విజయకుమార్**
✆ 85558 02596



బేగంపేట టు సికింద్రాబాద్

సోమాజీగూడ పుల్లారెడ్డి బస్ స్టాప్:
పగలంతా నేతి వాసన తాగీతాగీ
రాత్రిపూట మత్తుగా తూలుతోంది

చివరి సికింద్రాబాద్ బస్సు
చినుకుల మధ్య నుంచి రివ్వున దూసుకొచ్చి
దేహాన్ని వెచ్చగా తాకింది

ఎక్కీఎక్కగానే
పాతికేళ్ల క్రితం
ఆకలితో తిరిగిన రోజులన్నీ
ఖాళీ సీట్ల మీద
చెల్లాచెదురుగా కనిపించాయి

పోలీస్ లైన్ బస్ స్టాప్:
నీరసంగా ఎక్కిన ముసలామె సంచిలో
రేపటి బతుకు తండ్లాట

ఆమె నీరసస్వరంలో ఏదో విశ్వాసం
నా గుండెకింద ధైర్యంగా వినపడింది

రసూల్ పుర బస్ స్టాప్:
ఈదురుగాలికి ముడుచుకొని
కుంటి కుక్కతో కలిసి కునుకు తీస్తోంది
ఆకలేసి ఆర్డర్ క్యాన్సిల్ చేసుకున్న స్విగ్గి కుర్రాడు
వచ్చిన కలెక్షన్ ఎంతో
పోయిన కమిషన్ ఎంతో
లెక్కలేసుకుంటున్నాడు

ప్యారడైజ్:
నాగరికత దుప్పట్లో దూరి
సాయంత్రం అమ్మగా మిగిలిన మల్లెపూలని
వుండగా చుట్టి తలకింద పెట్టుకుని
నిద్ర నటిస్తోంది

ప్యాట్నీ:
ఎంతకీ రక్తి కట్టని దారుల్లో
హరేక్ మాల్ బండి ఒకటి భంగపడి
టార్పాలిన్ చుట్టుకుని
పక్కకు ఆగిపోయింది
ఆకలి మంటతో బీడీ వెలిగించుకొని
అతడు బెంజ్ కారుకి దారిచ్చి
తొలగిపోయాడు

సికింద్రాబాద్:
బడుగు జీవులను మోసీ మోసీ
అలసిన బస్సు దూరంగా నడుం వాల్చింది
రేపటి కోసం
మెహిదీపట్నం బోర్డును తగిలించుకొని
నిద్రలోకి జారుకుంది

■ **రత్నశ్రీ**
✆ 98488 48001

ఆయిల్‌పామ్ రైతులకు సర్కారు అండ

- తెలంగాణ ఆయిల్‌ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి

బాలసముద్రం, సెప్టెంబరు 15: రాష్ట్రంలో ఆయిల్‌పామ్ పంటలు సాగు చేస్తున్న రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా పని చేస్తోందని తెలంగాణ ఆయిల్‌ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు కేంద్ర ప్రభుత్వం దిగుమతి సుంకాన్ని 5.5 శాతం నుంచి 27.5 శాతానికి పెంచాలని కోరినట్లు తెలిపారు. సెప్టెంబరు 13న కేంద్ర ప్రభుత్వం ముడి పామ్‌ఆయిల్ దిగుమతిపై సుంకాన్ని పెంచి ఉత్తర్వులు జారీ చేసినట్లు జంగా రాఘవరెడ్డి పేర్కొన్నారు. రైతులు వరికి బదులు పామాయిల్ సాగు చేస్తే అధిక లాభాలు పొందవచ్చని జంగా రాఘవరెడ్డి ప్రకటనలో కోరారు.



హనుమకొండలోని పద్మాక్షి, సిద్ధేశ్వర గుండాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, మేయర్ గుండు సుధారాణి



హనుమకొండ సిద్ధేశ్వర గుండం వద్ద నిమజ్జన ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం



నిమజ్జనానికి వేళాయే..

- నేటితో ముగియనున్న గణపతి నవరాత్రి ఉత్సవాలు
- చెరువుల వద్ద ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- క్రేన్లు, గజ ఈతగాళ్లు, తెప్పలు, సిబ్బంది కేటాయింపు
- ప్రదేశాలను సందర్శించిన ఎమ్మెల్యే నాయిని, మేయర్ సుధారాణి
- నేడు నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు, మద్యం షాపులు బంద్

హనుమకొండ కల్చరల్/వరంగల్ క్రైం, సెప్టెంబరు 15: కనులపండువగా సాగిన గణపతి నవరాత్రి ఉత్సవాలు చివరి అంకానికి చేరుకున్నాయి. తొమ్మిది రోజుల పాటు మండపాల్లో జోరుగా పూజలందుకున్న గణేష్ ప్రతిమల నిమజ్జనోత్సవానికి వేళైంది. సోమవారం గణేష్ నిమజ్జనోత్సవానికి నగర పాలక సంస్థ, పోలీసు యంత్రాంగం విస్తృత ఏర్పాట్ల చేసింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ప్రశాంతంగా నిమజ్జనోత్సవానికి సన్నద్ధమైంది. వరంగల్, హనుమకొండ, కాజీపేట ప్రాంతాల్లో సుమారు మూడున్నర వేల విగ్రహాల నిమజ్జనోత్సవానికి అధికార యంత్రాంగం సిద్ధం చేసింది. సోమవారం ఉదయం పూజలు నిర్వహించిన అనంతరం గణపతులను తరలించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేసుకున్నారు.

చెరువుల వద్ద ఏర్పాట్లు పూర్తి

వినాయక నిమజ్జనం ప్రశాంతంగా పూర్తిచేసేందుకు యంత్రాంగం చెరువుల వద్ద భారీగా ఏర్పాట్లు చేసింది. వరంగల్ ప్రాంతంలో 8 చెరువుల్లో 20 క్రేన్లు, 95 ఈతగాళ్లు, 15 బోట్లు, 675 సిబ్బంది 49 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఇక్కడ బందోబస్తుకు ఐదుగురు సీఐలు, ముగ్గురు ఎస్‌ఐలు విధులు నిర్వహించనున్నారు. కాగా, హనుమకొండ, కాజీపేట నగరాల్లో 8 చెరువుల్లో నిమజ్జనానికి ఏర్పాట్లు చేశారు. 11 క్రేన్లు, 60 ఈతగాళ్లు, 14 బోట్లు, 86 సీసీ కెమెరాలు, 465 సిబ్బందిని ఏర్పాట్లు చేశారు. ఆరుగురు సీఐలు, ఇద్దరు ఎస్‌ఐలు బందోబస్తు నిర్వహించనున్నారు.

పరిశీలించిన ఎమ్మెల్యే, మేయర్

గణేష్ నిమజ్జనోత్సవం జరుగనున్న నేపథ్యంలో ఆదివారం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, మేయర్ గుండు సుధారాణి, కుడా అధికారులు, ఇరిగేషన్ సిబ్బందితో కలిసి హనుమకొండలోని పద్మాక్షి గుండం, 49వ డివిజన్‌లోని బంధం చెరువులను సందర్శించారు. చిన్న గణపతులను నేరుగా వేసుకునే విధంగా, సిద్ధేశ్వర గుండం చుట్టూ తాత్కాలిక ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి ఆదేశించారు. భారీ గణపతులు నిమజ్జనానికి వచ్చినప్పుడు అవసరమైన భారీ క్రేన్లను సిద్ధంగా ఉంచాలని, అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా గజ ఈతగాళ్లను కూడా సిద్ధంగా ఉంచాలని రాజేందర్‌రెడ్డి ఆదేశించారు.



కాజీపేట బంధం చెరువు వద్ద..

భారీగా పోలీసు బందోబస్తు

వరంగల్ మహానగరంలో వినాయక నిమజ్జనానికి జిల్లా యంత్రాంగం పకడ్బందీగా ఏర్పాటు చేసింది. ప్రధానంగా శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా ట్రై సిటీస్‌లో నిర్వహించే శోభాయాత్ర ప్రశాంతంగా జరిగేలా పోలీసులు భారీగా బందోబస్తు ఏర్పాట్లు చేశా రు. నాలుగు రోజులుగా వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ ట్రై సిటీస్‌లోని నిమజ్జన ప్రదేశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఏర్పాట్లను సమీక్షించా రు. ట్రై సిటీస్‌లో 3,600 వరకు విగ్రహాలుండగా, వీటిలో 380 విగ్రహాలు 10 పీట్లకు పైనవి ఉన్నాయి. శోభాయాత్ర ప్రశాంతంగా జరిగేందుకు కమిషనరేట్ పరిధిలోని ట్రైసిటీస్‌లో 2,500 మందితో పోలీసు బందోబస్తు నిర్వహించనున్నారు. ఇప్పటికే ఎవరు ఏ ప్రాంతంలో విధులు నిర్వహించాలో స్టేషన్‌ల వారిగా జాబితాను కమిషనరేట్ అధికారులు స్టేషన్‌లకు అందించారు. సోమవారం ఉదయం శోభాయాత్రలు ప్రారంభం కానున్నప్పటికీ పూర్తిస్థాయిలో నిమజ్జన కార్యక్రమం మంగళవారం మధ్యాహ్నం వరకు జరిగే అవకాశం ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఉదయం 6గంటల నుంచి మంగళవారం 6గంటల వరకు మద్యం షాపులు బంద్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

ట్రాఫిక్ ఆంక్షలు

వరంగల్, హనుమకొండ, కాజీపేట ప్రాంతాల్లో వినాయక నిమజ్జనం సందర్భంగా నగరంలో శోభాయాత్ర నిర్వహించనున్నారు. ఈ మేరకు ట్రాఫిక్‌కు అంతరాయం జరుగకుండా వాహనాలకు ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తూ సీపీ అంబర్ కిషోర్ ఝూ ఆదేశాలు జారీ చేశారు. సోమవారం మధ్యాహ్నం 12గంటల నుంచి మంగళవారం ఉదయం 10గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు కొనసాగనున్నాయి.

వినాయక మండళ్లకు సూచనలు

- సిద్ధేశ్వర గుండంలో నిమజ్జనం చేసే 6 అడుగుల ఎత్తు వరకు విగ్రహాలు ట్రాక్టర్, టాటా ఏస్ వంటి

మిగతా 6వ పేజీలో..

నిమజ్జన ప్రదేశాలు

- వరంగల్ డివిజన్ ఇంతేజార్‌గంజ్ పీఎస్ పరిధిలో చిన్న వడ్డెపల్లి, విఎల్స్‌కాలనీ పీఎస్ పరిధిలో ఉర్సు గుట్ట చెరువు, అగర్తల చెరువు, గుండు చెరువు, గీసుగొండ పీఎస్ పరిధిలో కట్టమల్లన్న చెరువు, మామునూరు పీఎస్ పరిధిలో బెస్తం చెరువు, పెద్ద చెరువు.
- హనుమకొండ డివిజన్‌లోని హనుమకొండ పోలీస్ స్టేషన్ పరిధిలో పద్మాక్షి చెరువు, కేయూసీ పీఎస్ పరిధిలో భీమారం, గుండ్లసింగారం, సుబేదారి పీఎస్ పరిధిలో శాయంపేట చెరువు.
- కాజీపేట డివిజన్‌లోని హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలో పెద్ద చెరువు, కాజీపేట పీఎస్ పరిధిలో బందం చెరువు, మడికొండ పీఎస్ పరిధిలో చల్లచెరువు, కడిపికొండ బతుకమ్మ చెరువు.

ట్రాఫిక్ ఆంక్షలు ఇలా..

- ములుగు, భూపాలపల్లి నుంచి హైదరాబాద్ వెళ్లే భారీ వాహనాలు ఆరెపల్లి వద్ద ఓఆర్‌ఆర్ నుంచి వెళ్లాలి. ఖమ్మం వెళ్లాల్సిన వాహనాలు ఆరెపల్లి ఓఆర్‌ఆర్ నుంచి కరుణాపురం, మడికొండ, కడిపికొండ, నాయుడు పెట్రోల్‌పంపు నుంచి వెళ్లాలి.
- భూపాలపల్లి, పరకాల నుంచి నర్సంపేట వైపు వెళ్లాల్సిన వాహనాలు కొత్తపేట, రెడ్డిపాలెం, జాన్‌పీరీల్, గొర్రెకుంట నుంచి వెళ్లాలి.
- ములుగు, పరకాల నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు పెద్దమ్మగడ్డ నుంచి కేయూసీ, అంబేద్కర్ సెంటర్, ఏషియన్‌మాల్ మీదుగా హనుమకొండ బస్టాండ్ చేరుకోవాలి.
- హనుమకొండ బస్టాండ్ నుంచి ములుగు, కరీంనగర్‌వైపు వెళ్లే బస్సులు ఏషియన్‌మాల్, అంబేద్కర్ సెంటర్, సీపీవో, కేయూ జంక్షన్ మీదుగా వెళ్లాలి.
- హనుమకొండ బస్టాండ్ నుంచి నర్సంపేట, కొత్తగూడెం, భద్రాచలం, తొర్రూరు, ఖమ్మం వైపు వెళ్లాల్సిన బస్సులు బాలసముద్రం, అదాలత్, హంటర్‌రోడ్ మీదుగా వెళ్లాలి.
- వరంగల్ బస్టాండ్ నుంచి హనుమకొండకు వచ్చే బస్సులు చింతల్ బ్రిడ్జి నుంచి రంగశాయిపేట మీదుగా నాయుడు పెట్రోల్‌పంపు, ఉర్సుగుట్ట, అదాలత్, బాలసముద్రం మీదుగా హనుమకొండకు చేరుకోవాలి.





సమావేశంలో మాట్లాడుతున్న సీపీ అంబర్ కిషోర్ ఝూ

19న మిలాద్ ఉన్ నబీ ఉత్సవాలు

- సీపీ సూచనతో ముస్లిం పెద్దల అంగీకారం

వరంగల్ క్రైం, సెప్టెంబరు 15: వినాయక నిమజ్జనం సోమవారం ఉన్నందున 16వ తేదీన నిర్వహించుకోవాల్సిన మిలాద్ ఉన్ నబీ ఉత్సవాలను వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ సూచన మేరకు 19న నిర్వహించుకునేందుకు ముస్లిం మతపెద్దలు అంగీకారం తెలిపారు. ఆదివారం కమిషనర్ కార్యాలయంలో ట్రై సిటీస్‌కు చెందిన ముస్లిం మత పెద్దలు, శాంతి కమిటీతో సీపీ అంబర్ కిషోర్ ఝూ సమావేశం నిర్వహించారు. సోమవారం మిలాద్ ఉన్ నబీ ఉత్సవాలు ఉండగా, అదే రోజున వినాయక నిమజ్జనం ఉండటంతో సమస్యలు తలెత్తకుండా ముస్లిం పెద్దలతో సీపీ చర్చించారు. ఈ మేరకు ఈనెల 19న మిలాద్ ఉన్ నబీ ఉత్సవాలు నిర్వహించుకునేందుకు ముస్లిం పెద్దలు అంగీకారం తెలిపారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ప్రతీ మతం వారు క్రమశిక్షణతో వ్యవహరిస్తూ వారికి సంబంధించిన ఉత్సవాలు ప్రశాంతవాతావరణంలో జరుపుకోవాలన్నారు. మత సామరస్యం విషయంలో వరంగల్ నగరం.. ఇతర ప్రాంతాలకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ఈ సమావేశంలో డీసీపీ రవిందర్, ఏసీపీలు జితేందర్‌రెడ్డి, నందిరాంనాయక్, దేవేందర్‌రెడ్డి, కిషోర్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరస్తుడి అరెస్టు

వరంగల్ క్రైం, సెప్టెంబరు 15: దేశవ్యాప్తంగా పెట్టుబడుల ముసుగులో ప్రజలను మోసం చేస్తున్న రాజస్థాన్‌కు చెందిన సైబర్ నేరస్థుడిని వరంగల్ సైబర్ క్రైం పోలీసులు శనివారం రాత్రి అరెస్టు చేశారు. ఈ అరెస్టుకు సంబంధించిన వివరాలను ఆదివారం సైబర్ క్రైం ఏసీపీ విజయ్‌కుమార్ వెల్లడించారు. రాజస్థాన్ రాష్ట్రం దేగానా పట్టణానికి చెందిన కాలురామ్ కొద్ది రోజులుగా ఆన్‌లైన్ పెట్టుబడి పేరుతో మోసం చేస్తున్నట్లు ఏసీపీ తెలిపారు. కాలురాం దేశవ్యాప్తంగా పన్నెండు నేరాలు చేసాడని ఆయన అన్నారు. ఇందులో తెలంగాణలో రెండు నేరాలకు పాల్పడ్డాడని ఆయన పేర్కొన్నారు. ఇటీవల హనుమకొండకు చెందిన వైద్యుడిని నమ్మించి రూ.21 లక్షలు పెట్టుబడి పెట్టించి మోసం చేసినట్లు ఆయన అన్నారు. వైద్యుడు తమకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టి శనివారం కాలురామ్‌ను రాజస్థాన్‌లో అరెస్టు చేసినట్లు ఆయన వివరించారు. ప్రెస్‌మీట్‌లో సీఐ రవికుమార్, ఎస్‌ఐలు చరణ్, రవికుమార్ పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ విజయ్‌కుమార్

ఆరోగ్య పరిరక్షణే పరమావధిగా..

- గర్భిణులు, చిన్నారుల కోసం పోషణ మాసం
- అంగన్వాడీ కేంద్రాల్లో నిర్వహణ
- పోషణాహారంపై అవగాహన కార్యక్రమాలు
- పోషకాహార లోపాల పిల్లల గుర్తింపు సర్వే
- ఈ నెల 30తో ముగింపు

హనుమకొండ సిటీ, సెప్టెంబరు 15: గర్భిణులు, బాలింతలు, పిల్లల ఆరోగ్య పరిరక్షణ, పోషకాహార ప్రాముఖ్యత తదితర అంశాల ప్రాతిపదికగా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 'పోషణ మాసం' కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ నెల 2వ తేదీ నుంచి ప్రారంభమైన 'పోషణ మాసం'లో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ, సివిల్ సప్లయిస్, డీఆర్‌డీవో తదితర శాఖలు కూడా భాగస్వామ్యమయ్యాయి. మొత్తం నాలుగు ప్రధాన అంశాల ప్రణాళికతో కార్యక్రమ నిర్వహణ జరుగుతోంది.

పోషణ మాసం ప్రాముఖ్యత

కేంద్ర ప్రభుత్వం 2018 నుంచి దేశ వ్యాప్తంగా అంగన్వాడీ కేంద్రాల్లో రెండు ప్రధాన కార్యక్రమాలను నిర్వహణను ప్రవేశపెట్టింది. ఇందులో యేటా మార్చి మాసంలో 'పోషణ్ పక్వాడ' ఒకటి కాగా, సెప్టెంబరులో 'పోషణ మాసం' రెండోది. ఈ రెండు కార్యక్రమాల నిర్వహణ ద్వారా గర్భిణులు, బాలింతలు, 0-6 పిల్లలకు పోషకాహారం అందజేత, ఆరోగ్య పరిరక్షణ, పరిశుభ్రత, పిల్లల విద్యా ప్రాముఖ్యత తదితర అంశాలపై అవగాహన కల్పించడం ద్వారా ఆరోగ్య లక్ష్యాలను సాధించవచ్చనే ఉద్దేశంతో కేంద్రం నిర్వహణ ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ఈ కార్యక్రమాల నిర్వహణ చేపడుతున్నాయి. హనుమకొండ జిల్లాలోని 788 అంగన్వాడీ కేంద్రాల్లో పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ నెల 30న పోషణ మాసం ముగుస్తుంది.



అంగన్వాడీ కేంద్రంలో పోషణ మాసం నిర్వహణ (ఫైల్)

నాలుగు ప్రధాన అంశాలు

ఈ నెల 2వ తేదీ నుంచి ఆరంభమైన పోషణ మాసంలో నాలుగు ప్రధాన అంశాలు ప్రణాళికగా ఉన్నాయి. తొలి వారంలో నగరాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతీ అంగన్వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, పిల్లలను సమీకరించి పోషణమాసం ప్రాముఖ్యతను తెలియచేయడం, వయస్సుకు తగిన బరువు లేని పిల్లలను గుర్తించడం, బాలామృతాన్ని అందచేయడం, తల్లి పాల ప్రాముఖ్యతను వివరించడం, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించడం, గర్భిణులు, బాలింతల గృహాలను సందర్శించడం కుటుంబ సభ్యులకు వారి ఆరోగ్య పరిరక్షణ చర్యలను వివరించడం, పెరటి తోటల పెంపకాన్ని ప్రోత్సహించడం, రక్తహీనతతో ఉన్న వారిని గుర్తించి చికిత్సలు అందించేయడం, అంగన్వాడీ కేంద్రాల పరిధిలో విస్తృత ర్యాలీలు నిర్వహించడం వంటి నాలుగు ప్రధాన అంశాలతో పోషణ మాసాన్ని నిర్వహిస్తున్నారు.

పోషకాహారంతోనే ఆరోగ్య పరిరక్షణ

పోషణ మాసంలో ప్రధానంగా పోషకాహార ప్రాముఖ్యతను మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బంది, అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు గర్భిణులు, బాలింతలకు వివరిస్తున్నారు. పోషకాహార లోపంతోనే గర్భిణుల్లో రక్తహీనత, పిల్లలు వయస్సుకు తగిన బరువు, ఎదుగుదల లేకపోవడం, మానసిక రుగ్మతలు చోటు చేసుకుంటున్నట్లు అధికారులు చెబుతున్నారు.

ఈ కారణంగానే గతంలో సూచించిన బలవర్ధక ఆహారంతో పాటు ఈ సారి చిరు ధాన్యాల ప్రాముఖ్యతను ఇంటింటి ప్రచారంలో తెలియచేస్తున్నారు. పెరటితోటల పెంపకం వల్ల రసాయనాల ప్రభావం లేని కూరగాయలను పండించుకోవడం, తద్వారా ఆరోగాన్ని పరిరక్షించుకోవచ్చని సూచిస్తున్నారు. ఈ సారి చేపట్టిన పోషణ మాసంలో పెరటి తోటల పెంపకం ప్రాధాన్యత అంశంగా అధికారులు చెబుతున్నారు.

పోషణ మాసానికి ఆటంకాలు

పోషణ మాసంలో ప్రధానంగా మహిళా, శిశు సంక్షేమ శాఖ, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖల పాత్రే కీలకం. మిగతా ప్రభుత్వ శాఖలు భాగస్వాములుగా ఉన్నప్పటికీ ఆరోగ్యం అంశంగా చూస్తే ఈ రెండు శాఖలే ప్రధానం. అయితే రెండు శాఖల మధ్య సమన్వయం లేకపోవడంతో పోషణ మాసం కార్యక్రమ నిర్వహణ సక్రమంగా సాగడం లేదని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. రెండు శాఖల అధికారులు, సిబ్బంది కలిసి కార్యక్రమాల్లో సంపూర్ణంగా పాల్గొనడం లేదు. ఇక అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లలో కొందరు సంపూర్ణ ఆరోగ్యం, పోషకాహారం, పిల్లలకు పూర్వ ప్రాథమిక విద్య బోధనలో అవగాహన లేమి కారణంగా కూడా లక్ష్యాలు నెరవేరడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

గర్భిణులు, బాలింతలు, పిల్లలకు వివరించడంలో అవగాహన లేమి కారణంగా విఫలమవుతున్నట్లు విమర్శలు ఉన్నాయి. జిల్లా అధికారుల పర్యవేక్షణ లోపం కూడా కార్యక్రమాల లక్ష్యాల సాధనకు అవరోధంగా మారింది.

యూరియా కోసం అన్నదాతల తంటాలు

- ప్రయివేట్ డీలర్ల వద్ద దొరకని యూరియా
- మార్క్‌ఫెడ్ నిల్వలు పంపిణీ చేయాలని డిమాండ్

బాలసముద్రం, సెప్టెంబరు 15: ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో పంటల సాగుకు యూరియా దొకరడంలేదని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మరోపక్క సొసైటీలు, మార్క్‌ఫెడ్ ద్వారా రైతులకు యూరియా అందిస్తున్నట్లు, జిల్లాలో ఎక్కడా కూడా యూరియా కొరత లేదని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. కానీ క్షేత్రస్థాయిలో రైతులకు యూరియా దొరకడంలేదని రైతులు వాపోతున్నారు. హనుమకొండ జిల్లా వ్యాప్తంగా రైతు కేంద్రాలు, సొసైటీలు, మార్క్‌ఫెడ్‌లలో యూరియా అందుబాటులో ఉన్నప్పటికీ, గ్రామాల్లోని రైతులకు ప్రైవేట్ ఎరువుల డీలర్ల వద్ద యూరియా లేకపోవడంతో కొరత కారణంగా ఇబ్బందులు పడుతున్నారు. సొసైటీలలో వ్యాపారులు యూరియాతోపాటు ఇతర పెస్టిసైడ్ మందులు అంటగడుతున్నట్లు రైతులు చెబుతున్నారు. అన్ని గ్రామాలలో రైతు ఆగ్రోస్‌లు, సొసైటీ కేంద్రాలు లేకపోవడంతో జిల్లాలో ప్రైవేట్ డీలర్లు ఎక్కువ సంఖ్యలో ఉన్నారు.

దీంతో ప్రైవేట్ డీలర్లకు యూరియాను రెండునెలలుగా కేటాయించకపోవడంతో కొరత ఏర్పడుతున్నట్లు డీలర్లు చెబుతున్నారు. గ్రామాల్లోని రైతులు పంటల సాగుకు యూరియా కోసం మండల కేంద్రాలకు కోసం వెళితే అదనపు ట్రాన్స్‌పోర్టు చార్జీల ఖర్చు రైతులపై భారం పెరుగుతుందని రైతులు వాపోతున్నారు.

మార్క్‌ఫెడ్‌లో ఉన్న నిల్వలను డీలర్లకు పంపిణీ చేయాలి

- నాగుర్ల వెంకటేశ్వర్లు, రైతు రుణవిముక్తి మాజీ కమిషన్ చైర్మన్

"హనుమకొండ జిల్లాలో మార్క్‌ఫెడ్‌లో నిల్వ ఉన్న యూరియాను డీలర్ల ద్వారా పంపిణీ చేయాలి. వ్యవసాయశాఖ అధికారులు సొసైటీలపై అధారపడితే రైతులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో సొసైటీలు, తక్కువగా ఉన్నందున రైతులకు అందుబాటులోకి తెచ్చేందుకు యూరియాను ప్రైవేట్ డీలర్లకు ఇవ్వాలి. ఈ విషయంపై కలెక్టర్‌కు, వ్యవసాయశాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లాం."

18న పెద్దల పండుగ జరుపుకోవాలి

కొత్తగూడ, సెప్టెంబరు 15 : ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాల్లో భాగంగా ప్రతీ సంవత్సరం జరుపుకునే పెద్దల పండుగను ఈనెల 18న కొత్తగూడ, గంగారం మండలాల్లోని ఆదివాసీలు నిర్వహించుకోవాలని దొరపటేళ్ల సంఘం ఉమ్మడి కొత్తగూడ మండల అధ్యక్షుడు భీరబోయిన సమ్మయ్య పిలుపునిచ్చారు. కొత్తగూడలో ఏర్పాటు సమావేశంలో ఆయన మాట్లాడారు. అనాదిగా ఆదివాసీలు జరుపుకుంటున్న పెద్దల పండుగను ప్రతీ సంవత్సరం ఉత్తర కార్తీలోని మొదటి పాదంలో వచ్చే మొదటి బుధవారం నిర్వహించుకుంటామని పేర్కొన్నారు. ఈ సంవత్సరం కూడా ఆదివాసీలు సంప్రదాయకరంగా పెద్దల పండుగను జరుపుకోవాలన్నారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి ఎట్టి సర్వయ్య, కోశాధికారి కల్తి వెంకటేశ్వర్లు, మల్లెల రాంబాబు, ఈక నరేష్ తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న సంఘం నాయకులు

మెడికల్ కళాశాలను అభివృద్ధి చేయాలి

▸▸ నర్సంపేట సివిల్ ఆస్పత్రిని నెక్కొండకు తరలించాలి ▸▸ సీఎంకు మాజీ ఎమ్మెల్యే పెద్ది లేఖ

నర్సంపేట, సెప్టెంబరు 15 : నర్సంపేట పట్టణ శివారులోని మెడికల్ కళాశాలను మరింత అభివృద్ధి చేయాలని, నర్సంపేట నియోజకవర్గంలోని అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించాలని బీఆర్ఎస్ నేత మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ పంపారు. జిల్లా స్థాయి ఆస్పత్రి ఏర్పాటు అవుతున్నందున నర్సంపేటలోని ప్రభుత్వ సివిల్ ఆస్పత్రిని గిరిజన ప్రాంతమైన నెక్కొండకు తరలిస్తే మండలంలోని ప్రజలు, గిరిజనులకు మెరుగైన వైద్యం అందుతుందన్నారు. దుగ్గొండిలోని పీహెచ్‌సీని 30 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. అలాగే నర్సంపేటలో మెడికల్ కళాశాల కోసం విరాళంగా భూమిని అందించిన పారిశ్రామిక వేత్త దొడ్డ మోహన్‌రావును కళాశాల ప్రారంభోత్సవానికి ఆహ్వానించాలని లేఖలో విజ్ఞప్తి చేశారు. భూములు ఇచ్చేందుకు ముందుకు వచ్చిన రైతు కుటుంబాలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించి ఆదుకోవాలన్నారు.

ఇప్పటికే రూ.100 కోట్లతో అన్ని వసతులతో ఆస్పత్రి భవన నిర్మాణం, 50 అడ్మిషన్లతో అన్ని వసతులతో కళాశాల భవన నిర్మాణం పూర్తయిందన్నారు. మెడికల్ కళాశాలలో భవిషత్‌లో 150 అడ్మిషన్లను పెంచుకునే అవకాశం ఉందన్నారు. పీజీ కళాశాల మంజూరు కావాల్సి ఉందని, నర్సింగ్ కళాశాల మంజూర యిందన్నారు. నర్సింగ్ కళాశాలకు శాశ్వత భవనం, ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, సహాయ సిబ్బందికి సంబంధించి రెసిడెన్సియల్ భవనాలు, రెసిడెన్సియల్ హాస్టల్ ల్యాబ్స్ ఇతర వసతు కొరకు జీవో 83 ద్వారా మరో రూ.183 కోట్లు మంజూరై ఉన్నాయన్నారు. నిర్మాణంలో ఉన్న పనులు కాకుండా కొత్తపనులకు టెండర్లు పిలవాల్సిన అవసరం ఉందని సీఎంకు పంపిన లేఖలో సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు.

నియోజకవర్గంలో 53 పల్లె దవాఖానాలు బీఆర్ఎస్ హయాంలో మంజూరయ్యాయని, అందులో 29 దవాఖానాలు పూర్తయ్యాయని, మిగిలినవి పూర్తి చేసేందుకు నిధులు విడుదల చేయాలని, పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని సీఎంను కోరారు. జాతీయ స్థాయి విద్యా సంస్థ అయిన మెడికల్ కళాశాల భవన ప్రారంభోత్సవానికి సీఎం రేవంత్‌రెడ్డి రావటం గౌరవప్రదంగా ఉంటుందని ప్రజలు భావిస్తున్నారని ఆయన అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి పంపిన లేఖ ప్రతులను రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర నర్సింహ, రాష్ట్ర సమాచార, రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి పంపానని ఆయన పేర్కొన్నారు.

కారు డ్రైవర్ ఇంట్లో చోరీ

హసన్‌పర్తి, సెప్టెంబరు 15: మండల కేంద్రంలోని కారు డ్రైవర్ ఇంట్లో చోరీ జరిగిన ఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లో చొరబడి రూ.10వేల నగదు, రూ.90వేల విలువైన బంగారు ఆభరణాలు చోరీ చేశారు. ఇన్‌స్పెక్టర్ వట్టి చేరాలు కథనం ప్రకారం.. హసన్‌పర్తికి చెందిన వెల్మ రాజేందర్ కారుడ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈనెల 12న రాజేందర్ అతడి భార్య సుజాత, కూతురు హిరకలు వేములవాడ దేవస్థానానికి మొక్కులు తీర్చుకునేందుకు వెళ్లారు. రాజేందర్ కుటుంబసభ్యులు తిరిగి ఈ నెల 14న రాత్రి ఇంటికి వచ్చేసరికి ఇంటి తలుపులు తొలగించి ఉన్నట్లు గుర్తించి ఇంట్లోకి వెళ్లి బీరువా తెరిచి చూడగా అందులో దాచి పెట్టిన తులం బంగారు గొలుసు, 5 గ్రాముల బంగారు కమలు, మాటీలు, 5 బంగారు ముక్కలు, రూ.10వేల నగదు చోరీకి గురైనట్లు బాధితులు తెలిపారు. బాధితుడు రాజేందర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్రైం కానిస్టేబుల్ క్రాంతికుమార్ ఘటనాస్థలాన్ని పరిశీలించి ఆధారాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఇన్‌స్పెక్టర్ చేరాలు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న పింగిళి శ్రీపాల్‌రెడ్డి

వేసవి సెలవుల్లో పదోన్నతులు ఇప్పిస్తాం..

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 15: దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఏకీకృత సర్వీస్ రూల్స్‌ను సాధించి ఉపాధ్యాయులకు వేసవిసెలవుల్లో పదోన్నతులు ఇప్పిస్తామని పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పింగిళి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం హనుమకొండ జిల్లా శాఖ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వాన్ని ఒప్పించి ఏకీకృత సర్వీస్ రూల్స్ సాధిసామనే ధీమాను వ్యక్తం చేశారు. జీవోనెం. 11, 12లను సవరించి అన్ని కేటగిరీల ఉపాధ్యాయులకు పదోన్నతులు ఇప్పిస్తామన్నారు. బీఈడీ అర్హత కలిగిన ఎస్జీటీలకు పీఎస్‌హెచ్‌ఎంల ప్రమోషన్లు ఇప్పిస్తామన్నారు. కేజీబీవీ, సమగ్ర శిక్ష విభాగంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులందరికీ టైం స్కేలు ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించేందుకు పీఆర్టీయూ ముందుంటుందన్నారు. అన్ని యాజమాన్య గురుకులాల్లో పనిచేస్తున్న సిబ్బంది సమస్యలను త్వరలోనే పరిష్కరింప జేస్తామన్నారు. అనంతరం హనుమకొండ జిల్లాకు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మందల తిరుపతిరెడ్డి, ప్రధానకార్యదర్శిగా పలీత శ్రీహరి, అసోసియేట్ అధ్యక్షులుగా డి.కోమల్‌రెడ్డి, కె.దయాకర్‌రెడ్డి, మహిళా అసోసియేట్ అధ్యక్షులుగా వి.వాణి, ఉపాధ్యక్షులుగా ఎ.మహిపాల్‌రెడ్డి, వి.రామాంజనేయులు, కె.రాజేం దర్ రెడ్డి, జి.విష్ణుమూర్తి, ఎం.సురేందర్, మహిళా ఉపాధ్యక్షులుగా పి.సరస్వతి, కార్యదర్శులుగా బి.మురళీధర్, బి.శరత్‌గౌడ్, ఎల్.గణపతినాయక్, కె.రమేష్‌బాబు, మహిళా కార్యదర్శిగా నికత్ సుల్తానాలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు సాధించిన గౌరిశెట్టి రాజన్న, జిల్లా స్థాయిలో సత్కారం పొందిన అనురాధను సత్కరించారు. సంఘ నాయకులు శ్రీనివాస్, ఉమామహేశ్వర్, పట్టాభి, సుమ, అనురాధ, సంధ్యారాణి పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో రైల్వే ఉద్యోగి ఆత్మహత్య



విజయ్ (ఫైల్)

కేసముద్రం (మహబూబాబాద్ జిల్లా), సెప్టెంబరు 15 : కేసముద్రం మండలం ఇంటికన్నెకు చెందిన రైల్వే ట్రాక్‌మెంటెనర్ కాడబోయిన విజయ్ (35) గుండెజబ్బుతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులతో జీవితంపై విరక్తి చెంది క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ మురళీధర్‌రాజ్ తెలిపారు. ఈనెల 12న ఇంటి వద్ద క్రిమిసంహారకమందు తాగగా కుటుంబసభ్యులు ఆయన్ను మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రిలో చేర్పించారు. ఆస్పత్రిలో చికిత్సపొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి భార్య మణి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు. విజయ్‌కు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ఉరి వేసుకుని యువకుడు..

డోర్నకల్ (మహబూబాబాద్ జిల్లా) : ఉరి వేసుకుని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన డోర్నకల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మన్నెగూడెంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై వంశీధర్ తెలిపిన వివరాల ప్రకారం. మన్నెగూడెంకు చెందిన పాతలోతు వినేష్ (23)కు ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం బర్లగూడెంకు చెందిన కరుణశ్రీతో ఐదునెలల క్రితం వివాహం జరిగింది. వినేష్ తండ్రి బాలు మన్నెగూడెంలో ఓ చర్చి పాస్టర్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 11న దంపతులిద్దరూ బర్లగూడెంలోని కరుణశ్రీ తల్లిగారింటికి వెళ్లారు. అక్కడ్నుంచి వినేష్ ఒక్కడు మాత్రమే మన్నెగూడెంలోని ఇంటికి వచ్చాడు. వినేష్ తండ్రి బాలు అనారోగ్యంతో ఉండడంతో ఖమ్మంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నారు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం చర్చిని శుభ్రం చేసేందుకు పనిమనిషి వచ్చారు. ఆమె తలుపులు కొట్టగా ఎవరూ తీయలేదు. దీంతో అనుమానం వచ్చిన ఆమె కిటికీలో నుంచి చూడగా వినేష్ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు కనిపించాడు. వెంటనే ఈ విషయాన్ని వినేష్ తండ్రికి సమాచారం అందించారు. వినేష్ తండ్రి బాలు మన్నెగూడెంకు చెరుకుని విఘతజీవిగా ఉన్న కొడుకును చూపి కన్నీటి పర్యంతమయ్యాడు. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు వివేష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. కాగా, తన కొడుకు మృతిపై తనకు అనుమానం ఉందని వినేష్ తండ్రి బాలు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

హసన్‌పర్తి, సెప్టెంబరు 15: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందినట్లు ఇన్‌స్పెక్టర్ వట్టి చేరాలు తెలిపారు. ఇన్‌స్పెక్టర్ కథనం ప్రకారం.. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పెగడపల్లికి చెందిన దామెర ఎల్లయ్యకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు శ్రావణ్‌కుమార్ (23) ఈ నెల 14న ద్విచక్ర వాహనంపై బయటికి వెళ్లి తిరిగి రాత్రి వరకు ఇంటికి రాలేదు. ఫోన్ స్విచ్ ఆఫ్ అయ్యింది. 15న ఉదయం వంగపహాడ్-ఆరెపల్లి ఔటర్‌రింగ్‌రోడ్ మధ్యలో రోడ్డుప్రమాదంలో చనిపోయినట్లు ఫోన్ సమాచారం రావడంతో వెళ్లి చూసేసరికి ద్విచక్రవాహనం రోడ్డు ప్రక్కనే విద్యుత్ స్తంభానికి ఢీకొని శ్రావణ్‌కుమార్ చనిపోయినట్లు గుర్తించారు. మృతుడి తండ్రి ఎల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ వట్టి చేరాలు తెలిపారు.

గంజాయి పట్టివేత

కాజీపేట, సెప్టెంబరు 15: పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా ఓవ్యక్తి వద్ద గంజాయి లభ్యమైంది. కాజీపేట ఎస్సై వి.లవన్ కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాజీపేట రైల్వే ఆస్పత్రి వద్ద శనివారం పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా ఓ వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించడంతో అతడిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా అతడి వద్ద 860 గ్రాముల గంజాయి లభ్యమైంది. కాజీపేటకు చెందిన గొర్రె సారంగపాణి ఇరవై రోజుల క్రితం విశాఖపట్నం వెళ్లి వ్యాపారం చేసేందుకు గంజాయి కొనుగోలు చేసినట్లు ఒప్పుకున్నాడు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. పట్టుబడిన గంజాయి విలువ రూ. 21,500 ఉంటుందని పోలీసులు తెలిపారు.

చెరువుల రక్షణకు వాడ్రాను ఏర్పాటు చేయాలి

వీసీకే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జిలుకర శ్రీనివాస్

సుబేదారి, సెప్టెంబరు 15: వరంగల్ ఉమ్మడి జిల్లాలో చెరువులు, కుంటల పరిరక్షణ కోసం వాడ్రాను ఏర్పాటు చేసి, వాటిలో నిర్మించిన అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించాలని వీసీకే పార్టీ రాష్ట్ర అధ్య క్షుడు డాక్టర్ జిలుకర శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం హను మకొండ అదాలత్ జంక్షన్‌లోని అమర వీరులస్థూపం వద్ద ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆందోళన కార్యక్రమంలో ఆయనతో పాటు ప్రజాసంఘాల నేతలు డాక్టర్ తిరునహరి శేషు, ప్రొఫెసర్ ఎర్రగట్టు స్వామి, సాయిని నరేందర్, డాక్టర్ చింతం ప్రవీణ్ లు మాట్లాడారు. భద్రకాళి, వడ్డేపల్లి చెరువులలో కట్టిన అక్రమ నిర్మాణాలను తొలగించాలని అన్నారు. వరంగల్ జిల్లాను కబ్జాదారుల నుంచి కాపాడాలని, కబ్జాలకు సహకరించిన అధికారులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు కోండ్ర నర్సింగరావు, డాక్టర్ వెంగళరెడ్డి, తాడిశెట్టి క్రాంతి కుమార్, గాజుల గోవర్ధన్, మల్యాల కృష్ణ, చుంచు రాజేందర్, సింగారపు రవిప్రసాద్, ఊ నర్సయ్య, సాదు కుమారస్వామి, కృష్ణ స్వామి, పరశురాములు, వస్కుల రవీందర్, ఎబినైజర్, అంకేశ్వరపు రాంచదర్, కన్నాల రవి పాల్గొన్నారు.

వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలి

మడికొండ, సెప్టెంబరు 15: ఆర్థిక, సామాజిక, రాజకీయంగా వెనుకబడిన వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని వాల్మీకి బోయ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి బోగి కృష్ణమూర్తి ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం మడికొండలో నిర్వహించిన వాల్మీకి బోయ బోగి లింగమూర్తి అధ్యక్షతన సమావేశంలో ఆయన మాట్లాడారు. వాల్మీకి బోయల సంక్షేమం కోసం కార్పొరేషన్ ఏర్పాటుచేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో వల్మీకి బోయ వరంగల్ ఉమ్మడి జిల్లా జేఏసీ ప్రతినిధులు నిగ్గుల వెంకటప్రసాద్, ముచ్చు రాజ్‌కుమార్, దేశెట్టి గోపాల్, వెంకటేష్, బోగి కుమారస్వామి, పెనుకుల సారయ్య, తట్ల రమేష్, బేర్గు సతీష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బోగి కృష్ణమూర్తి

రావయ్యా.. గణపయ్యా..

- నిమజ్జన వేళ గణపతులకు అపూర్వ స్వాగతం
- నగరంలో మూడు చోట్ల ప్రత్యేక వేదికలు
- విశ్వహిందూ పరిషత్ నేతల వెల్లడి
- ఉత్తమ గణపతులకు బహుమతులు



అత్యుత్తమ బహుమతిని అందుకుంటున్న కాజీపేటలోని టీఎన్జీవోస్ గజానన మండలి నిర్వాహకులు, ద్వితీయ బహుమతి అందుకుంటున్న శ్రీజ హోమ్ బాధ్యులు

హనుమకొండ కల్చరల్, సెప్టెంబరు 15: నిమజ్జనానికి తరలివచ్చే గణేష్ విగ్రహాలను అపూర్వంగా స్వాగతించేందుకు ఎప్పటిలాగే మూడు ప్రాంతాల్లో ప్రత్యేక వేదికలను ఏర్పాటు చేస్తున్నట్లు విశ్వ హిందూ పరిషత్ వరంగల్ మహానగర గణేష్ ఉత్సవ సమితి కన్వీనర్ న్యాలకొండ భాస్కర్‌రావు, విశ్వహిందూ పరిషత్ కార్యదర్శి ఉదయ్‌కుమార్ తెలిపారు. యేటా నిర్వహించే ఉత్తమ గణపతులకు బహుమతుల ప్రదానోత్సవం హనుమకొండ టీటీడీ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆదివారం సాయంత్రం జరిగింది.

శ్రీ చైతన్యానంద మహారాజ్ ముఖ్య అతిథిగా పాల్గొని ఉత్తమ గణేష్ మండళ్ల నిర్వాహకులకు జ్ఞాపికలు అంద జేసి దుశ్శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా న్యాలకొండ భాస్కర్‌రావు మాట్లాడుతూ.. కాజీపేట నుంచి తరలివచ్చే వినాయక విగ్రహాలను నిట్ సమీపంలో.. హనుమకొండ ప్రాంతం నుంచి తరలివచ్చే గణేష్ నిమజ్జన రథాలను హనుమకొండ చౌరస్తాలో.. వరంగల్ ప్రాంత విగ్రహాలకు పోచమ్మమైదాన్ సెంటర్‌లో ప్రత్యేక వేదికలను ఏర్పాట్లు చేసి ఆయా గణేష్ మండళ్ల తొవిదిరోజుల పాటు నిర్వహించిన కార్యక్రమాలను వివరిస్తూ అపూర్వంగా స్వాగతించనున్నట్లు వివరించారు.

ఈసారి ఉత్సవాల్లో ఊహించిన దానికంటే ఎక్కువ సంఖ్యలో మట్టి గణపతులను మండపాలలో నెలకొల్పి పూజలు నిర్వహించి పర్యావరణానికి సహక రించారని తెలిపారు. ఉత్తమ గణేష్‌ల ఎంపిక కోసం ఏడు విభాగాలుగా ఎంపికచేసిన 150 మంది కార్యకర్తలు తమకు సహకరించినట్లు భాస్క ర్‌రావు తమ నివేదికలో పేర్కొన్నారు. ఈ వేడుకల్లో వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి, ప్రముఖులు పాల్గొన్నారు.

ఉత్తమ గణపతి మండళ్లు ఇవే..

వరంగల్ మహానగర పరిధిలోని అన్ని విగ్రహాలను ప్రత్యక్షంగా పరిశీలించి ఉత్తమ గణపతులను ఎంపిక నిర్వాహకులు ఎంపిక చేశారు. ఈసారి మహానగర పరిధిలో కాజీపేట బాపూజీనగర్ ప్రాంతంలో టీఎన్జీవోస్ కాలనీలో ఏర్పాటు చేసిన శ్రీశ్రీ గజానన మండలి మండలిని అత్యుత్తమ గణపతి మండలిగా ఎంపిక చేశారు. అదే విధంగా హమారా హిం దుస్థాన్ పేరిట కాజీపేట బాపూజీనగర్‌లో ఏర్పాటు చేసిన మట్టి గణప య్యకు ద్వితీయ బహుమతి ప్రదానం చేశారు. వీటితోపాటు వరంగల్ ఎల్లం బజార్‌లోని భద్రకాళి హిందూ ఉత్సవ సమితి, కాశిబుగ్గ ఓసిటీ గజా ఐన మండలి, ఖిలావరంగల్ వినాయక ట్రస్టు భవన్ వాసవీ లైన్, హనుమకొండలోని నందిహిల్స్‌లో ఏర్పాటు చేసిన వరసిద్ధి వినాయక మండలి, అలాగే హనుమకొండ అడ్వకేట్స్ కాలనీలో ఏర్పాటు చేసిన శ్రీగ జానన మండలి, కేయూ పరిధిలో విజయగణపతి కాలనీలో విజయగణపతి మందిరంలో ఏర్పాటు చేసిన విగ్రహానికి అత్యుత్తమ మండలులుగా ఏర్పాటు చేసి బహుమతులను ప్రదానం చేశారు. కాగా, ప్రథమ బహుమతులుగా వరంగల్ గీతాభవన్‌లోని సిద్ధి విఘ్నేశ్వర ఉత్సవ కమిటీ, కాశిబుగ్గలోని రాంకీ విల్లాలో ఏర్పాటుచేసిన ఉత్సవ కమిటీ, ఖిలా వరంగల్‌లోని బాల గణేష్ యూత్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన మండలి, హనుమకొండ జులైవాడలో శివపార్వతి గజానన మండలి, జీఎంఆర్ బృందావన్ అపార్ట్‌మెంట్‌లో విజయగణపతి నవరాత్రి సమితి, కాజీపేట డీజిల్‌కాలనీలో ఏర్పాటు చేసిన గణపతి యూత్ అసోసి యేషన్ ద్వితీయ బహుమతులుగా వరంగల్, హనుమకొండ, కాజీపేట ప్రాంతాల్లోని 14 గణేష్ మండళ్లకు అందించగా, తృతీయ బహుమతులుగా 22 గణేష్ మండళ్లను ఎంపిక చేసి బహుమతులను ప్రదానం చేశారు.

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన మంత్రి సురేఖ



టీపీసీసీ అధ్యక్షుడికి శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రి కొండా సురేఖ

వరంగల్ సిటీ, సెప్టెంబరు 15: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా మహేష్‌కుమార్ గౌడ్ ఆదివారం హైదరాబాద్ గాంధీభవన్‌లో పదవీబాధ్యతలు స్వీకరించారు. కాగా, అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ మహేష్‌కుమార్ గౌడ్‌ను హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

మహమ్మద్ ప్రవక్త మాటలు స్ఫూర్తిదాయకం

పవిత్ర హృదయంతో కూడిన ప్రతీ మనిషికి యావత్తు భూమి ప్రార్థనా స్థలమేనని మహమ్మద్ ప్రవక్త మాటలు స్ఫూర్తిదాయకమని మంత్రి కొండా సురేఖ అన్నారు. మహమ్మద్ ప్రవక్త జన్మదినోత్సవమైన మిలాద్ ఉన్ నబీ (సోమవారం)ను పురస్కరించుకుని ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతూ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మహమ్మద్ ప్రవక్త ప్రవచించిన శాంతి, సౌభ్రాత్రత్వం, కరుణ, ధార్మిక చింతన, దాతృత్వం, సర్వమానవ సమానం అనే సుగుణాలు మనిషిని ఉత్తమ మార్గంలో నడిపిస్తాయని తెలిపారు.

ఉపాధ్యాయ సంఘాల్లో చిచ్చుపెడితే ఊరుకునేది లేదు..



సమావేశంలో మాట్లాడుతున్న మన్నె చంద్రయ్య

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 15: ఉపాధ్యాయ సంఘాల్లో చిచ్చుపెడితే ఊరుకునేది లేదని పీఆర్టీయూ తెలంగాణ రాష్ట్ర ప్రచార కార్యదర్శి మన్నె చంద్రయ్య హెచ్చరించారు. ఆదివారం కాళోజీ సెంటర్‌లో ఆయన మాట్లాడుతూ.. పదేళ్లుగా సంఘాన్ని బలోపేతం చేస్తూ ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. సంఘం ఎన్నికల్లో ఓడిన ఓ వ్యక్తి సంఘంలో చీలికలు తెచ్చి సంఘం నాది అనే ధోరణతో వ్యవహరించడం సరికాదన్నారు. సంఘం రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి పులి దేవేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ.. ఇటీవలకాలంలో రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో ఉపాధ్యాయులను మభ్యపెడుతూ భయభ్రాంతులకు గురిచేస్తూ తమకు అధికార పార్టీ నాయకుల అండదండలున్నాయని ప్రగల్భాలు పలుకుతున్న వారు వారి పద్ధతిని మార్చుకోవాలన్నారు. పోలీసుల కేసులు పెడతామని బెదిరింపులకు గురిచేస్తే ఎవరు భయపడరన్నారు. సంఘం కోసం ఉపాధ్యాయుల సంక్షేమం కోసం మాత్రమే పదేళ్లుగా పాటుపడుతున్నామని, రాజకీయాలు చేసేందుకు ఉపాధ్యాయ సంఘంలో పనిచేయడంలేదన్నారు. రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు చెన్నయ్య, అబ్దుల్ పనిచేస్తున్నారని, ఆ సంఘంలోనే తాము పని చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్య క్షుడు వెంకటేశ్వర్లు, నాయకులు శ్రీనివాస్, రమేష్, సంతోష్, రాజు, కుమార్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కేయూ కామన్ మెస్‌లో అగ్ని ప్రమాదం



ప్రమాదంతో దగ్ధమైన వంటసామగ్రి

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 15: కాకతీయ యూనివర్సిటీలో కామన్ మెస్‌లో ఆదివారం ఉదయం వంటలు చేస్తుండగా అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. మంటలతో ఒక్కసారిగా కామన్ మెస్ సిబ్బంది, విద్యార్థులు ఆందోళనలకు గురయ్యారు. ఉదయం 9 గంటల ప్రాంతంలో కామన్ మెస్ సిబ్బంది వంట చేస్తుండగా నూనె భారీ గిన్నెలో సలసల కాగడంతో వేడికి ఒక్కసారిగా మంటలు లేచాయి. మంటల్లో కామన్ మెస్‌కు సరఫరా అయ్యే విద్యుత్ వైర్ కాలి బూడిదైయింది. వంట పాత్రలు కాలిపోయాయి. విద్యుత్ సరఫరా ఆగిపోవడంతో భారీ ప్రమాదం తప్పిందని విద్యార్థులు, సిబ్బంది చెప్పారు. ఒకవేళ విద్యుత్ వైర్లు నీళ్లలో పడిఉంటే కామన్ మెస్ భవనానికి షార్ట్ సర్క్యూట్ జరిగి భారీ ప్రమాదం సంభవించే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు.

విషయం తెలుసుకున్న వర్సిటీ హాస్టల్స్ డైరెక్టర్ డాక్టర్ ఎల్‌పీ రాజ్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. సిబ్బంది , విద్యార్థులతో మాట్లాడారు. వర్సిటీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ప్రొఫెసర్ ఎస్.వాసుదేవారెడ్డికి ప్రమాద విషయాన్ని వివరించి విద్యుత్ పునరుద్ధరణ పనులు వెంటనే చేపట్టాలని కోరారు. వర్సిటీ విద్యుత్ సిబ్బంది కామన్‌మెస్‌లో విద్యుత్ పునరుద్ధరణ పనులు చేపట్టి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. దీంతో విద్యార్థులకు మధ్యాహ్నం లంచ్‌కు ఎలాంటి ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు చేపట్టారు. వర్సిటీ ఇంజనీరింగ్ శివశంకర్, హాస్టల్స్ కేర్ టేకర్ ప్రభాకర్, రాజు తదితరులు విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూశారు. భారీ ప్రమాదం తప్పటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

వర్సిటీ కాంట్రాక్టు

అధ్యాపకులు బెదిరిస్తున్నారు..

సోషల్ మీడియాలో ఓ దళిత మహిళ ప్రొఫెసర్ ఆవేదన

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 15: కేయూ కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం నేతలు తన విధులకు ఆటంకం కలిగిస్తూ, అవమాన పరుస్తున్నారని కేయూ ఆర్ట్స్ డీన్, తెలుగు విభాగాధిపతిగా విధులు నిర్వహిస్తున్న దళిత మహిళా ప్రొఫెసర్ ఆరోపించారు. ఈ మేరకు ఆదివారం సదరు మహిళ ప్రొఫెసర్.. ఆదివారం సోషల్ మీడియా వేదికగా తన ఆవేదనను వ్యక్తపరిచారు. సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో తెలుగు కాంట్రాక్టు అధ్యాపకుడిగా పనిచేస్తున్న ఓ వ్యక్తి.. వర్సిటీ క్యాంపస్‌లోని తెలుగు విభాగానికి బదిలీ చేయాలంటూ ఐదు నెలలుగా తనను తీవ్ర మానసిక వేదనకు గురిచేస్తున్నాడని ఆందోళన వ్యక్తం చేసింది. మరో ఇద్దరు కాంట్రాక్టు అధ్యాపకులతో కలిసి ఆయన.. తన చాంబర్ తలుపులను కోపంతో తోసుకుంటూ వచ్చి తీవ్ర పదజాలంతో మాట్లాడి తన విధులకు అటంకం కలిగించారని ఆవేదన వ్యక్తం చేసింది. కాంట్రాక్టు అధ్యాపకుడైన తనను కాదని, మరో పార్టుటైమ్ అధ్యాపకురాలిని డిపార్టుమెంట్‌కు ఎలా బదిలీపై రప్పిస్తావని ప్రశ్నించారని తెలిపింది. మీకు తెలుగు విభాగాధిపతిగా పనిచేయడం చేతకాదని, రాజీనామా చేయలంటూ మానసికంగా వేధింపులకు గురిచేసినట్లు ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. వర్సిటీ ఉన్నతాధికారుల ఆదేశాలు, వర్సిటీ నిబంధనల మేరకు తాను విధులు నిర్వహిస్తున్నానని చెప్పినప్పటికీ వర్సిటీలో కాంట్రాక్టు సంఘం అధ్యక్షుడు, ఇతర కాంట్రాక్టు అధ్యాపకులతో కలిసి తనను ఇబ్బందులకు గురి చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇదే విషయంపై వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, అకూట్ జనరల్ సెక్రటరీ డాక్టర్ మామిడాల ఇస్తారిల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది.

నీటి పరిరక్షణ ల్యాబ్ ఉద్యోగుల

ఉమ్మడి జిల్లా కార్యవర్గం ఎన్నిక

వడ్డేపల్లి, సెప్టెంబరు 15: మిషన్ భగీరథ నీటి నాణ్యత, పరిశీలన, పరిరక్షణ ల్యాబ్ ఉద్యోగుల ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యవర్గ సర్వసభ్య సమావేశం ఆదివారం గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ గోపాల్‌పూర్ జవహర్ కాలనీలోని కమ్యూనిటీ హాల్‌లో ముఖ్య సలహాదారు కె.ప్రవీణ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా అచ్చ రాజేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శిగా పులి రాజేష్ ముదిరాజ్, జిల్లా ఉపాధ్యక్షులు కె.వెంకటేశ్వర్లు, కె.విద్యావతి, జిల్లా కోశాధికారులుగా జి.సూరజ్, ఎస్.భాగ్య లక్ష్మి, జాయింట్ సెక్రటరీగా యు. కిరణ్‌కుమార్‌లను ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా అశోక్, రాధిక, భరత్, యాకయ్య, రాజు, పరశురాములు ఎన్నికయ్యారు.

రేపు ఏనుమాముల మార్కెట్‌లో

యథావిధిగా క్రయవిక్రయాలు

మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి పోలెపాక నిర్మల

వరంగల్ వ్యవసాయం, సెప్టెంబరు 15: రాష్ట్ర ప్రభుత్వం సోమవారం మిలాద్ ఉన్ నబీ పండగ సెలవుగా ప్రకటించిన నేపథ్యంలో మంగళవారం ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో క్రయవిక్రయాలు యథావిధిగా కొనసాగుతాయని ఆ మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి పోలెపాక నిర్మల ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గత శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో సోమవారం వినాయక నిమజ్జనం, మంగళవారం మిలాద్ ఉన్ నబీ పండగ సెల వుగా ప్రకటించడం జరిగింది. కాగా ప్రభుత్వం సోమవారం మిలాద్ ఉన్ నబీ పండగ సెలవుగా ప్రకటించిన నేపథ్యంలో మార్కెట్ మం గళవారం యథావిధిగా పనిచేస్తుందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని గమనించి రైతులు తమ సరుకులను విక్రయించడానికి అవకాశం ఉందని ఆ ప్రకటనలో తెలిపారు.

పశుగణనకు సిద్ధం

- భారత్ పశుగణ యాప్ అందుబాటులోకి రాగానే మొదలు
- సిబ్బందికి శిక్షణ పూర్తి



హనుమకొండ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) :ఐదేళ్లకోసారి జరిగే జాతీయ పశుగణన చేపట్టేం దుకు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పశు సంవర్ధక శాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు చేసుకొని సిద్ధంగా ఉన్నారు. వాస్తవంగా ఈ గణన ఈనెల 1వ తేదీ నుంచి ప్రారంభం కావలసి ఉంది. అయితే పశు గణ్ పేరుతో కేంద్రం ఒక యాప్‌ను రూపొందిస్తోంది. ఈ పని ఇంకా పూర్తి కాలేదు. యాప్ అందుబాటులోకి రాగానే పశుగణన మొదలవుతుంది. నాలుగు నెలల పాటు ఈ గణన సాగుతుంది. పశుగణన ఐదేళ్లకోసారి దేశ వ్యాప్తంగా జరుగుతుంది. ఈ గణనలో భాగంగా పశువులు, గేదెలు, గొర్రెలు, మేకలు, పందులు, కుక్కలు, కుందేళ్లు, కోళ్లు తదితర లైవ్‌స్టాక్‌ను లెక్కిస్తారు. 2018లో 20వ పశుగణన నిర్వహించారు. 2023లో 21వ గణన జరపాల్సి ఉండగా శాసనసభ, లోక్‌సభ ఎన్నికలు జరగడంతో ఆలస్యమైంది.

ఈ గణన ద్వారా ప్రభుత్వ పథకాల ద్వారా అవులు, గేదెలు,, గొర్రెలు, మేకలు పొందిన వారి వివరాలతోపాటు కోళ్ల ఫారాలు ఎన్ని ఉన్నాయనే ది కూడా తెలుస్తుంది. మొత్తం మీద గతంతో పోల్చితే పశువుల సంఖ్య ఏ మేర పెరిగింది అనేది స్పష్టమవుతుంది. 2018లో నిర్వహించిన పశు గణన ప్రకారం ఉమ్మడి వరంగల్ జిల్లాలో 47.04 లక్షల లైవ్ స్టాక్, 61.30 లక్షల కోళ్లు ఉన్నాయి. ఈ సారి ఇవి ఏ మేరకు పెరిగింది? లేదా తగ్గింది.. తాజా పశుగణన ద్వారా తేటతెల్లమవుతుంది. ఉమ్మడి జిల్లాలో పదేళ్లుగా గణనీయంగా తగ్గుతూ వస్తోంది. పశువుల గణన సరైన ప్రణాళిక, పశుసంక్షేమ ప్రణాళిక రూపకల్పనకు ఎంతో దోహదపడుతుంది, ఈ రంగంలో వినూత్న కార్య క్రమాలను అమలుచేయడానికి పశుగణన సమాచారం ఎంతో దోహదపడుతుంది.

తగ్గుతున్న కుందేళ్లు

2018 గణన ప్రకారం ఉమ్మడి జిల్లాలో కుందేళ్లు పదివేలకు మించి లేవు. కుందేళ్లను వేటాడడం, వాటి పెంపకాన్ని పెద్దగా చేపట్టకపోవడం తదితర కారణాల వల్ల వాటి సంఖ్య ఐదేళ్లలో గణనీయంగా తగ్గిపోయి ఉండవచ్చునని పశు సంవర్ధక శాఖ అధికారులు అభిప్రాయపడుతున్నారు. పందుల సంఖ్య కూడా చాలా వరకు తగ్గిపోయింది. వ్యాధులకు కారణమవుతున్న పందుల పెంపకాన్ని ప్రభుత్వం ఏ మాత్రం ప్రోత్సహించడం లేదు. సీమ పందుల పెంపకం మాత్రం కొంత మేరకు కొనసాగుతోంది. ఉమ్మడి జిల్లాలో గాడిదల సంఖ్య కూడా పూర్తిగా తగ్గిపో యింది. ఇప్పుడు ఎక్కడా గాడిదలు కనిపించడం లేదు. గతంలో రజకులు గాడిదలను పెంచి పోషించేవారు. బట్టలను ఉతికేందుకు చాకిరేవుల వరకు బట్టల మూటలను తీసుకువెళ్లేందుకు వాటిని ఉపయోగించేవారు. ఇప్పుడు చాకి రేవులు తగ్గిపోయాయి. దానితో గాడిదల పోషణ కూడా తగ్గింది.

ఎన్యుమరేటర్లకు శిక్షణ

ఉమ్మడి జిల్లాలో పశుగణన నిర్వమించేందుకు 180మంది పశు వైద్యులను పర్యవేక్షకులుగా, 101 మంది పశు సంవర్ధక శాఖకు చెందిన వారిని ఎన్యుమరేటర్లుగా ఎంపిక చేసి శిక్షణ ఇచ్చారు. వీరికి జిల్లా స్థాయిలో నోడల్ అధికారి ఉంటారు. ప్రతీ 1500 కుటుంబాలకు ఒక ఎన్యుమరేటర్‌ను కేటాయిస్తారు. పశు జాతులను ఎలా గుర్తించాలి, యాప్‌ను ఎలా వినియోగించాలి, సేకరించిన సమాచారాన్ని ఎలా అప్‌లోడ్ చేయాలి అనే అంశాలపై శిక్షణ ఇచ్చారు. గణన చేపట్టేవారు మొత్తం 71 కాలమ్స్‌లో పశువులకు సంబంధించి న వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది. గతంలో మ్యానువల్ పద్ధతిలో గణన జరగగా దేశంలో మొదటిసారిగా డిజిటల్ పశుగణనను చేపడుతున్నారు. ఎన్యుమరేటర్లు ఇంటింటికి వెళ్లి ఆవులు, గేదెలు, కోళ్లు, మేకలు, గొర్రెలు, కుక్కలు, ఇతర పశవుల వివరాలను రైతులు, పశు పోషకులను ఆడిగి నమోదు చేసుకుంటారు. రైతుల వద్ద వ్యవసాయ పరికరాలు ఎన్ని, ఏవేవి ఉన్నాయనేది కూడా నమోదు చేస్తారు. ఈ సారి ప్రత్యేక యాప్‌ద్వారా పశుగణన నిర్వహిస్తున్న క్రమంలో ప్రతీ పశువుకు ఒక డిజిటల్ నెంబర్‌ను ఇచ్చి అందులో యజమానితో పాటు పశువు వివరాలను పొందుపరుస్తారు. పశువులను అమ్మినా, కొనుగోలు చేసినా వెంటనే వివరాలు తెలిసే విధంగా సాఫ్ట్‌వేర్ ఉపయోగపడుతుందని అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటికే అడవుల్లో జీవించే వన్యప్రాణుల గణనను అటవీ శాఖ అధికారులు పూర్తి చేశారు.

ఉమ్మడి జిల్లాలో పశు సంపద

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 2018లో నిర్వహిం చిన జాతీయ పశుగణన ప్రకారం పశువులు, గేదెలు, గొర్రెలు, మేకలు, పందులు కుక్కలు కలుపుకొని మొత్తం 47.04 లక్షల లైవ్‌స్టాక్ ఉం ది. కోళ్లు 61.30 లక్షలు ఉన్నాయి. వరంగల్ జిల్లాలో మొత్తం లైవ్‌స్టాక్ 10.56 లక్షలు ఉంది. ఇందులో 81వేలు పశువులు, 1.11 లక్షలు గేదెలు, 6.12 లక్షలు గొర్రెలు, 97వేలు గొర్రెలు, 8వేల పందులు, ఉన్నాయి. కాగా 3వేల కుక్కలు, 19.17 లక్షల కోళ్లు ఉన్నాయి. హనుమకొండ జిల్లాలో 5.56 లక్షల పశు సంపద ఉంది. ఇందు లో 49వేల పశువులు, 76వేల గేదెలు, 5.08 లక్షల గొర్రెలు, 62వేల, మేకలు, 9వేల పందులు, ఉన్నాయి. కాగా 7వేల పందులు, 21.68 లక్షల కోళ్ళు ఉన్నాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా లో మొత్తం పశు సంపద 5.06 లక్షలు. ఇందు లో 69వేల పశువులు, 63వేల గేదెలు, 2.92 లక్షల గొర్రెలు, 81వేల మేకలు, వెయ్యి పందులు ఉన్నాయి. కాగా కుక్కలు 2వేలు, కోళ్ళు 4.22 లక్షలు ఉన్నాయి. మహబూబాబాద్ జిల్లాలో మొత్తం 11.75 లక్షల పశు సంపద ఉంది. ఇం దులో 1.82 లక్షల పశువులు, 1.30 లక్షల గేదెలు, 6.78 లక్షల గొర్రెలు, 1.78 లక్షల మేకలు, 8 వేల పందులుఉండగా, కుక్కలు 11వేలు, కోళ్లు 11.09 లక్షలు ఉన్నాయి. ఉన్నాయి. ములుగు జిల్లాలో మొత్తం 3.65 లక్షల పశు సంపద ఉంది. వీటిలో 99వేల పశువులు, 61వేలే గేదెలు, 1.29 లక్షల గొర్రెలు, 75వేల మేకలు ఉండగా 4వేల కుక్కలు, 5.14 లక్షల కోళ్లు ఉన్నాయి. జనగామ జిల్లాలో మొత్తం 10.46 లక్షల లైవ్‌స్టాక్ ఉంది. ఇందులో 1.02 లక్షల పశువులు, 1.20 లక్షల గేదెలు, 8.01 లక్షల గొర్రెలు, 1.83 లక్షల మేకలు, 3వేల పందులు ఉండగా కుక్కలు 2వేలు, కోళ్లు 7.25 లక్షల కోళ్లు ఉన్నాయి.



బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా కమిటీ నియామకం

హనుమకొండ టౌన్, సెప్టెంబర్ 15: బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా కమిటీని 27 మందితో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సంద్ర మధు ఆదివారం సంయుక్తంగా ప్రకటించారు. జిల్లా ఉపాధ్యక్షులుగా కోవెల జీవన్‌ప్రకాశ్, జి.కృష్ణారావు, జి.శ్రీనివాసరావు, మల్లమారి శివాజీ గణేష్, అంబాల ప్రతాప్, బర్ల నవీన్, మాదారపు సోమశేఖర్, ప్రధాన కార్యదర్శులుగా మేకల హరిశంకర్, బత్తుల విజయ్, కార్యదర్శులుగా భైరపాక వెంకటేశ్, దాసరి సదానందం, పసుల శ్రీకాంత్, బొచ్చు శ్రీనువాస్, వస్కుల కమలాకర్, నల్లపు శివకృష్ణ, కార్యదర్శిగా మార్త రాజేంద్రప్రసాద్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా మట్టెడ సుమన్, అధికార ప్రతినిధులుగా మేకల అంబేద్కర్, అలువాల కుమారస్వామి, కోట మనోజ్, గద్దెపాటి లవన్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా గడ్డం కిరణ్, ములుగు సంపత్, వెల్పుల సుధాకర్, మేదరి పోచారం, కె.అరవింద్, కె.శ్రీనివాస్‌లు నియమితులయ్యారు.

ఉద్యమకారులపై కేసులు ఎత్తివేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రవిందర్‌యాదవ్

హసన్‌పర్తి, సెప్టెంబరు 15 : తెలంగాణ ఉద్యమకారులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు భాషబోయిన రవీందర్ యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సోమవారం హనుమకొండ అమరవీరుల స్థూపం వద్ద డాక్టర్ చీమ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగే ఉద్యమకారుల చైతన్య యాత్రను విజయవంతం చేయడానికి జిల్లా నలుమూలల నుంచి తెలంగాణ ఉద్యమకారులు పార్టీలకతీతంగా తరలిరావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని ఉద్యమకారులపై ఉన్న కేసులు ఎత్తివేయాలని కేసు లిస్టును అందించాలని కోరిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అభినందనలు తెలిపారు. మధ్యాహ్నం 1 గంటకు ప్రతి ఉద్యమకారుడు అమరవీరుల స్థూపం వద్ద జరిగే చైతన్య యాత్రలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో హసన్‌పర్తి మండల అధ్యక్షుడు చిలువేరు రమేష్, పోతరాజు ప్రభాకర్, మీసరకొండ వీరమల్లు, గణేష్, నగేష్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో దుప్పట్లు, పండ్లు పంపిణీ

ఐనవోలు, సెప్టెంబరు 15: దేవస్థానం మాజీ చైర్మన్ మజ్జిగ జయపాల్ తన తండ్రి వెంకటనర్సయ్య జ్ఞాపకార్థం పున్నేలు కనుకదుర్గా వృద్ధాశ్రమంలో వృద్ధులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విఘ్నేశ్వర సంఘం సభ్యులు నరేందర్, వెంకన్న, అశోక్, బీరయ్య, మురళి, శ్రీను, కిరణ్, కుటుంబ సభ్యులు షైమ, సంజయ్‌కుమార్, స్ఫూర్తి పాల్గొన్నారు.

కాటమయ్య శిక్షణకు హాజరుకావాలి

కాజీపేట, సెప్టెంబరు 15: కాజీపేట విష్ణుపురిలో ఆదివారం గీతాకార్మికుల ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుర్ర శ్రీనివాస్ గౌడ్ మాట్లాడారు. గీత కార్మికులకు కటమయ్య రక్షణ కవచం (సేఫ్టీమోకు) ఒక వరం అన్నారు. త్వరలో కాటమయ్య రక్షణ కవచం జిల్లా అధికారులు శిక్షణ ఇవ్వనున్నారని, ఈశిక్షణకు కార్మికులంతా హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో గీతకార్మికులు పెద్దఎత్తున హాజరయ్యారు.







సమ్మయ్యనగర్‌లో అన్నదానం చేసినవారికి సత్కారం. వేయిస్తంభాల ఆలయంలో కళాకారులను సత్కరించిన మహేష్‌బాబు. గోపాల్‌పూర్ బృందావన్ కాలనీలో శ్రీలక్ష్మీ గణపతి హోమాన్ని నిర్వహిస్తున్న దంపతులు

తొమ్మిదో రోజు గణపతికి పూజలు

రుద్రేశ్వరాలయంలో వైభవంగా మహా పూర్ణాహుతి

హనుమకొండ కల్చరల్, సెప్టెంబరు 15: వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో వైభవంగా నిర్వహిస్తున్న గణపతి నవరాత్రి వేడుకలు ఆదివారం తొమ్మిదో రోజుకు చేరుకున్నాయి. ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్ర శర్మ ఆధ్వర్యంలో ప్రాచీన కోనేరు జలాలతో అభిషేకం చేసి ఉత్తిష్ఠ గణపతిని సిద్ధి బుద్ధి సమేత గణపతిగా అలంకరింప చేసి పూజాదికాలు నిర్వహించారు. యాగశాలలో తొమ్మిది రోజులుగా నిర్వహిస్తున్న గణపతి నవగ్రహ హోమంను మహా పూర్ణాహుతి నిర్వహించారు. ఆలయ వేద పండితులు మణికంఠశర్మ ఆధ్వర్యంలో వేదోయుక్తంగా భక్తుల జయజయ ధ్వనాల మధ్య మహా పూర్ణాహుతి అనంతరం స్వామివారిని జింక వాహనంపై వాహన సేవ నిర్వహించారు. ఏటా మాదిరిగా సాయంత్రం నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవ వేడుకల్లో ఆర్యవైశ్య జాతీయ ఫెడరేషన్ నాయకులు గట్టు మహేష్‌బాబు ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు, కళాకారులకు స్వయంగా జ్ఞాపికలను బహుకరించి సత్కారం చేశారు. ఆదివారం సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా తిరునగరి శ్రవన్‌కుమార్, సాహితి, ఐ.చంద్రశేఖర్, ఎం.శ్రీనివాస్ బృందం ఆలపించిన భజన గీతాలు, భక్తిగీతాలు విశేషంగా అలరింప చేశాయి. తాడూరి రేణుక బృందం, సద్గురు శివానంద ట్రస్టు, పిండి సుభాషిని బృందంలకు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను ప్రదానం చేశారు. సోమవారం నిమజ్జనోత్సవానికి ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఈవో వెంకటయ్య చెప్పారు.

● కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో కన్నుల పండువగా వినాయక పూజలు జరిగాయి. వర్సిటీ క్యాంపస్‌లోని న్యూ లైబ్రరీ వద్ద విద్యారణ్య జ్ఞాన సరస్వతి అమ్మవారి వద్ద విగ్రహం, న్యూ పీజీ హాస్టల్, లేడీస్ హాస్టల్, ఫార్మసీ, స్కాలర్ హాస్టల్‌తోపాటు ఐదు ప్రాంతాల్లో కాకతీయ గజానన మండలి ఆధ్వర్యంలో చేసి నవరాత్రులు విద్యార్థులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల్లో భాగంగా ఆదివారం లైబ్రరీ వద్ద గల సరస్వతి విగ్రహం ఎదుట ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. స్కాలర్స్ హాస్టల్‌లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు పెద్ద ఎత్తున తరలివచ్చి అన్నదానం కార్యక్రమంలో పాల్గొన్నారు. లేడీస్ హాస్టల్‌లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం ఎదుట కంప్యూటర్ సైన్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్, కేయూ పాలక మండలి సభ్యురాలు బొద్దిరెడ్డి రమారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు.



ద్వారకాసాయి అపార్ట్‌మెంట్‌లో మట్టి వినాయక విగ్రహ దాతను సన్మానిస్తున్న అపార్ట్‌మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు

మట్టి వినాయక విగ్రహ మండళ్లకు అవార్డులు

హనుమకొండ కలెక్టరేట్: హనుమకొండ సుబేదారిలోని ద్వారకాసాయి అపార్ట్‌మెంట్, యజూర్ అపార్ట్‌మెంట్, నయింనగర్‌లోని ఆనంద్ టవర్స్, స్వర్ణ విహార్, మారుతి టవర్స్ సిరి అపార్ట్‌మెంట్‌లలో ఏర్పాటు చేసిన మట్టి వినాయక విగ్రహాల నిర్వాహకులను జిల్లా అపార్ట్‌మెంట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా అపార్ట్‌మెంట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు రెంటాల కేశవరెడ్డి మాట్లాడుతూ.. కార్పొరేషన్ పరిధిలో మట్టి వినాయక విగ్రహాలు ప్రతిష్ఠించిన అపార్ట్‌మెంట్ సభ్యులను సన్మానించి, మెమెంటోలు ఇస్తామన్నారు. యేటా అపార్ట్‌మెంట్‌లలో నిర్వాహకులు మట్టి విగ్రహాలనే ఏర్పాటు చేసి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ కుడా చైర్మన్ మర్రి యాదవరెడ్డి, అపార్ట్‌మెంట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్, సలహాదారులు గుర్రాల ప్రభాకర్‌రెడ్డి, రాజ్‌కుమార్‌తోపాటు వివిధ అపార్ట్‌మెంట్‌ల సభ్యులు, వినాయక విగ్రహ మండళ్ల నాయకులు పాల్గొన్నారు.

వడ్డెపల్లి: గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొమ్మిదో రోజు ఆదివారం హనుమకొండలోని వివిధ డివిజన్లలో భక్తులు హోమాలు, అన్నదానాలు, అర్చనలు విఘ్నేశ్వరుడికి భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. హనుమకొండ గోపాల్‌పూర్‌లోని బృందావన కాలనీలోని రుత్వికులు అవధానుల సీతారామశాస్త్రి పర్యవేక్షణలో రచ్చ పద్మ - నాగేశ్వర్‌రావు , జక్కుల నిర్మల- శ్రీనివాస్, అంచూరి కవిత- వేణుగోపాల్, సువర్ణ- ఆనంద్‌కుమార్‌లు శ్రీలక్ష్మి గణపతి హోమాన్ని వేద మంత్రాల మధ్య చేశారు. భక్తుల భజన కీర్తనలతో బృందావన కాలనీలో లంబోదరుడి నామస్మరణ మార్మోగింది. గోపాల్‌పూర్ జవహర్ కాలనీలో జవహర్ గజానన మండలి స్థానిక యూత్ సభ్యులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని 56వ డివిజన్ కార్పొరేటర్ సిరంగి సునిల్‌కుమార్, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు కొంక హరిబాబు, కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బైరి సోమయ్య, కార్యదర్శి యతిరాజుల సునిల్ ప్రారంభించారు. 56వ డివిజన్ పరిమళ కాలనీలోని ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో నిర్వహించిన గణపతి నవరాత్రోత్సవాల వేలం పాటలో లడ్డూను ప్రముఖ సామాజిక సేవకుడు ఉత్తమ రాజ్ వికాస్ రూ. 70, 116లతో లడ్డూను కైవసం చేసుకున్నారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు వికాస్‌ను ఘనంగా సత్కరించారు. హనుమ కొండ 58వ డివిజన్ ఎన్జీవోస్ కాలనీలోని రాఘవేంద్రానగర్ ఫేస్ -2లో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మండల సమ్మయ్య - సంధ్య దంపతులు నెలకొల్పిన విఘ్నాధిపతిని స్థానిక భక్తులు శిల్ప, స్నేహిత, పద్మ తదితరులు విఘ్నేశ్వరుడికి నైవేద్యం సమర్పించుకొని భక్తి తో కొలిచారు.

మడికొండ : మడికొండలోని మణికంఠ గ్రీన్ హోమ్స్ అపార్ట్‌మెంట్‌లో గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి మహిళలు తీరొక్క నైవేద్యాలు గణపతికి సమర్పించారు. అనంతరం చిన్నారులు, మహిళలు కోలాటంతో అలరించారు. అపార్ట్‌మెంట్ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అపార్ట్‌మెంట్ వాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



హనుమకొండ హంటర్‌రోడ్డులో వినాయక పూజలో పాల్గొన్న దృశ్యం



హనుమకొండ గౌతమ్‌నగర్‌లో నృత్య ప్రదర్శన ఇస్తున్న కళాకారులు



మడికొండలోని మణికంఠ గ్రీన్ హోమ్స్ అపార్ట్‌మెంట్‌లో నైవేద్యాలు సమర్పిస్తున్న మహిళలు



హంటర్‌రోడ్డులోని శాంతి హైట్స్ అపార్ట్‌మెంట్‌లో గణపతికి 108 నేవేద్యాలు సమర్పిస్తున్న మహిళలు

హిమోఫోలియా వ్యాధిగ్రస్తులు ధైర్యంగా ఉండాలి

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ పి. విజయ్‌చందర్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ పి. విజయ్‌చందర్ రెడ్డి

హనుమకొండ కలెక్టరేట్, సెప్టెంబర్ 15: హిమోఫోలియా వ్యాధి ఒక జన్యురకమైన వ్యాధి అని, ఇతర దీర్ఘకాలిక రోగాలవలే దీనిని కూడా జయించొచ్చని, వ్యాధిగ్రస్తులు ధైర్యంగా ఉండాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ పి.విజయ్‌చందర్‌రెడ్డి అన్నారు. హిమోఫోలియా వరంగల్ సొసైటీ చాప్టర్ 25 ఏళ్ల వార్షికోత్సవం హనుమకొండ సుబేదారిలోని రెడ్‌క్రాస్ సొసైటీలో ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన విజయ్‌చందర్‌రెడ్డి మాట్లాడుతూ.. వ్యాధిగ్రస్తులు వ్యాధి గురించి ఆలోచిస్తూ ఉండటం కన్నా షుగర్, బీపీ వచ్చిన వాళ్లు ఎలాగైతే వాళ్ల దినచర్యను ముందుకు తీసుకెళ్తున్నారో అదే విధంగా హిమోఫోలియా అనేది కూడా ఎటువంటి ఆటంకం జరగకుండా ముందుకు తీసుకెళ్లడానికి ఎన్నో రకాల అవగాహన సదస్సులు ఏర్పాటు చేశామన్నారు. ఎన్నో నూతన వైద్య విధానాలతో రూపొందించిన కొత్త మందులు మార్కెట్‌లో లభ్యమవుతున్నాయన్నారు. అలాంటి మందులు హిమోఫోలియా వ్యాధిగ్రస్తులు వాడి సాధారణ జీవితం అవలంబించడం సాధ్యమన్నారు. వార్షికోత్సవంలో నేషనల్ హెల్త్ మిషన్ ఎంజీఎం హాస్పిటల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ వైద్య గౌతమ్, వాగ్దేవి కాలేజీ ఫీజియోథెరపీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జె. చిరంజీవి, హిమోఫిలియా వరంగల్ సొసైటీ చాప్టర్ సెక్రెటరీ డాక్టర్ సుమన్ కుమార్, అధ్యక్షులు రమేష్ చందర్‌రావు, రెడ్‌క్రాస్ సొసైటీ ఈసీ మెంబర్ పుల్లూరు వేణుగోపాల్, ఇంటాస్ ఫార్మా కంపెనీ మేనేజర్‌లు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతోనే మానసికోల్లాసం



క్రీడాకారులకు బహుతులను అందజేస్తున్న ఏసీపీ

హసన్‌పర్తి, సెప్టెంబరు 15: క్రీడలతోనే మానసికోల్లాసమని టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ అన్నారు. మండలంలోని ఎర్రగట్టుగుట్ట కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న వరంగల్ జిల్లా టెబుల్ టెన్నిస్ టోర్నమెంట్-2024 పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ ముఖ్య అతిథిగా హాజరై ప్రతిభకనబరిచిన విజేతలకు బహుమతులను అందజేసి మాట్లాడారు. ప్రతీ ఒక్కరు చదువుతో పాటు క్రీడల్లో రాణించి ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అశోక్‌రెడ్డి మాట్లాడుతూ.. కిట్స్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన టోర్నమెంట్‌లో అండర్-11, 13, 15, 17, 19 సింగిల్స్, డబుల్స్ క్రీడా పోటీల్లో 100 మందికిపైగా బాలబాలికలు పాల్గొన్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కిట్స్ మేనేజ్‌మెంట్ సభ్యులు ఆకారపు హరీష్, తెలంగాణ రాష్ట్ర బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పింగిళి రమేష్‌రెడ్డి, డీటీటీఏ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎం.శ్రీనివాస్‌రెడ్డి, ఫ్యాకల్టీ మహేష్, వెంకటస్వామి, పీఆర్‌ఓ డాక్టర్ డి.ప్రభాకరాచారితో పాటు క్రీడాకారులు పాల్గొన్నారు.

సామాజిక సేవా కార్యక్రమాలపై దృష్టి పెట్టాలి..



మహిళా లయన్స్‌ను సత్కరించిన నేతలు

హనుమకొండ కల్చరల్, సెప్టెంబరు 15: భవిష్యత్‌లో మహిళలతోపాటు ముఖ్యంగా యువత సామాజిక సేవా కార్యక్రమాల పట్ల మరింత ఆకర్షితులై అంతర్జాతీయ లయన్స్ సంస్థల్లో సభ్యులుగా చేరాలని- 320 ఎఫ్ లయన్స్‌జిల్లా గవర్నర్ కుందూరు వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం హనుమకొండలోని లయన్స్ భవన్‌లో జీఈటీ జిల్లా కోఆర్డినేటర్ పుట్ట హరికిషన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కొత్త క్లబ్‌ల ఏర్పాటు, మెంబర్‌షిప్ గ్రోత్ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాతోపాటు నల్లగొండ జిల్లాలోని యాదగిరి గుట్ట ఇతర ప్రాంతాలకు విస్తరించిన 320-ఎఫ్ పరిధిలో ప్రస్తుతం ఉన్న 90 క్లబ్‌లకు తోడు మరొక నూతన 20 క్లబ్‌లను ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకతను నొక్కి చెప్పారు. ప్రత్యేక అతిథిగా పాల్గొన్న జీఈటీ మల్టీపుల్ కోఆర్డినేటర్ ఎస్ఎన్. రెడ్డి మాట్లాడుతూ.. వరంగల్‌లో లయన్స్ క్లబ్‌లు లేని నూతన మండల కేంద్రాల్లో ఉత్సాహవంతులైన యువతతో క్లబ్‌లను ఏర్పాటు చేసుకునేందుకు అవకాశాలున్నాయని అన్నారు. ఈ సందర్భంగా 8 లయన్స్ క్లబ్‌లను ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చిన నాయకులను, మహిళలను ప్రత్యేకంగా సత్కరించారు. వీడీజీ-1 డాక్టర్ చంద్రశేఖర్ ఆర్య వీడీజీ-2 నరహరి సుధాకర్‌రెడ్డి, డాక్టర్ కె.సుధాకర్‌రెడ్డి, కన్న పరశురాములు, పొట్లపల్లి శ్రీనివాసరావు, టి.లక్ష్మీనర్సింహరావు, డాక్టర్ కె.రాజేందర్‌రెడ్డి, డీసీఎస్ హబీబ్, రేపూరి రమణారెడ్డి, పెద్ది వెంకటనారాయణగౌడ్, డాక్టర్ అజిత్ తదితర అనేక మంది ప్రముఖులు అన్ని క్లబ్‌ల నాయకులు పాల్గొన్నారు.

వార్షికోత్సవాన్ని విజయవంతం చేయాలి

కాజీపేట, సెప్టెంబరు 15: హనుమకొండ అంబేద్కర్‌భవన్‌లో ఈ నెల 17 న నిర్వహించనున్న తెలంగాణ సాయుధపోరాట వార్షికోత్సవాన్ని విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం. చుక్కయ్య అన్నారు. కాజీపేటలో ఆదివారం సీపీఎం పార్టీ ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో చుక్కయ్య మాట్లాడారు. ఈ వార్షికోత్సవంలో పోరాట వాస్తవాలు ప్రజలకు తెలిపేందుకు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సభకు రాష్ట్రకార్యదర్శి తమ్మినేని వీరభద్రం ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని, ఈ కార్యక్రమానికి పార్టీ శ్రేణులు పెద్దఎత్తున హాజరుకావాలని కోరారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

ఐనవోలు, సెప్టెంబరు 15: నందనం గ్రామానికి చెందిన యాకర ఐలయ్య అనారోగ్యంతో మృతిచెందాడు. టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు ఆదివారం భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించి, ఆయన కుమారుడు కాంగ్రెస్ పార్టీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు యాకర సాంబయ్య, కుటుంబసభ్యులను పరామర్శించి సానుభూతిని తెలిపారు. ఆయన వెంట నాయకులు బుర్ర రాజశేఖర్, కంకర శ్రీనివాస్, యాకర యాదగిరి, మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న మొబైల్స్ అప్పగింత

మడికొండ, సెప్టెంబరు 15: ఆరుగురు వ్యక్తులు పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను పోలీసులు పట్టుకుని బాధితులకు అప్పగించారు. మడికొండ ఇన్‌స్పెక్టర్ పి. కిషన్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాజీపేట మండలం మడికొండకు చెందిన బోగి కుమారస్వామి, నెలకంటి వీరస్వామి, ఎం.జితేందర్, డి. కొమురయ్య, తరాలపల్లికి చెందిన ఎల్. ప్రవీన్, కడిపికొండకు చెందిన శంకరయ్య మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నారు. సీపీ అంబర్‌కిషోర్ ఝా ఆదేశాల మేరకు సెంటర్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్ట్రార్ (సీఈఐఆర్) అప్లికేషన్ ద్వారా మొబైల్స్ వెతికి పట్టుకున్నామని చెప్పారు. ఎవరైనా మొబైల్స్ మిస్సయితే ఈ అప్లికేషన్ ద్వారా మీ సేవాలో దరఖాస్తు చేసుకుంటే గుర్తిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రాజబాబు, కానిస్టేబుళ్లు సంపత్, వాసు ఉన్నారు.

ఎక్స్‌కవేటర్ దహనం

వేలేరు, సెప్టెంబరు 14: ఎక్స్‌కవేటర్ శుక్రవారం రాత్రి దగ్ధమైంది. బాధితుడి కథనం ప్రకారం.. వేలేరు మండలం పీచర గ్రామానికి చెందిన మంతపురి అశోక్‌కు చెందిన ఎక్స్‌కవేటర్ రోజు వారిగా పని చేసి సాయంత్రం ఓ పౌల్ట్రీ ఫామ్ వద్ద ఉంచి శుక్రవారం ఇంటికి వెళ్లాడు. శనివారం ఉదయం ఎక్స్‌కవేటర్‌ను తీసుకువెళ్లేందుకు రాగా, ఎక్స్‌కవేటర్ షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయి ఉండడంతో బాధితుడు అశోక్ షాక్‌కు గురయ్యాడు. బాధితుడు వేలేరు పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు.

నిమజ్జనానికి వేళాయే..

(3వ పేజీ తరువాయి)

వాహనాలు మాత్రమే అనుమతిస్తారు. ఈ శోభాయాత్ర హంటర్‌రోడ్డు, అదాలత్, సీపీవో, హనుమకొండ చౌరస్తా, బాలాంజనేస్వామి గుడి మీదుగా రావాలి. నిమజ్జనం అనంతరం వాహనాలు శాయంపేట మీదుగా వెళ్లాలి.

● హనుమకొండకు చెందిన భారీ వినాయక విగ్రహాలు చిన్న వడ్డెపల్లి చెరువులో నిమజ్జనం చేయాలి.

● నేషన్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు కోట చెరువులో నిమజ్జనం చేయకూడదని జిల్లా అధికారులు నిర్ణయించారు. కోట చెరువులో నిమజ్జనం కోసం వచ్చే విగ్రహాలు చిన్న వడ్డెపల్లి చెరువులో నిమజ్జనం చేయాలి.

● ఎక్సైజ్ కాలనీ, రెవెన్యూకాలనీ, వడ్డెపల్లి ప్రాంతాల విగ్రహాలు బంధం చెరువులో నిమజ్జనం చేయాలి.

● చిన్న వడ్డెపల్లి చెరువులో నిమజ్జనం చేసే విగ్రహాలు కాశిబుగ్గ, పోచమ్మ మైదాన్, దేశాయిపేట మీదుగా వెళ్లి నిమజ్జనం అనంతరం ఏనుమాముల మార్కెట్, కాశిబుగ్గ మీదుగా వెళ్లాలి.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
సోమవారం ● 16 సెప్టెంబరు 2024
features@andhrajyothy.com



ఆకలి తీర్చడానికి చానెల్ ఈదింది!

పేద పిల్లల ఆకలి తీర్చాలి, తనలాంటి మరికొందరికి స్ఫూర్తిగా నిలవాలి.. ఇవీ ప్రిషా తప్రే కలలు. వాటిని ఒకేసారి నెరవేర్చుకుంది పదహారేళ్ల ఈ బ్రిటిష్-ఇండియన్. గజ ఈతగాళ్లకే సవాల్ విసిరే ఇంగ్లీష్ ఛానెల్‌ని ఈదిన ఈ ధీశాలి... తన సాహస యాత్రను ఇలా కొనసాగిస్తానంటోంది.



"కల్లోలంగా ఉన్న నీరు, చుట్టూ చీకటి... 'గమ్యం వరకూ చేరగలనా?' అనే సందేహం... కానీ ఎలాగైనా సాధించాలనే పట్టుదల... ఇంగ్లీష్ ఛానెల్‌ను ఈదుతున్నప్పుడు మొదటి రెండు గంటలు నేను ఎదుర్కొన్న పరిస్థితులివి. స్విమ్మింగ్‌లో ఇప్పటివరకూ నాకు అత్యంత దుర్భరమైన అనుభవం ఇది" అంటోంది ప్రిషా తప్రే. ఈ నెల నాలుగో తేదీన... బ్రిటన్‌లోని డోవర్ నుంచి క్యాప్ గ్రిస్ నెజ్ వరకూ... ఇంగ్లీష్ ఛానెల్‌లో 34 కిలోమీటర్లు ఈత కొట్టిన ఆమె ఒడ్డుకు చేరగానే... అక్కడ ఉన్న జనసందోహం కేరింతలతో స్వాగతం పలికింది. ఆ హర్షాతిరేకాలు ఆమె సాహసానికి మాత్రమే కాదు, ఔదార్యానికి కూడా.

ప్రిషాది కొన్నేళ్ల క్రితం బ్రిటన్‌లో స్థిరపడిన మహారాష్ట్రియన్ కుటుంబం. అక్కడే పుట్టిన ప్రిషా ప్రస్తుతం లండన్‌లోని బుషే మీడ్స్ స్కూల్‌లో చదువుతోంది. ఆమెకు చిన్న వయసులోనే స్విమ్మింగ్‌ను పరిచయం చేశారు తల్లితండ్రులు." మా ఇంటికి దగ్గరలో ఒక చెరువు ఉంది. అక్కడ చాలామంది ఈత కొడుతూ ఉంటారు. సాయంత్రం కాసేపు స్విమ్మింగ్ ప్రాక్టీస్ చెయ్యడం నా దినచర్యలో భాగమైపోయింది" అని చెబుతోంది ప్రిషా. ఆమె ఆసక్తిని గమనించిన తల్లితండ్రులు స్థానికంగా ఉన్న వాట్‌ఫోర్డ్ స్విమ్మింగ్ క్లబ్‌లో చేర్పించారు. క్రమంగా ఆమె ప్రావీణ్యాన్ని సంపాదించుకుంది. కానీ.. గజ ఈతగాళ్ళకు సైతం సవాల్‌గా నిలుస్తూ, ఈదడానికి సంకోచించేలా చేసే ఇంగ్లీష్ ఛానెల్‌ను ఒంటరిగా దాటాలనే ఆలోచన ఆమెకు ఎలా కలిగింది?

అప్పుడే నిర్ణయించుకున్నా...

నాలుగేళ్ళ క్రితం మా కుటుంబ సభ్యులందరూ కూర్చొని మాట్లాడుతూ ఉండగా... ఇంగ్లీష్ ఛానెల్ గురించి చర్చ వచ్చింది. ప్రతి సంవత్సరం వందలాది మంది ఈతగాళ్ళు ఇంగ్లీష్ ఛానెల్ ఈదడానికి వస్తారనీ, వారిలో కొందరు ప్రాణాలు కోల్పోతూ ఉంటారనీ తెలిసింది. అది వినగానే... ఎప్పటికైనా దాన్ని ఈదాలని నిర్ణయించుకున్నాను. అయితే దానికి ప్రేరణ మాత్రం... నేను వివిధ మాధ్యమాల ద్వారా తెలుసుకున్న ఆవేదనాభరితమైన విషయాలు. ప్రపంచంలోని చాలా దేశాల్లో పేదరికం, ఆకలి కారణంగా ఎందరో పిల్లలు ప్రతిరోజూ మరణిస్తున్నారు. వారికి నేను ఏ విధంగా సాయపడగలనని ఆలోచించేదాన్ని. నావంతుగా నిధులు సేకరించాలనుకున్నాను. ఇంగ్లీష్ ఛానెల్‌ను ఈది... ఆ సందర్భాన్ని విరాళాల కోసం ఉపయోగించుకోవాలని నిర్ణయించుకున్నాను" అని వివరించింది ప్రిషా. ఆగకుండా అంత దూరం ఈదాలంటే ఎంతో దారుఢ్యం, మనోనిబ్బరం ఉండాలి. రెండు, మూడు గంటలతో ప్రారంభించి... ఎనిమిది, తొమ్మిది... చివరిగా పన్నెండు, పదమూడు గంటలు ఈదడం సాధన చేసింది. దీనికి ఆమె కోచ్‌లు ఎంతో సహకరించారు. చివరకు ఆ రోజు రానేవచ్చింది.

నిద్రపోతానేమో అనిపించింది...

ప్రిషా ప్రయత్నం గురించి తెలుసుకున్న క్రీడాభిమానులు, స్థానికులు డోవర్ దగ్గరకు వచ్చి శుభాకాంక్షలు చెబుతూండగా... ఆమె ఇంగ్లీష్ ఛానెల్‌లో దూకింది. కానీ పరిస్థితులతో సర్దుకోడానికి రెండుగంటలు పట్టింది. "ఈత కొట్టేటప్పుడు మొదటి రెండు గంటలూ ఎప్పుడూ కష్టంగానే ఉంటుంది. ఎందుకంటే రాబోయే కొన్ని గంటలు అక్కడే ఉండాలనే నిజం మీ ఆలోచనల్ని నిలవనివ్వకుండా చేస్తుంది. నేను ఈత కొడుతున్న సమయంలో నిద్రవచ్చినట్టనిపించింది. నా కళ్ళు మూసుకొని, నిద్రలోకి జారిపోతానేమో అనిపించింది. ఎందుకంటే నేను చీకట్లో మొదలుపెట్టాను. కానీ కొద్ది సేపటికి ఆకాశంలోకి సూర్యుడు వచ్చాడు. నా నిద్ర ఎగిరిపోయింది. తొలి రెండు గంటల తరువాత... వాతావరణ పరిస్థితులు మారిపోయాయి. గాలి తీవ్రత, నీటిలో కల్లోలం తగ్గిపోయాయి. నేను కోరుకున్నదీ అలాంటి వాతావరణాన్నే" అంటోందామె. 11 గంటల 48 నిమిషాలు ఈది... గమ్యానికి చేరుకున్న ప్రిషా... ఇంగ్లీష్ ఛానెల్‌ను ఈదిన అతి పిన్నవయస్కురాలైన బ్రిటిష్-ఇండియన్‌గా గుర్తింపు పొందింది. తన సాహసంతో 3,700 పౌండ్లు (దాదాపు నాలుగు లక్షల రూపాయలకు పైగా) సేకరించింది. దాన్ని బ్రిటన్‌లో, ఇండియాలో పేద పిల్లల ఆకలి తీర్చడం కోసం 'అక్షయపాత్ర ఫౌండేషన్'కు విరాళంగా ఇచ్చింది. నేను దీన్ని సీరియస్‌గా తీసుకోవడానికి మరో ప్రధాన కారణం... ఇక్కడున్న ఆసియన్ కమ్యూనిటీని క్రీడల దిశగా ప్రోత్సహించడం. ఆసియన్ అమ్మాయిల్లాంటి జాతిపరమైన మైనారిటీలు స్విమ్మింగ్ లాంటి పోటీ క్రీడల్లో ఎక్కువగా నాకు కనిపించలేదు. వాళ్ళకు నా ప్రయత్నం ప్రేరణ కలిగించాలని కోరుకుంటున్నాను" అని చెబుతున్న ప్రిషా భవిష్యత్ ప్రణాళికలేమిటి? "వైద్యరంగంలోకి వెళ్ళాలనేది నా కోరిక. కానీ స్విమ్మింగ్‌ను కొనసాగిస్తాను. ఇరవై నాలుగు గంటల పాటు స్విమ్మింగ్ చెయ్యాలనేది నా తరువాతి లక్ష్యం. అది త్వరలోనే నెరవేరుతుందని ఆశిస్తున్నాను" అని అంటోంది ప్రిషా.

> "నేను ఇంగ్లీష్ ఛానెల్ ఈదానంటే ఇంకా నమ్మలేకపోతున్నా. చదువును, స్విమ్మింగ్ శిక్షణను జాగ్రత్తగా బ్యాలెన్స్ చేసుకోవడం వల్లే ఇది సాధ్యమయింది. కొన్నిసార్లు ఆరు నుంచి పది గంటలు శిక్షణలోనే ఉండేదాన్ని. నాకు మా అమ్మ స్ఫూర్తి. నా వయసులో ఆమె మంచి అథ్లెట్. ఏదైనా అనుకుంటే సాధించే వరకూ విశ్రమించవద్దని ఎప్పుడూ చెబుతూ ఉంటుంది. నన్ను నేను నిరూపించుకోవడానికి ఏదైనా పెద్ద పని చెయ్యాలనుకున్నాను. ఏదైనా భిన్నంగా చెయ్యాలనుకున్నాను. నన్ను నేను సవాల్ చేసుకోవాలనుకున్నాను. జీవితంలో ఈ రోజు కోసం చాలా కష్టపడ్డాను. ఇప్పుడు అందరూ అభినందిస్తూ ఉంటే... సంతోషంగా అనిపిస్తోంది. నా జర్నీలో ఇది ఆరంభం మాత్రమే."



కఠోర పరిశ్రమ ఎక్కువుంటుందో విజయం అక్కడే ఉంటుంది. సెలబ్రిటీ ఫిట్‌నెస్ ట్రైనర్ **యాస్మిన్ కరాచీవాలా** జీవితమే ఇందుకు ఉదాహరణ. ఒకప్పుడు బద్ధకంగా రోజులు వెళ్లదీసిన ఆమె... నిబద్ధతతో కష్టపడి లక్ష్యాన్ని చేరుకుంది. నేడు సామాన్యులకే కాదు... వెండితెర వేల్పులకూ స్ఫూర్తిమంత్రమైంది.

ఆమెకు తారలే అభిమానులు

"నా బాల్యం చాలా విచిత్రంగా గడిచిపోయింది. ఒక్కసారి వెనక్కి తిరిగి చూసుకొంటే నన్ను నేనే నమ్మలేనంతగా మారిపోయింది నా శరీరం... జీవితం. చిన్నప్పుడు నేను చాలా బద్ధకస్తురాలిని. ఆడుకోవడం, తినడం, టీవీ చూడటం, పడుకోవడం ఇదే నా దినచర్య. నా బాల్యమే కాదు, యుక్తవయసు కూడా అలాగే సాగిపోయింది. ఎంత బద్ధకస్తురాలినంటే... కొన్నిసార్లు స్కూల్ నుంచి వచ్చాక యూనిఫామ్ మార్చకుండా పడుకునేదాన్ని. పిజ్జాలు, బిర్యానీలంటే పిచ్చి. బర్గర్లు, నూడుల్స్‌లాంటి ఫాస్ట్ ఫుడ్‌తోనే కడుపు నిండిపోయేది. నన్ను, నా అలవాట్లు చూసి మా అమ్మ ఎంతో ఆందోళన చెందేది. నా బద్ధకం ఎలా వదిలించాలో తెలియక బాధపడేది. అలాంటి నేను ఇవాళ యాభై నాలుగేళ్ల వయసులోనూ ఇంత ఫిట్‌గా, క్రమశిక్షణగా ఉన్నానంటే ఎదుటివారికే కాదు, నాకూ ఆశ్చర్యంగా అనిపిస్తుంది. ఒక సంకల్పంతో నిబద్ధతగా కష్టపడితే అసాధ్యమైన లక్ష్యం ఏదీ ఉండదనేది నా నమ్మకం. ఆ నమ్మకమే నన్ను మీ ముందు ఇలా నిలబెట్టింది.

టామ్‌బాయ్‌లా...

నేను పుట్టింది అమెరికాలో. అక్కడే పాఠశాల విద్యాభ్యాసం పూర్తయింది. తరువాత ముంబయికి వచ్చాం. సెయింట్ జేవియర్ కాలేజీలో చదివాను. నా స్నేహితుల్లో ఎక్కువ మగపిల్లలు ఉండేవారు. దాని కోసమే అమ్మను అడిగాను... కోఎడ్యుకేషన్ కాలేజీలో చేర్పమని. అప్పుడైతే వారితో కలిసి ఆడుకోవచ్చనేది నా ఉద్దేశం. నాకు నచ్చినట్టు జడ వేయడానికి అమ్మకు గంటకు పైగా పట్టేది. ఒక రోజు విసిగిపోయి సెలూన్‌కు తీసుకువెళ్లి నా జుట్టు కట్ చేయించింది. షార్ట్ హెయిర్‌తో అప్పటి నుంచి నా ఆహార్యం కూడా టామ్‌బాయ్‌లా మారిపోయింది. ఇక కళాశాలలో నేను ఆడినవి రెండే ఆటలు. షార్ట్‌పుట్, జావెలిన్ త్రో. మన బలం చూపించుకొనే క్రీడలు కదా అవి. అందుకే వాటిని ఎంచుకున్నా. టీనేజీలో రెబల్‌గా ఉండేదాన్ని. ఎవరైనా ఇది చేయమని చెబితే నాకు అస్సలు నచ్చేది కాదు.

స్నేహితురాలితో వెళ్లి...

నా ఫిట్‌నెస్ ప్రయాణం అనుకోకుండా మొదలైంది. ఒక రోజు నా స్నేహితురాలు మా ఇంటికి వచ్చింది. అప్పటికే తను ఓ అబ్బాయితో ప్రేమలో ఉంది. అందుకే బరువు తగ్గాలని అనుకొంటున్నానని, దాని కోసం జిమ్‌కు వెళ్లాలని, నన్ను తోడు రమ్మని అడిగింది. అప్పుడు నా వయసు పద్ధెనిమిదేళ్లు. స్నేహితురాలు అడగడంతో కాదనలేకపోయాను. కొన్నిసార్లు మన జీవితంపై ఎదుటివారి ఒత్తిడి అనేక విధాలుగా పని చేస్తుంది. అయిష్టంగానే తన వెంట జిమ్‌కు వెళ్లి, నేనూ ఫిట్‌నెస్ క్లాస్‌లో చేరాను. ఏరోబిక్స్ సెషన్‌తో నా ఫిట్‌నెస్ జర్నీ మొదలైంది. డ్యాన్స్ మూమెంట్స్‌లా ఉండే ఆ వ్యాయామాలు నాకు బాగా నచ్చాయి. జిమ్‌కు వెళ్లేవరకు అందరు అమ్మాయిల్లా నేనూ బాగా డ్యాన్స్ చేయగలననే నమ్మకం ఉండేది. ఏరోబిక్స్ మొదలుపెట్టాకే తెలిసింది... నాకు అసలు డ్యాన్స్ రాదని. నా కదలికలు మిగిలినవారికి భిన్నంగా ఉండేవి. అందరూ నన్ను వింతగా చూసేవారు. అది నాకు అవమానంగా అనిపించింది. దాంతో పట్టుదల పెరిగింది. ఒక్కరోజు కూడా మానకుండా జిమ్‌కు వెళ్లాను. ఎంతో శ్రమించాను. బాగా మెరుగయ్యాను.

> **నా శరీరాకృతిని చూసి 'మగరాయుడిలా ఉంది' అంటూ అవహేళనగా మాట్లాడేవారు. 'నాకంటూ ఒక రోజు వస్తుంది' అని వారికి సమాధానం ఇచ్చేదాన్ని, అందుకే సవాలుగా తీసుకుని ముందు నా శరీరాన్ని నాజూగ్గా తయారు చేసుకున్నా.**

టీచర్ సలహాతో...

నాలోని పట్టుదల, నైపుణ్యం చూసిన మా ఏరోబిక్స్ టీచర్... అమెరికాలో ఫిట్‌నెస్ కోర్సు చేయమని చెప్పారు. ఆమె సలహాతో 'అమెరికన్ కాలేజీ ఆఫ్ ఎక్సర్‌సైజ్'లో చేరి, ఫిట్‌నెస్ శిక్షణ తీసుకున్నాను. అలా ఒక ఫిట్‌నెస్ కోర్సులో సర్టిఫికెట్ పొందిన తొలి భారతీయురాలిని నేనే. అదే సమయంలో కిండర్‌గార్డెన్ టీచర్ ట్రైనింగ్ కూడా తీసుకున్నాను. ముంబయికి తిరిగి వచ్చాక ఫిట్‌నెస్ పాఠాలు మొదలుపెట్టాను. ఉదయం టీచింగ్, సాయంత్రం ఫిట్‌నెస్ క్లాస్‌లు. రోజూ నగరంలో ఈ చివర నుంచి... ఆ చివరకు ప్రయాణం. కొన్ని నెలలు గడిచాయి. 'ఫ్రెంచ్ ఇంటర్నేషనల్ స్కూల్'లో ఇంగ్లీష్ టీచర్‌గా ఉద్యోగం వచ్చింది. తరువాత మినాజ్ కరాచీవాలతో పెళ్లయింది. మా అబ్బాయి పుట్టాక ఫిట్‌నెస్ తరగతులు కుదించుకున్నా.

అవహేళన చేసినా...

మా బాబు కాస్త పెరిగే వరకు నా అవసరం ఉంటుంది కదా. దాని కోసం చాలా అవకాశాలు వదులుకున్నా. కుదిరిన సమయంలోనే శిక్షణ ఇచ్చేదాన్ని. అయితే అందరిలా కాకుండా... నాకంటూ ఒక గుర్తింపు కావాలనిపించింది. దాంతో మరింత నైపుణ్యం పెంచుకొనేందుకు పర్సనల్ ట్రైనర్ కోర్సు చేశాను. ఆ సమయంలో నా శరీరాకృతిని చూసి 'మగరాయుడిలా ఉంది' అంటూ అవహేళనగా మాట్లాడేవారు. 'నాకంటూ ఒక రోజు వస్తుంది' అని వారికి సమాధానం ఇచ్చేదాన్ని. అందుకే సవాలుగా తీసుకుని ముందు నా శరీరాన్ని నాజూగ్గా తయారు చేసుకున్నా. దీన్ని గమనించిన కొందరు తమకు కూడా అలాంటి ఆకృతి కావాలంటూ అడిగారు. తరువాత వారందరూ నా శిష్యులు అయ్యారు.

స్టూడియోకు శ్రీకారం...

ఫిట్‌నెస్ పాఠాల కోసం నా దగ్గరకు వచ్చేవారు క్రమంగా



పెరిగారు. దాంతో మా గెస్ట్ రూమ్‌ను ఫిట్‌నెస్ స్టూడియోగా మార్చాను. కొన్నాళ్లకు అది సరిపోక స్టూడియో... లివింగ్ రూమ్‌కు, తరువాత టెర్రస్‌కు, అక్కడి నుంచి బాంద్రాలోని పెద్ద హాల్‌కు మారింది. ఇంట్లో నేను తరగతులు చెప్పినంతసేపూ మావారు నాకు తోడుగా ఉండేవారు. ఇంకా ఏదో చేయాలన్న తపనతో అమెరికా వెళ్లి పిలెట్స్ ట్రైనింగ్ తీసుకున్నా. తద్వారా భారత్‌లో తొలి బీఏఎస్ఐ (బాడీ ఆర్ట్స్ అండ్ సైన్స్ ఇంటర్నేషనల్) సర్టిఫైడ్ పిలెట్స్ ఇన్‌స్ట్రక్టర్‌ను అయ్యాను.

తారల ట్రైనర్‌గా...

ఇక అప్పటి నుంచి నా జీవితమ అనూహ్య మలుపు తీసుకుంది. బాలీవుడ్ తారల నుంచి పిలుపు వచ్చింది. కత్రినా కైఫ్, దీపికా పదుకొనే, కరీనా కపూర్, అలియా భట్... దాదాపు ప్రముఖ హీరోయిన్లు అందరితో కలిసి పని చేశాను. వారికి వ్యక్తిగత ట్రైనర్‌గా కూడా ఉన్నాను. 'యాస్మిన్ బాడీ ఇమేజ్' పేరిట ముంబయిలో అతిపెద్ద పిలెట్స్ స్టూడియో నెలకొల్పాను. దాంతోపాటు నగరంలోనే మరో రెండు, ఢిల్లీ, దుబాయ్, ఢాకాల్లోనూ ఫ్రాంచైజీలు ప్రారంభించాను. రెండున్నర దశాబ్దాలకు పైబడిన నా ఈ ప్రయాణంలో... ఎన్నో ప్రతిష్ఠాత్మక అవార్డులు అందుకున్నాను. భారత్‌లో ఫిట్‌నెస్‌ను ఒక పరిశ్రమ స్థాయికి తీసుకువెళ్లానని ప్రముఖులు ఎందరో కొనియాడారు. అందుకు ఎంతో గర్వంగా ఉంది."

హాట్ హిట్స్



ఈ వారం అమెజాన్ మ్యూజిక్‌లో దేశవ్యాప్తంగా ట్రెండ్ అవుతున్న టాప్-10 బాలీవుడ్ పాటలు...

1. ఆజ్ కీ రాత్ (స్త్రీ-2)
2. తౌబా తౌబా (బ్యాడ్ న్యూజ్)
3. సాజ్‌నీ రే (లాపతా లేడీస్)
4. ఆయీ నై (స్త్రీ-2)
5. అఖియా గులాబ్ (తేరీ బాతోమ్‌మే ఐసా ఉల్ఝా జియా)
6. తైనూ ఖబర్ నహీ (ముంజ్యా)
7. చలేయా (జవాన్)
8. దేఖా తేనూ (మిస్టర్ అండ్ మిసెస్ మహీ)
9. అపనా బనాలే (భేడియా)
10. తేరీ బాతోమే (తేరీ బాతోమే ఐసా ఉల్ఝా జియా)

ట్రెండింగ్ టాప్ తెలుగు సాంగ్: నా రోజా నువ్వే (ఖుషి)

ఘనంగా సైమా అవార్డుల వేడుక



సౌత్ ఇండియన్ ఇంటర్నేషనల్ మూవీ అవార్డ్స్ (సైమా) 2024 వేడుక దుబాయిలో ఘనంగా జరిగింది. ఈ వేడుకలో దక్షిణాదికి చెందిన పలువురు తారలు సందడి చేశారు. రెండు రోజుల పాటు సాగే ఈ వేడుకలో.. తొలి రోజున తెలుగు, కన్నడ చిత్రాలకు సంబంధించి 2023లో ఉత్తమ ప్రదర్శన కనబర్చిన నటీనటులకు, చిత్రాలకు అవార్డులు అందజేశారు. ఫరియా అబ్దుల్లా, నేహా శెట్టి, శాన్వీ తమ ప్రదర్శనతో వేడుకకు విచ్చేసిన వారిని అలరించారు.



2024 సంవత్సరానికి గాను 'దసరా' చిత్రానికి ఉత్తమ నటుడిగా నాని, ఉత్తమ నటిగా కీర్తి సురేశ్ ఎంపికయ్యారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో బాలకృష్ణ నటించిన 'భగవంత్ కేసరి' ఉత్తమ చిత్రంగా నిలిచింది. కన్నడ పరిశ్రమ నుంచి 'సప్త సాగరాలు దాటి సైడ్ ఏ' చిత్రానికి ఉత్తమ నటుడిగా రక్షిత్ శెట్టి.. ఉత్తమ దర్శకుడిగా హేమంత్ రావు ఎంపికయ్యారు. 'టోబీ' చిత్రానికి గాను ఉత్తమ నటిగా చైత్ర ఆర్చర్ ఎంపికయ్యారు. కన్నడ స్టార్ నటుడు దర్శన్ నటించిన 'కాటేరా' ఉత్తమ చిత్రంగా అవార్డును అందుకుంది.





విజేతలు వీరే

- ఉత్తమ చిత్రం: భగవంత్ కేసరి
- ఉత్తమ నటుడు : నాని (దసరా)
- ఉత్తమ నటి : కీర్తి సురేష్ (దసరా)
- ఉత్తమ నటి (క్రిటిక్స్): మృణాల్ ఠాకూర్ (హాయ్ నాన్నా)
- ఉత్తమ దర్శకుడు : శ్రీకాంత్ ఓదెల (దసరా)
- ఉత్తమ నటుడు (క్రిటిక్స్): ఆనంద్ దేవరకొండ (బేబీ)
- సెన్సేషన్ ఆఫ్ ది ఇయర్: సందీప్‌రెడ్డి వంగా
- ఉత్తమ దర్శకుడు (క్రిటిక్స్): సాయి రాజేష్ (బేబీ)
- ఉత్తమ హాస్యనటుడు: విష్ణు(మ్యాడ్)
- ఉత్తమ ప్రతినాయకుడు: దునియా విజయ్ (వీర సింహారెడ్డి)
- ఉత్తమ సహాయ నటి: బేబీ కియారా (హాయ్ నాన్న)
- ఉత్తమ సహాయ నటుడు: దీక్షిత్ శెట్టి (దసరా)
- బెస్ట్ డెబ్యూ డైరెక్టర్: శౌర్యువ్ (హాయ్ నాన్న)
- ఉత్తమ డెబ్యూ ప్రొడ్యూసర్స్ : వైర ఎంటర్‌టైన్‌మెంట్స్, విజయేందర్ రెడ్డి తీగల (హాయ్ నాన్న)
- ఎమర్జింగ్ యాక్టర్: సుమంత్ ప్రభాస్ (మేమ్ ఫేమస్)
- ఉత్తమ డెబ్యూ నటి: వైష్ణవి చైతన్య (బేబీ)
- ఉత్తమ డెబ్యూ నటుడు: సంగీత్ శోభన్ (మ్యాడ్)
- ఉత్తమ సంగీత దర్శకుడు: హేషామ్ అబ్దుల్ వహాబ్ (హాయ్ నాన్న)
- ఉత్తమ నేపథ్య గాయని: శక్తిశ్రీ గోపాలన్ (హాయ్ నాన్న)
- ఉత్తమ గాయకుడు: రామ్ మిరియాల (బలగం)
- ఉత్తమ లిరిక్ రైటర్: అనంత శ్రీరామ్ (బేబీ)
- ఉత్తమ సినిమాటోగ్రాఫర్: భువన్ గౌడ (సలార్)







ప్రియుడితో ఏడడుగులు



నటి మేఘా ఆకాశ్ తన ప్రియుడు విష్ణుసాయిని పెళ్లి చేసుకున్నారు. ఆదివారం చెన్నైలో జరిగిన ఈ వివాహానికి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, సినీ తారలు, రాజకీయవేత్తలు హాజరయ్యారు. వరుడు సాయివిష్ణు తమిళ రాజకీయవేత్త తిరునవుకారసు కుమారుడు.

ప్రయాణం మొదలైంది



సెన్సిబుల్ డైరెక్టర్‌గా పేరు తెచ్చుకున్న క్రాంతి మాధవ్ తన కొత్త సినిమా వివరాలు వెల్లడించారు. వాస్తవ సంఘటనల నేపథ్యంలో రూపుదిద్దుకొనే ఈ సినిమాకు 'డీజీఎల్' అని పేరు పెట్టారు. గంటా కార్తీక్ రెడ్డి ఈ సినిమాకు నిర్మాత. ఈ సందర్భంగా రెండు పోస్టర్లు విడుదల చేశారు. కాజీపేట జంక్షన్‌లోని రైల్వే ట్రాక్‌పై హీరో నిలబడి ఉండగా, అతని చుట్టూ వివిధ ట్రాక్స్ పై రైళ్లు వెళుతున్నాయి. ఆ పోస్టర్‌లో 'జర్నీ బిగిన్స్' అని రాసుంది. నవంబర్‌లో షూటింగ్ మొదలవుతుందనీ, నటీనటులు, ఇతర వివరాలను త్వరలో వెల్లడిస్తామని నిర్మాత చెప్పారు. ఈ సినిమాకు జ్ఞానశేఖర్ వీఎస్ ఛాయాగ్రాహకుడు.



'కళింగ' చిత్రం ఇటీవలే విడుదలై హిట్ టాక్‌తో దూసుకుపోతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం ఆదివారం సక్సెస్ మీట్ నిర్వహించింది. చిత్ర దర్శకుడు ... హీరో ధృవ వాయు, హీరోయిన్ ప్రగ్యా నయన్, నిర్మాతలు దీప్తి కొండవీటి, పృథ్వీ యాదవ్ పాల్గొన్నారు.

నవ్య | చిత్రజ్యోతి

కార్తి కొత్త చిత్రం

కొత్తగా..



కార్తి కథానాయకుడిగా నటించబోయే తదుపరి చిత్రం ఖరారైంది. 'కార్తి 29' అనేది వర్కింగ్ టైటిల్. 'తానక్కరన్' చిత్రంతో దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకున్న తమిళ్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ విషయాన్ని చిత్రబృందం ఆదివారం తెలిపింది. ఎస్. ఆర్ ప్రకాశ్ బాబు, ఎస్.ఆర్ ప్రభు నిర్మిస్తున్నారు. పీరియాడికల్ కథాంశంతో రూపొందుతున్న ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మించనున్నారు. త్వరలో చిత్రీకరణ ప్రారంభించి, వచ్చే ఏడాది సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలో వెల్లడించనున్నారు.

అక్టోబర్‌లో లగ్గం



సాయి రోనక్, ప్రగ్యా నగ్రా జంటగా నటించిన చిత్రం 'లగ్గం'. రాజేంద్రప్రసాద్, రోహిణి, ఎల్బీ శ్రీరామ్ కీలకపాత్రలు పోషించారు. రమేశ్ చెప్పాల దర్శకత్వంలో వేణుగోపాల్ రెడ్డి నిర్మించారు. 'లగ్గం' విడుదల తేదీ ఖరారైంది. అక్టోబర్ 18న విడుదల చేస్తున్నట్లు మేకర్స్ ఆదివారం తెలిపారు. కుటుంబంతో కలసి చూడదగ్గ చిత్రం 'లగ్గం' అని రాజేంద్రప్రసాద్ తెలిపారు. కుటుంబ విలువల గొప్పదనాన్ని ఈ తరానికి తెలియజెప్పే చిత్రమిదని వేణుగోపాల్ రెడ్డి అన్నారు. సంగీతం: మణిశర్మ, సినిమాటోగ్రఫీ: బాల్‌రెడ్డి

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
వరంగల్ ● సోమవారం 16 సెప్టెంబరు 2024
diksuchi@andhrajyothy.com



టీజీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం

ఎకానమీ

తెలంగాణలో వైద్యం, ఆరోగ్యం

ఐక్యరాజ్యసమితి 2015లో నిర్దేశించిన 17 సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను నిర్దేశించుకుంది. వీటిని 2030 నాటికి సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ లక్ష్యాల్లో మూడోది ఆరోగ్యం, సంక్షేమం(గుడ్ హెల్త్ అండ్ వెల్‌బీయింగ్). తెలంగాణ 2024 సాంఘిక, ఆర్థిక ముఖచిత్రం(సర్వే) ప్రకారం ప్రజల ఆరోగ్య సూచికలు కిందివిధంగా ఉన్నాయి.

- **మరణాల రేటు:** ఒక సంవత్సర కాలంలో ప్రతి వెయ్యి మందికి మరణించిన వారి సంఖ్యను మరణాల రేటు అంటారు. 2020లో జరిగిన శాంపిల్ రిజిస్ట్రేషన్ ప్రకారం తెలంగాణలో మరణాల రేటు ఆరు. జాతీయస్థాయిలో కూడా ఇది 'ఆరు'గానే ఉంది.
- **శిశు మరణాల రేటు:** జన్మించిన ప్రతి వెయ్యిమంది శిశువుల్లో ఏడాది వయసులోపు మరణిస్తున్న వారి సంఖ్యను శిశు మరణాల రేటు అంటారు. 2020లో జరిగిన శాంపిల్ రిజిస్ట్రేషన్ ప్రకారం తెలంగాణలో శిశు మరణాల రేటు 21 కాగా, ఇండియాలో 28గా ఉంది.
- **అయిదు సంవత్సరాల వయసు లోపు శిశు మరణాలు:** 2020 సంవత్సర శాంపిల్ రిజిస్ట్రేషన్ ప్రకారం తెలంగాణలో జన్మించిన ప్రతి వెయ్యిమందిలో 23 మంది అయిదు సంవత్సరాలు నిండక ముందే మరణిస్తున్నారు. కాగా ఇండియాలో ఈ సంఖ్య 32గా ఉంది.
- **గర్భిణుల మరణాలరేటు:** గర్భం ధరించిన ప్రతి లక్షమందిలో ప్రసూతి సమయంలో కానీ, అంతకుముందు గానీ మరణించిన వారి సంఖ్యను గర్భిణుల మరణాల రేటు అంటారు. 2018లో జరిగిన శాంపిల్ రిజిస్ట్రేషన్ ప్రకారం తెలంగాణలో గర్భిణుల మరణాల రేటు 43 కాగా ఇండియాలో 97గా ఉండటం గమనార్హం.
- **మొదటి 28 రోజుల్లో మరణిస్తున్న శిశువుల రేటు:** 2020 సంవత్సర శాంపిల్ రిజిస్ట్రేషన్ ప్రకారం తెలంగాణలో పుట్టిన ప్రతి వెయ్యిమంది శిశువుల్లో మొదటి 28 రోజుల్లో మరణిస్తున్న వారి సంఖ్య 15 కాగా, ఇండియాలో 20గా ఉంది.
- **సురక్షిత ప్రసూతి:** అయిదో జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం తెలంగాణలో సురక్షిత ప్రసూతి(ఆసుపత్రి వైద్యుల పర్యవేక్షణలో జరిగే ప్రసూతి) 97 శాతం. కాగా ఇండియాలో ఇది 88.6 శాతం.
- **జననాల రేటు:** ఒక సంవత్సర కాలంలో ప్రతి వెయ్యి మంది జనాభాకు గల జననాల సంఖ్యను జననాల రేటు అంటారు. 2020 సంవత్సర శాంపిల్ రిజిస్ట్రేషన్ ప్రకారం తెలంగాణ జననాల రేటు 16.4 కాగా, ఇండియా జననాల రేటు 19.4గా ఉంది.
- **సంతానోత్పత్తి రేటు:** సంతానోత్పత్తి వయసులో సగటున ప్రతి స్త్రీ జన్మనిస్తున్న శిశువుల సంఖ్యను సంతానోత్పత్తి రేటు అంటారు. 2020 సంవత్సర శాంపిల్ రిజిస్ట్రేషన్ ప్రకారం తెలంగాణలో సంతానోత్పత్తి రేటు 1.5 కాగా, ఇండియాలో రెండుగా ఉంది.

పై ఆరోగ్య సమాచారాన్ని పరిశీలిస్తే ఇండియా కంటే తెలంగాణ రాష్ట్రం మెరుగైన ఆరోగ్య సూచికలను కలిగి ఉంది. పైన చెప్పిన అన్ని ఆరోగ్య సూచికల్లోనూ తెలంగాణ మెరుగైన స్థానంలో ఉండటం గమనార్హం.

ఆరోగ్య అవస్థాపన

ఆరోగ్య సంబంధిత అవస్థాపన సౌకర్యాలు ప్రధానంగా ఆరోగ్య స్థాయిని, సూచికలను నిర్ణయిస్తాయి. తెలంగాణలో ఆరోగ్య సంబంధిత అవస్థాపన కిందివిధంగా ఉంది. 2024 తెలంగాణ ఆర్థిక సర్వే ప్రకారం రాష్ట్రంలో ప్రభుత్వరంగంలో అన్నిరకాల ఆసుపత్రులు మొత్తం 6,401 ఉన్నాయి. వాటిలో 26 బోధనాసుపత్రులు, 636 గ్రామీణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 462 బస్తీ దవాఖానాలు, 246 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 4,745 ఉప ఆరోగ్య కేంద్రాలు, 97 కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలు, 14 ప్రత్యేక చికిత్స కేంద్రాలు, 75 ఔషధ కేంద్రాలు(డిస్పెన్సరీలు), 26 ఇతర ఆసుపత్రులున్నాయి. 8,072 మంది వైద్యులు ప్రభుత్వ రంగంలో ఉండగా, అందులో 6,307 మంది క్రమబద్ధీకరించిన వైద్యులు ఉన్నారు.

తెలంగాణ మెడికల్ సర్వీసెస్ అండ్ అవస్థాపన సౌకర్యాల అభివృద్ధి కార్పొరేషన్


ఔషధాలు, చికిత్సకు అవసరమైన పరికరాలు, దుస్తులు, వైద్య యంత్రాలు, ఆసుపత్రులు, వైద్యులు, రోగులకు అవసరమైన ఇతర సామగ్రిని సేకరించి సరఫరా చేయడానికి ఈ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేశారు. ఆసుపత్రులు, వైద్య కళాశాల భవనాల నిర్మాణాన్ని కూడా ఈ కార్పొరేషన్ చేపడుతుంది. ఆరోగ్యం, వైద్య, కుటుంబ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో కార్పొరేషన్ పనిచేస్తుంది.

ఆయుర్వేదం, యోగా, నేచురోపతి, యునాని, సిద్ధ, హోమియోపతి

జాతీయ ఆయుష్ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రప్రభుత్వం ఆయుష్ సంబంధిత సేవలను విస్తృతంగా అందిస్తున్నది. ఆయుష్ సంబంధిత 860 వివిధరకాల యూనిట్లు రాష్ట్రంలో వైద్యరంగంలో పనిచేస్తున్నాయి.



వైద్య విద్య



తెలంగాణలో 26 ప్రభుత్వ వైద్య కళాశాలున్నాయి. వాటిలో 3,690 ఎంబీబీఎస్ సీట్లు, 1,144 పీజీ సీట్లు, 104 సూపర్ స్పెషాలిటీ సీట్లు ఉన్నాయి. డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ రాష్ట్రంలో వైద్య విద్యను పర్యవేక్షిస్తుంది. వీటికి అదనంగా హైదరాబాద్‌లో సొంత వైద్య కళాశాలలను కూడా ప్రభుత్వం నిర్వహిస్తుంది. వీటిలో వంద గ్రాడ్యుయేట్ సీట్లు, 27 పీజీ సీట్లు ఉన్నాయి. 28 నర్సింగ్ కళాశాలలను కూడా ప్రభుత్వం నిర్వహిస్తున్నది. 2024లో కొడంగల్, వికారాబాద్ జిల్లాల్లో నర్సింగ్ కళాశాలల ఏర్పాటుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. మరో ఎనిమిది నూతన వైద్య కళాశాలలను ములుగు, నారాయణపేట, జోగులాంబ గద్వాల్, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, వరంగల్, మెదక్‌లలో 2024-25లో ఆరంభించడానికి ప్రభుత్వం నిర్ణయించింది. 400 ఎంబీబీఎస్ సీట్లు ఈ కళాశాలల్లో ఉంటాయి. 2025-26 సంవత్సరంలో కొడంగల్, వికారాబాద్ జిల్లాల్లో వైద్య కళాశాలలను ఏర్పాటు చేయనుంది.

ప్రధాన వైద్య, ఆరోగ్య సంస్థలు

ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్), బీబీనగర్: జాతీయస్థాయి వైద్య, ఆరోగ్య సంస్థ ప్రజలకు సమగ్రమైన, ఉన్నత స్థాయి ప్రత్యేక ఆరోగ్య సేవలు(సూపర్ స్పెషాలిటీ హెల్త్‌కేర్) అందిస్తున్నది.

నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(నిమ్స్): 1962లో 246 పడకల బొక్కల దవాఖానాగా హైదరాబాద్‌లో ఆరంభమైన నిజాం వైద్యసంస్థ కాలక్రమంలో అత్యాధునిక వైద్య సేవలు అందించే కేంద్రంగా ఎదిగింది. తృతీయస్థాయి వైద్య సేవలను, వైద్యవిద్యను అందిస్తూ, వైద్య పరిశోధన కేంద్రంగా విరాజిల్లుతున్నది. 37 విభాగాలు, 1,639 పడకలతో ఉన్న ఈ సంస్థను సగటున ప్రతిరోజు 3,500 మంది రోగులు సందర్శిస్తారు.

తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్(టిమ్స్): 1,261 పడకలతో హైదరాబాద్‌లో వెలిసిన మరో ప్రతిష్ఠాత్మక వైద్య సంస్థ తెలంగాణ వైద్య, పరిశోధక సంస్థ. కరోనా కష్టకాలం 2020లో అప్పటి రాష్ట్రప్రభుత్వం దీనిని ఏర్పాటుచేసింది.

తెలంగాణ వైద్య విధాన పరిషత్: 2016లో స్థాపించిన ఈ సంస్థ రాష్ట్రవ్యాప్తంగా 175 ఆసుపత్రులను 11,960 పడకలను కలిగి ఉంది.



డా.ఎం.ఎ.మాలిక్
అసోసియేట్ ప్రొఫెసర్ ఆఫ్ ఎకనామిక్స్
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, చేవెళ్ల

లెటర్ రిపీటెడ్ సిరీస్

టీజీపీఎస్సీ / ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

వివిధ రకాలైన సిరీస్ పద్ధతులు:

1. abc/bca/cab/abc.
మొదటి సమూహంలో చివరి రెండు అక్షరాలు రెండో సమూహంలో మొదటి రెండు అక్షరాలుగా, మొదటి సమూహంలో మొదటి అక్షరం రెండో సమూహంలో చివరి అక్షరంగా ఉన్నది. రెండో సమూహంలో చివరి రెండు అక్షరాలు మూడో సమూహంలో మొదటి రెండు అక్షరాలుగా, రెండో సమూహంలో మొదటి అక్షరం మూడో సమూహంలో చివరి అక్షరంగా ఉన్నది. ఈ విధంగా ఒక క్రమపద్ధతిని ఈ సిరీస్ అనుసరించింది.
2. aaa/bbb/ccc/aaa
ప్రతి సమూహంలో ఒక అక్షరమే మూడుసార్లు ఉన్నది.
3. acac/abab/acac/abab
acac/abab అనే అక్షరాల సమూహాలు రెండుసార్లు రిపీట్ అయ్యాయి.
4. ab/aab/aaab/aaaab
రెండో సమూహాన్ని పరిశీలిస్తే రెండో సమూహం నుంచి ప్రతి సమూహంలోను దాని ముందు సమూహంలోని అక్షరాలతోపాటు ఒక 'a' అదనంగా చేరుతున్నది.
5. abca/abcb/abcc/abca
ప్రతి సమూహంలోను మొదటి మూడు అక్షరాలుగా abcలే రిపీట్ అయ్యాయి. మొదటి సమూహంలో చివరి అక్షరంగా a, రెండో సమూహంలో చివరి అక్షరంగా b, మూడో సమూహంలో చివరి అక్షరంగా c ఉన్నది. ఈ విధంగా కచ్చితమైన పద్ధతిని ఈ సిరీస్ అనుసరించింది.
6. abcd/bcda/cdab/dabc/adcb.
మొదటి సమూహంలో చివరి మూడు అక్షరాలు రెండో సమూహంలో మొదటి మూడు అక్షరాలుగా, మొదటి సమూహంలో ఒకటో అక్షరం రెండో సమూహంలో చివరి అక్షరంగా ఉన్నది. రెండో సమూహంలో చివరి మూడు అక్షరాలు మూడో సమూహంలో మొదటి మూడు అక్షరాలుగా, రెండో సమూహంలో మొదటి అక్షరం మూడో సమూహంలో చివరి అక్షరంగా ఉన్నది. ఈ విధంగా ఒక సక్రమమైన చెయిన్ పద్ధతిని ఈ సిరీస్ అనుసరించింది.
7. PQQ/QRR/RPP/PQQ
ప్రతి సమూహంలో చివరి రెండు అక్షరాలు ఒకటే.
8. aab/bbc/cca/aab
ప్రతి సమూహంలో మొదటి రెండు అక్షరాలు ఒకటే.
9. ab/abb/abbb/abbbb
రెండో సమూహాన్ని పరిశీలిస్తే రెండో సమూహం నుంచి ప్రతి సమూహంలోను దాని ముందు సమూహంలోని అక్షరాలతో పాటు ఒక 'b' అదనంగా చేరుతున్నది.
10. aabc/babc/cabc/aabc
ప్రతి సమూహంలోను చివరి మూడు అక్షరాలుగా bc లే రిపీట్ అయ్యాయి. మొదటి సమూహంలో మొదటి అక్షరంగా a, రెండో సమూహంలో మొదటి అక్షరంగా 'b', మూడో సమూహంలో మొదటి అక్షరంగా c ఉన్నది. ఈ విధంగా ఒక కచ్చితమైన పద్ధతిని ఈ సిరీస్ అనుసరించింది.

ప్రతి సమూహంలోను ఒకే విధమైన అక్షరాలు రిపీట్ అవుతున్నాయి. ఇలాంటి సందర్భాల్లో ప్రశ్నలకు సమాధానం రాబట్టడానికి కింద తెలిపిన విధానాన్ని అనుసరించవచ్చు.

ఉదా: P - R - Q - P Q - - Q R

ఎ) QPRPR బి) QPRRP
సి) QRPQP డి) ఏదీకాదు

పై ఉదాహరణలో అక్షరాలు, ఖాళీలు మొత్తం 12 ఉన్నాయి. 12 ఉంటే 3 లేదా 4 స్థానాలను ఒక సమూహంగా విభజించాలని తెలియచేయడం జరిగింది గమనించండి.

ముందుగా తక్కువ స్థానాలుగా అంటే 3 స్థానాలుగా విభజించాలి. సరిచూసిన తదుపరి కచ్చితమైన సమాధానం రావడానికి అవకాశం లేనపుడు ఎక్కువ స్థానాలుగా అంటే 4 స్థానాలుగా విభజించుకోవాలి.

మొదట మూడేసి అక్షరాలను ఒక్కొక్క సమూహంగా విభజిస్తే P - R / - Q - / PQ - / - QR.

విభజించిన తరవాత గమనించిన మొదటి, మూడో సమూహంలో మొదటి అక్షరం P ఉన్నది. అందువల్ల రెండు, నాలుగు సమూహంలో మొదటి అక్షరం 'P' అవుతుంది. ఇప్పుడు రెండు, నాలుగు సమూహాల్లో మొదటి అక్షరంగా 'P' ఉంచినపుడు పై అక్షర క్రమం (లెటర్) కింది విధంగా ఏర్పడుతుంది.

P - R / PQ - / PQ - / PQR

రీజనింగ్



ఇప్పుడు మళ్లీ గమనిస్తే రెండు, మూడు, నాలుగు సమూహాల్లో రెండో అక్షరంగా 'Q' ఉన్నది. కాబట్టి మొదటి సమూహంలో కూడా రెండో అక్షరం 'Q' అవుతుంది. ఇప్పుడు మొదటి సమూహంలో 'Q'ను ఉంచితే పై అక్షర క్రమం(లెటర్ సిరీస్) కింది విధంగా ఏర్పడుతుంది.

PQR /PQ - / PQ - / PQR

ఇప్పుడు మళ్లీ గమనిస్తే మొదటి, నాలుగు అక్షర సమూహంలో మూడో అక్షరంగా R ఉన్నది. అందువల్ల రెండు, మూడో సమూహంలో కూడా మూడో అక్షరం R అవుతుంది. ఇప్పుడు రెండు, మూడో సమూహంలో మూడో అక్షరంగా R ఉంచితే పై అక్షర క్రమం (లెటర్ సిరీస్) కింది విధంగా ఏర్పడుతుంది.

PQR / PQR / PQR /PQR

ఇప్పుడు అక్షర క్రమం పూర్తి అయింది. పైన ఖాళీలలో గల అక్షరాలు QPRRP ఇది సమాధానం అవుతుంది. ఆప్షన్స్‌లో QPRRP అనేది (బి)లో ఉన్నది. సమాధానం (బి) అవుతుంది.

మిగిలిన 6 నుంచి 18 వరకు ఉన్న పద్ధతుల్లో ఐచ్ఛికాల్లో ఇచ్చిన అక్షరాలను ఖాళీల్లో పెట్టుకొని జాగ్రత్తగా పరిశీలించి సమాధానాన్ని కనుగొనాలి. కాబట్టి ఇచ్చిన వివిధ రకాలైన సిరీస్ పద్ధతులను వీలైనన్ని ఎక్కువసార్లు గమనించి దాని కింద ఇచ్చిన వివరణల ఆధారంగా అవి ఏర్పడే విధానాలను అవగాహన చేసుకొని ఈ చాప్టర్‌లోని ప్రశ్నలకు సమర్థవంతంగా సమాధానాలు గుర్తించండి.



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్
సీనియర్ ఫ్యాకల్టీ

ఇండియా వర్సెస్ భారత్

ఒక దేశం రెండు పేర్లు

భారత్ అనే పేరును రాజ్యాంగంలో చేర్చాలని 1949 సెప్టెంబరు 18న నిర్వహించిన రాజ్యాంగ పరిషత్ సమావేశంలో కొందరు సభ్యులు కోరారు. 74 సంవత్సరాలు గడిచిన తరవాత కూడా ఆ చర్చ కొనసాగుతూనే ఉంది. 2023లో భారతదేశంలో కీలకమైన జీ-20 శిఖరాగ్ర సమావేశాల ప్రారంభ సన్నాహాల సందర్భంగా జరిగిన సంఘటనలు/చర్చలతో ఈ డిమాండ్ మళ్లీ తెరపైకి వచ్చింది.

అయితే ఈసారి చర్చను పరిష్కరించే అంబేడ్కర్ లేరు. 2023 సెప్టెంబరులో జీ-20 సమావేశాల సందర్భంగా భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జీ-20 అతిథులకు పంపిన అధికారిక విందు ఆహ్వానంలో 'ద ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా'కు బదులు 'ద ప్రెసిడెంట్ ఆఫ్ భారత్' అని ముద్రించారు. సమావేశాలు నిర్వహించిన ప్రదేశానికి 'భారత మండపం' అని పేరు పెట్టారు. సమావేశాల్లో ప్రధాని ముందున్న నేమ్‌ప్లేట్‌పై భారత్ అని పేర్కొన్నారు. దీంతో 2023 సెప్టెంబరు 18న ప్రారంభమైన పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో ఇండియా పేరును భారత్‌గా అధికారికంగా రాజ్యాంగ సవరణ ద్వారా మార్చగలరనే ఊహాగానాలకు దారితీసింది. దీంతో ఒక్కసారిగా ఇండియా/భారత్ అనే పదాలపై ఒకింత ఆసక్తికరమైన చర్చ ప్రజా బాహుళ్యంలోకి వచ్చింది.

గతంలో ఈ అంశంపై మూడుసార్లు సుప్రీంకోర్టులో కేసులు దాఖలైనప్పటికీ, రాజ్యాంగ పరిషత్‌లో తప్ప మళ్లీ ఇంత పెద్దఎత్తున ప్రజాబాహుళ్యంలో ఎప్పుడూ చర్చకు రాలేదు. అయితే అందరూ ఊహించినట్లుగా పార్లమెంటులో ఈ అంశంపై ఎలాంటి తీర్మానం ప్రవేశపెట్టకపోవడం గమనార్హం. ఈ సందర్భంగా ఈ అంశంపై రాజ్యాంగ పరిషత్‌లో జరిగిన చర్చల నుంచి నేటివరకు జరిగిన పరిణామాలను ఒకసారి పరిశీలిద్దాం.

రాజ్యాంగ రచన విధానం

రాజ్యాంగాన్ని రూపొందించడం చాలా క్లిష్టమైన పని. సంక్షిప్తంగా చెప్పాలంటే రాజ్యాంగ పరిషత్ సభ్యులు ముందుగా రాజ్యాంగంలో ఏయే నిబంధనలను రూపొందించాలనే విషయాలను పరిశీలించి నివేదించడానికి అనేక కమిటీలను ఏర్పాటు చేశారు. తదనంతరం ఈ కమిటీలు తమ నివేదికలను సమర్పించాయి. వీటి ఆధారంగా వివిధ నిబంధనలను రూపొందించారు. వీటిని ఉపయోగించి రాజ్యాంగ సలహాదారు సర్ బి.ఎన్.రావు రాజ్యాంగ ముసాయిదాను సిద్ధం చేశారు. ఆ తరవాత ముసాయిదాను డ్రాఫ్టింగ్ కమిటీకి పంపారు. అది దానిపై చర్చించి అవసరమైన మార్పులు, చేర్పులను చేసింది. సవరించిన ముసాయిదాను అసెంబ్లీ, ప్రొవిన్షియల్ లెజిస్లేచర్లు, ప్రొవిన్షియల్ ప్రభుత్వాలు, మంత్రిత్వ శాఖలు, ఫెడరల్ కోర్టు, హైకోర్టు సభ్యులకు పంపడంతో పాటు ప్రజల నుంచి విన్నపాలు స్వీకరించడానికి అందుబాటులో ఉంచారు. వారు తమ సూచనలను సమర్పించారు. ఆ తరవాత ముసాయిదా కమిటీ చైర్మన్ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ దీనిని రాజ్యాంగ పరిషత్ అధ్యక్షునికి సమర్పించారు. ముసాయిదా రాజ్యాంగంపై సుదీర్ఘంగా చర్చించి, దానికి మార్పులు, చేర్పులు చేశారు. ఈ సవరణల ఫలితంగా భారత రాజ్యాంగం రూపుదిద్దుకుంది.

> **రాజ్యాంగ పరిషత్ 1946 డిసెంబరు 9న మొట్టమొదటిసారిగా సమావేశమైనప్పటికీ 1949 సెప్టెంబరు 18 వరకు దేశానికి ఒక 'పేరు'ను ఖరారు చేయలేకపోయింది. దేశానికి పేరుపెట్టే అంశాన్ని కేంద్ర (యూనియన్) రాజ్యాంగ కమిటీకి ఇచ్చింది. ఈ కమిటీ 1947 జూలై 4న జారీ చేసిన నివేదిక ప్రకారం 'ఫెడరేషన్ ఆఫ్ ఇండియా' పేరును నిర్ణయించారు.**

రాజ్యాంగ పరిషత్ 1946 డిసెంబరు 9న మొట్టమొదటిసారిగా సమావేశమైనప్పటికీ 1949 సెప్టెంబరు 18 వరకు దేశానికి ఒక 'పేరు'ను ఖరారు చేయలేకపోయింది. దేశానికి పేరుపెట్టే అంశాన్ని కేంద్ర(యూనియన్) రాజ్యాంగ కమిటీకి ఇచ్చింది. ఈ కమిటీ 1947 జూలై 4న జారీ చేసిన నివేదిక ప్రకారం 'ఫెడరేషన్ ఆఫ్ ఇండియా' పేరును నిర్ణయించారు.

'భారత రాజ్యాంగంలో రాష్ట్రాల యూనియన్' అనే భావన కెనడియన్(బ్రిటిష్ నార్త్-అమెరికన్) చట్టం నుంచి స్వీకరించారు. బలమైన కేంద్రంతో కూడిన సమాఖ్యను ఏర్పర్చడానికి రాజ్యాంగంలో 'రాష్ట్రాల యూనియన్' అనే పదాలను పొందుపరిచారు.

భరత్‌వర్ష్ అని పేర్కొనాలి

ఆర్టికల్-1(1) కింద ఈ రాజ్యాంగం ప్రారంభమైన తేదీ నుంచి ఇండియా ఒక సమాఖ్యగా ఉంటుందని సలహాదారు సర్ బి.ఎన్.రావు పేర్కొన్నారు. అయితే బి.ఎన్.రావు ముసాయిదా పంపిణీ చేసినప్పుడు ఈ రాజ్యాంగం ప్రారంభం నుంచి భారతదేశం రాష్ట్రాల యూనియన్‌గా ఉంటుందన్న వివరణను చేర్చాలని కేంద్ర రాజ్యాంగ కమిటీ సిఫార్సు చేసింది. ఈ సిఫార్సును చివరికి ముసాయిదా కమిటీ రూపొందించిన రాజ్యాంగ ముసాయిదాలో చేర్చారు. ఈ ముసాయిదాను సభ్యులకు సర్క్యులేట్ చేసినప్పుడు ఉపేంద్రనాథ్ బర్మన్ ఇండియాకు బదులుగా 'భరత్‌వవర్ష్' అనే పదాన్ని డ్రాఫ్ట్ అంతటా ఉపయోగించాలని కోరారు. ఈ సూచనను ముసాయిదా కమిటీ తిరస్కరించింది. కారణం ఇండియా అనే పదం ప్రస్తుతం ఒకటిన్నర శతాబ్దాలకు పైగా వాడుకలో ఉండటమే కాకుండా అంతర్జాతీయంగా కూడా ప్రసిద్ధి చెందింది. కాబట్టి ముసాయిదా అంతటా దానిని భరత్‌వర్ష్‌గా మార్చడం మంచిది కాదని రాజ్యాంగ పరిషత్‌కు సమర్పించిన చివరి ముసాయిదాలో ఇండియా అనే పదాన్ని ఉపయోగించారు.



ఆర్టికల్-1 : ఇండియా అది భారత్: ఆర్టికల్-1పై రాజ్యాంగ పరిషత్‌లో సుదీర్ఘంగా చర్చ జరిగింది. శిబ్బన్ లాల్ సక్సేనా ఇండియాను భరత్‌వర్ష్ అని సంబోధించేలా అనేక సవరణలను ప్రవేశపెట్టారు. ఉదాహరణకు 1948 నవంబరు 15న 'యూనియన్ పేరు భారత్' అని ఒక సవరణను ప్రవేశపెట్టారు. అలాగే రాజ్యాంగ అధికారులను కాన్‌స్టిట్యూషనల్ ఆఫీసర్స్ ఆఫ్ ఇండియాగా కాకుండా, కాన్‌స్టిట్యూషనల్ ఆఫీసర్స్ ఆఫ్ భారత్‌గా సంబోధించాలని కోరారు. అదేవిధంగా చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియాను చీఫ్ జస్టిస్ ఆఫ్ భారత్‌గా సంబోధించాలని సవరణలను ప్రవేశపెట్టారు. అయితే ఆయన ప్రవేశపెట్టిన సవరణ తీర్మానాలన్నింటినీ రాజ్యాంగ పరిషత్ తిరస్కరించింది.

- 1949 సెప్టెంబరు 17న రాజ్యాంగ పరిషత్ సభా సమావేశం ముగియడానికి అరగంట మాత్రమే మిగిలి ఉంది. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఇండియా అనే పేరును తాను ఇష్టపడతానని స్థిరంగా పేర్కొన్నాడు. చరిత్ర అంతటా, గత సంవత్సరాల్లో భారతదేశాన్ని ఇండియాగా పిలిచేవారు. 'యుఎన్'లో సభ్యునిగా మన దేశం పేరు ఇండియా అని అనేక అంతర్జాతీయ ఒప్పందాలపై ఇండియా అనే పేరుతోనే సంతకం చేసిందని పేర్కొన్నాడు. అయితే ఆశ్చర్యకరంగా 1949 సెప్టెంబరు 17న ఆర్టికల్ '1'ని సవరిస్తూ 'ఇండియా అది భారత్' అని సవరణను ప్రవేశపెట్టారు. ఈ మార్పుపై డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఎలాంటి వివరణను ఇవ్వలేదు.



డాక్టర్ సుంకర రమాదేవి,
అసిస్టెంట్ ప్రొఫెసర్

గ్రూప్-1 మెయిన్స్ ప్రత్యేకం
ఇండియన్ పాలిటీ

రాజ్యాంగ పరిషత్‌లో చర్చ

ఆర్టికల్ '1'ని ఆమోదించాలని రాజ్యాంగ ముసాయిదా కమిటీ చైర్మన్‌గా డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోరుకున్నారు. అయితే ఓటింగ్‌కు ముందు సుదీర్ఘ చర్చ జరగాలని కొందరు ప్రతినిధులు పట్టుబట్టారు. దానితో రాజ్యాంగ పరిషత్ 1949 సెప్టెంబరు 18న సమావేశమైంది.

- బి.ఆర్.అంబేద్కర్ సూచించిన ఆర్టికల్-1లోని అంశాలకు కౌంటర్‌గా సెంట్రల్ ప్రావిన్స్ అండ్ బేరార్‌కు చెందిన హెచ్.వి.కామత్ మొదట ప్రసంగిస్తూ... ఇది నవజాత ఇండియన్ రిపబ్లిక్ నామకరణ వేడుక అని అన్నారు. రాజ్యాంగ నిర్మాణసభ ఏర్పాటు కావడానికి ముందే దేశం పేరు భారత్, ఇండియా, హిందుస్థాన్‌గా సుపరిచితమైనందున రాజ్యాంగంలో పురాతనమైన భారత్ పేరునే ఉంచాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ భూమికి ఉన్న అతి పురాతనమైన పేరు ఇదే కాబట్టి దానినే స్వీకరించాలని పట్టుబట్టారు.
- కామత్ తరవాత బిహార్ నుంచి బ్రజేశ్వర్ ప్రసాద్ మాట్లాడారు. రాష్ట్రాలకు, కేంద్రానికి ప్రత్యేక ప్రస్తావన ఉండకూడదన్నది ఆయన డిమాండ్. ఇండియా అంటే భారత్ ఒక సమగ్ర యూనిట్‌గా పేర్కొనాలని ఆయన ప్రతిపాదించారు.
- ఆ తరవాత యునైటెడ్ ప్రావిన్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న మౌలానా హస్రత్ మొహాని మాట్లాడుతూ.. 'ఇది పేరుకు సంబంధించింది మాత్రమే కాదు' ఇండియా(భారతదేశం) రాష్ట్రాల యూనియన్‌గా ఉంటుందని ఇక్కడ చెబుతోంది. రాష్ట్రాలు మాత్రమే ఎందుకు? యూనియన్ ఆఫ్ రిపబ్లిక్ ఎందుకు కాదు? భారతదేశంలోని రాష్ట్రాలు పూర్తిగా స్వయంప్రతిపత్తి కలిగి ఉండాలి' అని అభిలషించారు.
- మద్రాసు నియోజకవర్గం నుంచి భారత జాతీయ కాంగ్రెస్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న కల్లూరు సుబ్బారావు 'భారత్'కు మద్దతిచ్చారు. హిందీలో పేరును 'భారతి'గా మార్చాలని ప్రతిపాదించారు.
- బొంబాయికి చెందిన బి.ఎం.గుప్త మాట్లాడుతూ భారత్ అనే పదాన్ని సమర్థిస్తూ... యూనిట్స్ కోసం స్టేట్ అనే పదాన్ని ఉపయోగించడం పట్ల తాను ఆందోళన చెందుతున్నానని పేర్కొన్నారు. స్టేట్, 'యూనియన్ ఆఫ్ స్టేట్స్' అని స్వతంత్రంగా ఉన్నాయని భావించడానికి దారితీసే వాటిని సూచిస్తాయని ఆయన పేర్కొన్నారు.
- యునైటెడ్ ప్రావిన్స్‌లకు ప్రాతినిధ్యం వహిస్తున్న భారత జాతీయ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కమలాపతి త్రిపాఠి ఈ దశలో 'ఇండియా, దట్ ఈజ్ భారత్' కాకుండా 'భారత్, దట్ ఈజ్ ఇండియా' అని మార్చాలని సూచించారు. ఒక దేశం బానిసత్వంలో ఉన్నప్పుడు అది తన ఆత్మను కోల్పోతుంది. వేయి సంవత్సరాలు బానిసత్వంలో ఉన్న మన దేశం దాని పేరును తిరిగి పొంది స్వేచ్ఛాదేశంగా మారుతుంది. కోల్పోయిన పేరును తిరిగి పొందిన తరవాత అది తన అంతర్గత స్పృహను, బాహ్య స్వరూపాన్ని తిరిగి పొందుతుందని మేము ఆశిస్తున్నామని పేర్కొన్నారు.
- చివరిగా మాట్లాడిన వ్యక్తి హరగోవింద్ పంత్. దేశం పేరు 'భరత్‌వర్ష్' అని ఉండాలని సూచించారు.

సీక్రెట్ ఆపరేషన్.. సీక్రెట్ ఫండ్

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

'ఎంత కరుడుగట్టిన, తెలివైన నేరస్తుడైనా ఎక్కడో చిన్న తప్పు చేస్తాడు. మాకు దొరికి పోతాడు'.. ఇది పోలీసులు చెప్పే కొటేషన్. 'ఎంత రాటుదేలిన పోలీసైనా ఆరాటం ఎక్కువై ఎక్కడో ఏదో పొరపాటు చేస్తాడు. అడ్డంగా దొరికి పోతాడు'.. ఇది ఇప్పటి సీన్. ఒక సినీ నటిని అక్రమంగా నిర్బంధించారనే అభియోగాలతో ఒక డీజీ ర్యాంకు అధికారి, మరో ఐజీ ర్యాంకు అధికారి, డీఐజీ స్థాయి అధికారి సస్పెండయ్యారు. ఏదైనా తప్పు చేస్తున్నప్పుడు చేతికి మట్టి అంటకుండా చేయడంలో పోలీసుల్ని మించిన వారెవ్వరూ ఉండరు. అందులోనూ ఇలాంటి విషయాల్లో పీహెచ్‌డీ చేసిన ఇంటెలిజెన్స్ చీఫ్ పీఎస్ఆర్ ఆంజనేయులు లాంటి వ్యక్తి ఈ కేసులో ఎలా అడ్డంగా దొరికి పోయారో? దీనికి సమాధానం చాలా సింపుల్. మొత్తం ఎపిసోడ్‌లో ఎక్కడో తప్పు చేయకపోరు. ఆ తప్పే ఈ ముగ్గురినీ కాటేసింది. ముంబై నటి జెత్వానీపై వైసీపీ నేత విద్యాసాగర్ ఫిర్యాదు ఇవ్వడానికి కొన్ని గంటల ముందే ఆమెను పట్టుకు రావడానికి ఐపీఎస్ విశాల్ గున్నీ మరో ముగ్గురు పోలీసులు ముంబైకి విమానంలో టికెట్ బుక్ చేసుకున్నారు. ఫిర్యాదుకు ముందే ముంబైకి వెళ్లేందుకు ఎలా సిద్ధమయ్యారు? అనే ప్రశ్న దగ్గరే కీలక వ్యవహారమంతా ముడిపడింది. విశాల్ గున్నీ తన అధికార విధుల్లో భాగంగా ముంబైకి వెళితే ముందుగా డీజీపీ అనుమతి తీసుకోవాలి. తిరిగి వచ్చాక టీఏ, డీఏ క్లెయిమ్ చేయాలి. కానీ ఇంతవరకూ ఆయన బిల్లు పెట్టలేదు. ఆరా తీస్తే తెలిసిందేంటంటే.. ఆ టికెట్ అధికారికంగా బుక్ కాలేదు. దానికి కారణమే పీఎస్ఆర్ ఆంజనేయులును దోషిగా నిలబెట్టింది. సాధారణంగా జిల్లా ఎస్పీ, నగర సీపీ స్థాయి యూనిట్ అధికారుల వద్ద రహస్య ఫండ్ ఉంటుంది. ఇలాంటిదే ఇంటెలిజెన్స్ చీఫ్ వద్ద కూడా ఉంటుంది. నేరస్తులకు సంబంధించిన సమాచారాన్ని అందించిన వారికి ఈ ఫండ్ నుంచే డబ్బులు చెల్లిస్తారు. దీనికి ఎవ్వరూ లెక్క అడగరు. బిల్లులు అసలే ఉండవు. విశాల్ గున్నీ టికెట్ సీపీ కార్యాలయం నిధుల నుంచి బుక్ కాలేదు. అది పీఎస్ఆర్ ఆంజనేయులు చీఫ్‌గా ఉన్న ఇంటెలిజెన్స్ సీక్రెట్ ఫండ్ నుంచి ఖర్చు చేశారు. ఒక అధికారి తన అధికార విధుల్లో భాగంగా వెళుతున్నప్పుడు సీక్రెట్ ఫండ్ ఎందుకు వినియోగించారు? అనే కోణంలో ఆరా తీస్తే మొత్తం డొంక కదిలింది. 'అసలు నిన్ను ముంబై ఎవరు వెళ్లమన్నారు.. టికెట్‌కు డబ్బులు ఎవరిచ్చారు' అని ఉన్నతాధికారులు విచారిస్తే జరిగిన కథంతా గున్నీ విడమరిచి చెప్పారని తెలిసింది. దీంతోపాటు పీఎస్ఆర్ ఆంజనేయులు జనవరి 31నుంచి తనను ఎలా ఉపయోగించుకున్నదీ లిఖిత పూర్వకంగా స్టేట్‌మెంట్ ఇచ్చినట్లు సమాచారం.

ఏపీలో ఐపీఎస్‌లపై వేటు

(మొదటి పేజీ తరువాయి)



చేస్తూ జీవో 1590, 1591, 1592 విడుదల చేసింది. మాజీ సీఎం జగన్ స్నేహితుడు సజ్జన్ జిందాల్‌ను కాదంబరి పెట్టిన కేసు నుంచి కాపాడేందుకు ఆమెను అక్రమ కేసులో ఇరికించి నరకం చూపించారు. వైసీపీ పెద్దల ఆదేశాల మేరకు ఐపీఎస్‌లు పీఎస్ఆర్, కాంతిరాణా, విశాల్ గున్నీ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారు. ఆమెను, కుటుంబ సభ్యులను అరెస్ట్ చేసి టార్చర్ పెట్టారు. ఈ ముగ్గురు ఐపీఎస్‌లపై గతంలో కూడా తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. రాష్ట్రానికి డీజీపీ కావాలనే ధ్యేయంతో ప్రతిపక్ష పార్టీల నేతల్ని హింసించడం, ప్రశ్నించే గొంతుకల్ని నొక్కేయడం, తప్పుడు కేసులతో వేధించడం లాంటి అడ్డగోలు పనులు చేసినట్టు ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ పీఎస్ఆర్ ఆంజనేయులుపై విమర్శలు ఉన్నాయి. కుప్పంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీకి దొంగ ఓట్లు వేయించడం నుంచి బెజవాడలో అడ్డమైన పనులు చేయడం వరకు కాంతిరాణా తాతాపై ఆరోపణలు ఉన్నాయి. పోస్టింగ్ కోసం రాజధాని రైతుల్ని హింసించడం మొదలు దళితులపైనే అట్రాసిటీ కేసులు పెట్టిన ఘనత నాడు గుంటూరు ఎస్పీగా విశాల్ గున్నీ సొంతం. ఈ ముగ్గురూ ఏదో ఒక తప్పులో ప్రభుత్వానికి దొరుకుతారని, కచ్చితంగా వైసీపీ ప్రభుత్వంలో చేసిన పాపాలకు శిక్ష అనుభవిస్తారని పోలీసు వర్గాలు భావించాయి. అయితే ఒక మహిళను వేధించిన పాపం అర్నెల్లు తిరక్కుండానే వెంటాడింది.

వైసీపీ పెద్దల ఆదేశాలతో...

ఈ ఏడాది జనవరి చివరి వారంలో తాడేపల్లి ప్యాలెస్ నుంచి పీఎస్ఆర్ ఆంజనేయులుకు పిలుపొచ్చింది. ముంబైలో ఉన్న సినీ నటి కాదంబరి జెత్వానీని ఏదో ఒక కేసులో ఇరికించి ఏపీకి లాక్కొచ్చి ఒక సెటిల్మెంట్ చేయాలని వైసీపీ పెద్దలనుంచి ఆదేశాలొచ్చాయి. అంతే ఆమెకు వైసీపీ నేత కుక్కల విద్యాసాగర్‌తో ఉన్న పాత పరిచయాన్ని తెరపైకి తెచ్చారు. ఆయన భూమి కాజేసేందుకు కాదంబరి నకిలీ డాక్యుమెంట్లు సృష్టించారని కేసు పెట్టేందుకు ప్లాన్ వేశారు. జనవరి 31న నాటి విజయవాడ పోలీస్ కమిషనర్ కాంతిరాణా తాతా, డీసీపీ విశాల్ గున్నీని తాడేపల్లి ప్యాలెస్‌కు పిలిపించి కాదంబరి జెత్వానీని అరెస్టు చేయాలని చెప్పారు. పీఎస్ఆర్ ఆంజనేయులు ఆదేశాల మేరకు వెంటనే డీసీపీ విశాల్ గున్నీ, టాస్క్‌ఫోర్స్ ఏడీసీపీ రమణమూర్తి, ఇబ్రహీంపట్నం సీఐ, ఎస్ఐతో టీమ్ సిద్ధం చేశారు. ఫిబ్రవరి 1న నలుగురికీ విజయవాడ సీపీ కార్యాలయం నుంచి ముంబైకి విమాన టికెట్లు బుక్ అయ్యాయి. కానీ ఆ టికెట్లకు డబ్బులు సీపీ అధికారిక ఖాతా నుంచి ఎక్కడా డ్రా చేయలేదు. ముంబైకి వెళ్లే పోలీసు బృందం ఫిబ్రవరి 2న ఉదయం ఆరింటికి గన్నవరం విమానాశ్రయానికి చేరుకుని ఏడున్నరకు విమానం ఎక్కింది. అదేరోజు ఉదయం ఆరున్నర, ఏడు గంటల మధ్య ఇబ్రహీంపట్నం పోలీసు స్టేషన్‌లో జెత్వానీపై విద్యాసాగర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. అంటే... డీసీపీ బృందం విమానాశ్రయానికి బయలు దేరినప్పటికి ఎఫ్ఐఆర్ ఇంకా నమోదు కాలేదు. పీఎస్ఆర్ ఆంజనేయులు ఇంతటి స్కెచ్ వేస్తే అందుకు సీనియర్ ఐపీఎస్ అధికారులు కాంతిరాణా, విశాల్ గున్నీ సహకరించారు.

జగన్ మిత్రుడి కోసమే...

వైఎస్ఆర్ బతికి ఉన్నప్పుడు జగన్ రెడ్డికి వ్యాపార మెలకువలు నేర్పించమని తనను అడిగారంటూ కడప స్టీల్ ప్లాంట్ భూమిపూజ సందర్భంగా వ్యాఖ్యానించిన పారిశ్రామికవేత్త సజ్జన్ జిందాల్ కోసమే ఒక మహిళను జగన్ వేధింపులకు గురిచేశారు. జిందాల్‌పై జెత్వానీ ముంబైలో పెట్టిన కేసువెనక్కి తీసుకోవడానికి ఒప్పించే యత్నంలో ముగ్గురు ఐపీఎస్‌లు కుట్ర అమలు చేశారు. వైసీపీ నేత కుక్కల విద్యాసాగర్‌తో ఆమెకున్న పరిచయం ఆధారంగా నకిలీ డాక్యుమెంటు సృష్టించారు. కృష్ణా జిల్లాలో తనకున్న ఐదెకరాల పొలాన్ని నకిలీ అగ్రిమెంట్‌తో అమ్మేసేందుకు జెత్వానీ యత్నిస్తున్నారని, కొండపల్లి కిల్లాకు చెందిన నాగేశ్వరరావు, భరత్‌ల నుంచి ఐదు లక్షలు అడ్వాన్స్ తీసుకున్నారని ఫిబ్రవరి 2న ఉదయం 6.30కి విద్యాసాగర్ ఇబ్రహీంపట్నం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ సమయానికి ఆ స్టేషన్ సీఐ గన్నవరం విమానాశ్రయంలో ఉండటం విశేషం. ఒక ఐపీఎస్‌తో పాటు నలుగురు పోలీసులు ముంబైకి వెళ్లి జెత్వానీ కుటుంబ సభ్యుల్ని లాక్కొచ్చి జగన్ స్నేహితుడి కోసం ఈ అరాచకాలన్నీ చేశారు. తాజాగా పోలీసుల విచారణలో కాదంబరి ఎవ రో తెలియదంటూ నాగేశ్వర రావు, భరత్ వెల్లడించారు. విద్యాసాగర్ తెలుసు కానీ ముంబై నటి గురించి తెలియదని, ఆమెకు 5 లక్షలిచ్చి అగ్రిమెంట్ చేసుకోలేదని చెప్పారు. జెత్వానీ తాజాఫిర్యాదులో తాను 2020లో కొనుగోలు చేసిన ఇంటి చిరునామాను... 2018లో చేసుకున్న అగ్రిమెంట్‌లో పెట్టారని, దీన్ని ఇటీవల సృష్టించిందేనని అనుమానం వ్యక్తం చేశారు. ఆ అగ్రిమెంట్ ఒంగోలుకు చెందిన వ్యక్తి సృష్టించారని పోలీసులు అనుమానిస్తున్నారు.

పీఎస్ఆర్‌పై ఎన్నో ఆరోపణలు

ఐపీఎస్ అధికారులుగా ఐపీసీ చట్టాన్ని అమలు చేయాల్సిన అధికారులు జగన్ ప్రభుత్వంలో వైసీపీ చట్టాన్ని అమలు చేశారు. జగన్ రెడ్డిని ప్రశ్నించిన ఎవరినైనా సరే ఏదో ఒక కేసు పెట్టి జైలులో తోయడం ఎలా అనే దానిపై మొత్తం పథక రచన చేసి, నాటి సీఎంతో అంజన్నా అని పిలిపించుకునే వారు పీఎస్ఆర్ ఆంజనేయులు. శ్రీకాకుళంలో అచ్చెన్నాయుడు నుంచి అనంతపురంలో జేసీ ప్రభాకర్ రెడ్డి వరకూ.. హైదరాబాద్‌లో రఘురామ రాజు నుంచి నంద్యాలలో చంద్రబాబు వరకూ ఎవరిని అక్రమంగా జైలుకు పంపాలన్నా ఆయనదే స్కెచ్ అన్నది పోలీసు శాఖలో బహిరంగ రహస్యమే.

ఆ ఐపీఎస్‌లు గీత దాటారు

జెత్వానీ కేసులో కర్త, కర్మ, క్రియగా వ్యవహరించిన ఐపీఎస్‌లు పీఎస్ఆర్ ఆంజనేయులు, కాంతిరాణా తాతా, విశాల్ గున్నీ ఎక్కడెక్కడ పరిధి దాటి వ్యవహరించారో డీజీపీ ద్వారకా తిరుమల రావు ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. ఈ కేసులో బాధితురాలిని వేధించడంతో పాటు కుటుంబాన్ని బంధించారని పేర్కొన్నారు. సాక్షులను సైతం ప్రభావితం చేయగలిగిన సామర్థ్యం ఐపీఎస్‌లకు ఉందని వివరించారు. కేసు నమోదు చేసి ముంబై నటిని వేధించిన స్థానిక సీఐ, డీఎస్పీని ఇప్పటికే సస్పెండ్ చేశానని పేర్కొన్నారు. విజయవాడ పోలీస్ కమిషనర్ విచారణలో సాక్షులు, బాధితురాలు చెప్పిన అంశాలను పరిశీలిస్తే ఐపీఎస్‌లు, పోలీసులు తప్పు చేసినట్లు తేలిందని పదహారు పేజీల నివేదికలో పేర్కొన్నారు. హడావుడిగా ముంబైకి వెళ్లేందుకు నలుగురికి విమాన టికెట్లు బుక్ చేయాలంటూ తన సీసీని ఆదేశించిన కాంతి రాణా విమానంలో వెళ్లే పోలీసులకు పాస్‌పోర్టు ఇవ్వలేదన్నారు. మహిళను అరెస్టు చేయాలంటే కచ్చితంగా మహిళా పోలీసు ఉండాలన్న నిబంధన కూడా పాటించకుండా పోలీసు కమిషనర్ బాధ్యతా రాహిత్యంగా వ్యవహరించారని పేర్కొన్నారు. జెత్వానీపై ఎఫ్ఐఆర్ నమోదైన గంటలోనే విశాల్ గున్నీ ముంబైకి విమానం ఎక్కి వెళ్లారని, పై అధికారులకు సమాచారం ఇవ్వలేదన్నారు. ఒక పోలీసు అధికారి రాష్ట్రం దాటి వెళ్లేముందు తగిన పాస్‌పోర్టు పోలీసు శాఖ నుంచి తీసుకోవాల్సి ఉంటుందన్న కనీస నిబంధనలు కూడా పాటించలేదన్నారు. ఈ వ్యవహారంలో గున్నీ చర్యలు దుష్ప్రవర్తన కిందికి వస్తాయన్నారు.

నాకు తెలియదు.. గుర్తులేదు!

» ప్రతి ప్రశ్నకూ.. ఒకే సమాధానం
» పోలీసు కస్టడీలో నందిగం సురేశ్

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 15: 'ఏ ప్రశ్న అడిగినా ఒకటే సమాధానం... తెలియదు, గుర్తులేదు'... టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో బాపట్ల వైసీపీ మాజీ ఎంపీ నందిగం సురేశ్ పోలీస్ కస్టడీలో చెప్పిన మాటిది. పోలీసు విచారణకు ఆయన సహకరించలేదని తెలుస్తోంది. ఈ కేసులో ఆదివారం మంగళగిరి రూరల్ పోలీసులు ఆయన్ను కస్టడీలోకి తీసుకున్నారు. మధ్యాహ్నం రూరల్ సర్కిల్ కార్యాలయానికి తీసుకువచ్చారు. సురేశ్‌ను చూసేందుకు ఆయన భార్య, పిల్లలు, బంధువులు, అనుచరులు రాగా పోలీసులు అడ్డుకున్నారు. తొలిరోజు ఆదివారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం 6 గంటల వరకు విచారణ కొనసాగింది. మంగళగిరి రూరల్ సీఐ, కేసు దర్యాప్తు అధికారి వై.శ్రీనివాసరావు పలు ప్రశ్నలను సంధించారు. గతంలో నందిగం సురేశ్‌ను పోలీసులు విచారించినప్పుడు టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి జరిగిన రోజు తాను కూడా వెళ్లానని, అయితే అది సరైన విధానం కాదని భావించి వెనక్కి వచ్చేశానని ఆయన తెలిపారు. అదే కోణంలో ఇప్పుడు కూడా పోలీసులు విచారణ చేపట్టారు. అయితే పోలీసులు అడిగిన ఏ ప్రశ్నకూ సురేశ్ సరైన సమాధానం ఇవ్వలేదని తెలిసింది. సోమవారం కూడా విచారణ యథావిధిగా కొనసాగనుంది. రెండు రోజుల కస్టడీలో సురేశ్‌కు పోలీసులే భోజనం అందిస్తున్నారు. ఆదివారం రాత్రి ఆయన పోలీసు స్టేషన్‌లోనే నిద్రించారు.

మరణించిన అధికారికి ప్రధాని మోదీ పర్యటనలో విధులు!

» ఒడిశాలో విచిత్రం

భువనేశ్వర్, సెప్టెంబరు 19: ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం ఒడిశాలో చేపట్టనున్న పర్యటనను పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ఏర్పాట్లలో పొరపాటు దొర్లింది. ఏడాది క్రితం మరణించిన ఒడిశా అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ (ఓఏఎస్) అధికారికి జనాల సమీకరణ బాధ్యతలను అప్పగించింది. దీనిపై సామాజిక మాధ్యమాల్లో విమర్శలు రావడంతో ఉన్నతాధికారులు ఆ పేరును తొలగించారు. మహిళల బ్యాంకు ఖాతాలకు ప్రతి నెలా నగదు బదిలీ చేసే సుభద్ర యోజన కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు ప్రధాని మోదీ రానున్నారు. ఇందుకోసం భువనేశ్వర్‌లోని జనతా మైదాన్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా జనాలను సమీకరించి, నిర్వహించే బాధ్యతలను 50 మంది సీనియర్ ఓఏఎస్ అధికారులకు అప్పగిస్తూ శుక్రవారం సాధారణ పరిపాలన శాఖ ఉత్తర్వులు ఇచ్చింది. ఈ జాబితాలో ఒడిశా కంప్యూటర్ అప్లికేషన్ సెంటర్ (ఓసీఏసీ) అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ప్రభోద కుమార్ రౌత్ పేరు కూడా ఉంది. నిజానికి ఆయన గత ఏడాది జులైలో మరణించారు. దీనిపై విమర్శలు రావడంతో తగిన సవరణలు చేశారు. మరో అధికారికి బాధ్యతలు అప్పగించామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తెలిపారు.

కృష్ణా ప్రాజెక్టులకు స్వల్పంగా వరద

గద్వాల/నాగార్జునసాగర్, సెప్టెంబరు 15 : కృష్ణా బేసిన్‌లో వరద తగ్గుముఖం పట్టడంతో.. ప్రాజెక్టుల గేట్లు బంద్ అయ్యాయి. కర్ణాటకలోని ఆల్మట్టి ప్రాజెక్టుకు 32 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. విద్యుత్ ఉత్పత్తి ద్వారా 27,500 క్యూసెక్కుల నీటి విడుదల చేస్తున్నారు. నారాయణపూర్‌కు 30 వేల క్యూసెక్కుల వరద వస్తుండగా.. 20.500 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. గద్వాల జిల్లాలోని జూరాల ప్రాజెక్టుకు 40 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. జలాశయం గేట్లు మూసి విద్యుత్ ఉత్పత్తి ద్వారా 27,319 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. శ్రీశైలం రిజర్వాయర్‌కు 59 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. విద్యుత్ ఉత్పత్తి ద్వారా 68 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. నాగార్జునసాగర్‌కు 67,194 క్యూసెక్కుల ఇన్ ఫ్లో ఉంది. కుడి కాల్వకు 10వేల క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 4,679 క్యూసెక్కులు, ప్రధాన జల విద్యుత్ కేంద్రం నుంచి 28,048 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,800 క్యూసెక్కులు, నాలుగు గేట్లను ఐదు అడుగుల మేర ఎత్తి 32,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

కార్పొరేట్ల చేతుల్లోకి పెన్షన్ నిధులు

» రూ.10 లక్షల కోట్లు ధారాదత్తం: స్థిత ప్రజ్ఞ

హైదరాబాద్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన పెన్షన్ సంస్కరణలు.. ఉద్యోగుల కష్టార్జితాన్ని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు ఉద్దేశించినవని నేషనల్ మూవ్‌మెంట్ ఫర్ ఓల్డ్ పెన్షన్ స్కీం(ఎన్ఎంఓపీఎస్) సెక్రటరీ జనరల్ స్థిత ప్రజ్ఞ ఆరోపించారు. ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా 99,77,165 మంది ఉద్యోగుల నుండి వసూలు చేసిన రూ.10,53,850 కోట్ల పెన్షన్ నిధులు కార్పొరేట్ల చేతుల్లోకి వెళ్లనున్నాయని విమర్శించారు.ఎన్ఎంఓపీఎస్ జాతీయ కార్యవర్గ సమావేశం స్థితప్రజ్ఞ అధ్యక్షతన ఆదివారం న్యూఢిల్లీలోని సుర్జీత్ భవన్లో జరిగింది. ఈ సమావేశంలో ఎన్ఎంఓపీఎస్ అధ్యక్షుడు విజె బంధు, తెలంగాణ నుంచి రామాంజనేయులు, కల్వల్ శ్రీకాంత్, నరేష్ గౌడ్‌తో పాటు అన్ని రాష్ట్రాల నుంచి ఎన్ఎంఓపీఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు. ఈ యేడు ఎన్నికలు జరగనున్న మహారాష్ట్ర, హరియాణా, జమ్మూ కాశ్మీర్, ఝార్ఖండ్, ఢిల్లీలో ఓట్ ఫర్ ఓపీఎస్ కొనసాగించాలని తీర్మానించారు.

ఓపీఎస్‌ను పునరుద్ధరించాలి

ఉద్యోగ, ఉపాధ్యాయుల పెన్షన్ విధానంపై కేంద్ర ప్రభుత్వం మాటల గారడీని ఇకనైనా ఆపాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. పాఠశాల విద్యకు నిధులు పెంచాలని, పీఎఫ్ఆర్‌డీఏను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. నూతన విద్యావిధానంలో పేద బడుగు వర్గాలను విద్యకు దూరం చేసే నష్టదాయకమైన అంశాలున్నాయని విమర్శించారు. తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ సమాఖ్య(టీఎస్ యూటీఎఫ్) రాష్ట్ర కమిటీ సమావేశం ఆదివారం దోమలగూడలోని రాష్ట్ర కార్యాలయంలో జరిగింది. యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య మాట్లాడుతూ.. బదిలీ సమస్యలను, అప్పీళ్లను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 20న జరగనున్న రాష్ట్ర మంత్రి మండలి సమావేశంలో పాత పెన్షన్ విధానంపై నిర్ణయం తీసుకోవాలని తెలంగాణ సీపీఎస్ ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. సీపీఎస్ రద్దు చేస్తామని ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీని అమలు చేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడుకమలాకర్ ఆదివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

గురుకుల విద్యాలయాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది సమస్యల పరిష్కారానికి ఆందోళనలకు దిగనున్నారు. ఈ నెల 17, 18వ తేదీల్లో నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరవుతామని, 19న గురుకుల కార్యదర్శులకు వినతి పత్రాలు సమర్పిస్తామని, 28న పెన్‌డౌన్, చాక్‌డౌన్ చేపడతామని నేతలు తెలిపారు.

వైద్యానికి రూ.5 వేల కోట్లు!

(మొదటి పేజీ తరువాయి)



ఉంటే కేంద్ర ప్రభుత్వం తక్షణమే రాష్ట్ర ప్రతిపాదనలను అంగీకరించి.. ప్రపంచ బ్యాంకుకు పంపుతుందని వైద్యవర్గాలు వెల్లడించాయి. ఆ ప్రతిపాదనలకు అనుగుణంగా బ్యాంకు కూడా సాయం అందిస్తుందని తెలిపాయి. ప్రభుత్వ డయాగ్నిస్టిక్ కేంద్రాలు మొదులుకొని.. మానవ వనరుల అభివృద్ధి, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల్లో పరికరాలు వంటి అన్ని రకాల మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా రూ.4,944 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు వైద్య ఆరోగ్య శాఖ వర్గాలు వెల్లడించాయి.

ప్రతి 30 కిలోమీటర్లకు ఓ ట్రామాకేర్ కేంద్రం

వైద్య ఆరోగ్యశాఖ ప్రధానంగా 14 అంశాలపై దృష్టి సారించింది. ట్రామాకేర్ సెంటర్లు; డయాలసిస్ సెంటర్లు; వాస్క్యులర్ యాక్సెస్ సెంటర్లు; అత్యవసర సేవలకు గాను సిమ్యులేషన్, స్కిల్ ల్యాబ్‌లు; ఎమర్జెన్సీ కేర్; ఇంటిగ్రేటెడ్ క్వాలిటీ కంట్రోల్ ల్యాబ్‌లు; డయాగ్నస్టిక్ సేవల పెంపు; అవయవాల సేకరణ, నిల్వ కేంద్రాలు; ఆరోగ్య మహిళ కార్యక్రమంతో కలిపి ఎంసీహెచ్ సర్వీసులు మెరుగుపరచడం; కోక్లియర్ ఇంప్లాంట్ సెంటర్లు; డ్రగ్ డీ అడిక్షన్ సెంటర్లు; టిమ్స్; సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో పరికరాలు; ఉస్మానియా కొత్త ఆస్పత్రికి పరికరాలు, ఆరోగ్య కార్డులు; క్యాన్సర్ కేర్‌పై ప్రత్యేకంగా దృష్టి సారించనుంది. రాష్ట్రంలోని జాతీయ రహదారుల వెంట ప్రతి 30 కిలోమీటర్లకు ఒక ట్రామాకేర్ కేంద్రం ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా 109 ట్రామాకేర్ సెంటర్ల ఏర్పాటుకు రంగం సిద్ధం చేసింది. ఒక్కో కేంద్రంలో 73 మంది సిబ్బందిని నియమించబోతోంది. వీటిని మూడు దశల్లో ఏర్పాటు చేయనుంది. ఇందుకు సుమారు రూ.1000 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. అలాగే టీ డయాగ్నస్టిక్ సేవల బలోపేతానికి రూ.1,044 కోట్లు వెచ్చించనుంది. టీ డయాగ్నస్టిక్‌ల కింద మరో 60 మినీ హబ్‌లను ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంది. ప్రతి బోధనాస్పత్రిలో ఒక ఎంఆర్ఐ ఏర్పాటుకు మొత్తం రూ.444 కోట్లు ఖర్చు కానుంది.

8 నిమిషాల్లో చేరుకునేలా..

ప్రస్తుతం రోడ్డు ప్రమాదం జరిగితే బాధితుల వద్దకు అంబులెన్సులు చేరుకోవడానికి సుమారు 17-20 నిమిషాలు పడుతోంది. పైగా కాలం చెల్లిన అంబులెన్స్‌లు తరచూ మరమ్మతులకు గురికావడం జరుగుతోంది. అంబులెన్సులు ఆలస్యంగా వెళ్లడంతో ప్రమాద బాధితులు కొన్నిసార్లు ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ నేపథ్యంలో ఏదైనా ప్రమాదం, అత్యవసర ఘటనలు సంభవిస్తే బాధితుల వద్దకు కేవలం 8 నిమిషాల్లోపు అంబులెన్సులు చేరుకునే వ్యవస్థను వైద్యశాఖ అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తోంది. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా మరో 100 అంబులెన్సులను అందుబాటులోకి తీసుకురాబోతోంది. అలాగే హైవేలపై ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి, వాటికి సమీపంలో ఈ 108 అంబులెన్సులను ఎక్కువగా మోహరించనుంది. టిమ్స్, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో అత్యాధునిక పరికరాల కోసం రూ.750 కోట్లు వెచ్చించనుంది. గచ్చిబౌలి టిమ్స్‌లో నెఫ్రాలజీ, యూరాలజీలో రూ.150 కోట్లతో సెంటర్ ఫర్ ఎక్స్‌లెన్స్‌ను ఏర్పాటు చేస్తారు. రాష్ట్రంలోని 35 జీజీహెచ్ ఆస్పత్రుల్లో రూ.350 కోట్లతో 'డ్రగ్ డీ అడిక్షన్ సెంటర్ల'ను నెలకొల్పాలని ప్రతిపాదించారు.

డయాలసిస్, క్యాన్సర్ కేర్..

రాష్ట్రంలో డయాలసిస్, క్యాన్సర్ రోగుల సంఖ్య పెరుగుతోంది. ప్రస్తుతం ప్రతి నియోజకవర్గ కేంద్రంలో ఒక డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అయినప్పటికీ వాటిలోని యంత్రాలు సరిపోవడం లేదు. అదనంగా డయాలసిస్ యంత్రాలను ఏర్పాటు చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. అలాగే డయాలసిస్ రోగుల కోసం వాస్క్యులర్ కేంద్రాలు కూడా అవసరం. ఇందులో భాగంగా రాష్ట్రంలో నలు దిక్కులా నాలుగు చోట్ల ఈ కేంద్రాలను అందుబాటులోకి తీసుకొస్తున్నారు. కొత్తగా 108 డయాలసిస్ సెంటర్ల ఏర్పాటు కోసం రూ.54 కోట్లు వెచ్చించనున్నారు.

- 35 జీజీహెచ్‌ల్లో రూ.49 కోట్లతో వాస్క్యులర్ సెంటర్ల ఏర్పాటు.
- 35 బోధనాస్పత్రుల్లో ఎమర్జెన్సీ కేర్ శిక్షణ కోసం సిములేషన్ లేబరేటరీలను ఏర్పాటు చేస్తారు. అందుకోసం రూ.245 కోట్లు కేటాయిస్తారు.
- ఇంటిగ్రేటెడ్ క్వాలిటీ కంట్రోల్ ల్యాబ్స్ కోసం రూ.510 కోట్లు కేటాయిస్తారు.
- సెంట్రల్ మెడిసిన్ స్టోర్స్ ఆధునికీకరణ కోసం రూ.100 కోట్లు కేటాయించనున్నారు.
- హైదరాబాద్‌లోని సనత్‌నగర్, ఉస్మానియా, గాంధీ, నిమ్స్ ఆస్పత్రులు సహా నిజామాబాద్, ఖమ్మం, నల్లగొండ, మహబూబ్‌నగర్, ఆదిలాబాద్, వరంగల్‌లలో అవయవాల సేకరణ, నిల్వ కేంద్రాల కోసం రూ.30 కోట్లు కేటాయిస్తారు.
- ప్రస్తుతం 376 కేంద్రాల్లో ఆరోగ్య మహిళ కార్యక్రమాలు జరుగుతున్నాయి. వాటిని 1000కి పెంచుతారు. అందుకు రూ.300 కోట్లు వెచ్చిస్తారు.
- నిజామాబాద్, మహబూబ్‌నగర్‌లలో రూ.11 కోట్లతో కొత్తగా ఐవీఎఫ్ సెంటర్లను ఏర్పాటు చేస్తారు.
- కోక్లియర్ ఇంప్లాంట్ సెంటర్లను రూ.79 కోట్లతో ఏర్పాటు చేస్తారు.
- కొత్త ఉస్మానియా ఆస్పత్రిలో పరికరాల కొనుగోలుకు రూ.250 కోట్లు ఖర్చు చేస్తారు.
- రాష్ట్రవ్యాప్తంగా హెల్త్ కార్డులు, కార్యక్రమాల పర్యవేక్షణ యూనిట్ (పీఎంయూ)ల కోసం రూ.180 కోట్లు ఖర్చు చేస్తారు.
- రూ.165 కోట్లతో పలు చోట్ల క్యాన్సర్ కేర్ సెంటర్లను ఏర్పాటు చేస్తారు.

రాహుల్ నంబర్ వన్ ఉగ్రవాది

» రాహుల్ సిక్కు వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి కన్నెర్ర

» రాహుల్ భారతీయుడే కాదన్న రవ్‌నీత్ సింగ్ బిట్టు



న్యూఢిల్లీ, సెప్టెంబరు 15: లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఇటీవలి అమెరికా పర్యటనలో సిక్కులపై చేసిన వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి రవ్‌నీత్ సింగ్ బిట్టు మండిపడ్డారు. ఎప్పుడూ విదేశాల్లో గడిపే రాహుల్ అసలు భారతీయుడే కాదన్నారు. రాహుల్ వ్యాఖ్యలను ఉగ్రవాదులు అభినందిస్తున్నారంటే ఆయనకంటే పెద్ద ఉగ్రవాది లేరని బిట్టూ చెప్పారు. రాహుల్‌ను పట్టించిన వారికి రివార్డ్ ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. భారత్‌లో సిక్కులను తలపాగా ధరించేందుకు, గురుద్వారాకు వెళ్లేందుకు అనుమతించాలా, వద్దా, అనే అంశంపై పోరాటం జరుగుతోందని రాహుల్ ఇటీవలి అమెరికా పర్యటనలో వ్యాఖ్యానించారు. అన్ని మతస్థులదీ ఇదే పరిస్థితి అని రాహుల్ చెప్పారు. ఈ మాటలను తప్పుబట్టిన కేంద్ర మంత్రి రవ్‌నీత్ సింగ్ బిట్టు లోక్‌సభ ఎన్నికల ముందు కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరారు.

ప్రజాస్వామ్య సౌధంపై బుల్డోజర్లు: ఖర్గే

న్యూఢిల్లీ, సెప్టెంబరు 15: ప్రజాస్వామ్య సౌధాన్ని నాశనం చేసేందుకు, బుల్డోజర్ల తరహాలో వ్యవస్థలను కూల్చివేసేందుకు గత పదేళ్లుగా వ్యూహాత్మక ప్రయత్నాలు జరుగుతున్నాయని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ఆరోపించారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్య విలువలను, రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు మరింత అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం ఆయన ట్వీట్ చేశారు. రాజ్యాంగ నిర్మాతలు ఎంతో శ్రమపడి నిర్మించిన వ్యవస్థలను ధ్వంసం చేయకుండా దేశంలోని 140 కోట్ల మంది ప్రజలు ఈ ఏడాది తీర్పు ఇచ్చారని గుర్తుచేశారు. అందువల్ల 2024ను కీలక మలుపు తిరిగిన సంవత్సరంగా గుర్తుంచుకోవాలని అభిప్రాయపడ్డారు.

ఖైదీల విడుదలకు లాయర్ల తప్పుడు సమాచారం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 15: జైలు శిక్ష అనుభవిస్తున్న ఖైదీల ముందస్తు విడుదల కోసం పిటిషన్లలో న్యాయవాదులు తప్పుడు సమాచారం ఇస్తుండడంపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. కోర్టులోనూ తప్పుడు వివరాలే చెబుతున్నారని పేర్కొంది. ఇది తమ నమ్మకాన్ని సడలింపజేస్తోందని వ్యాఖ్యానించింది. గత మూడు వారాల్లో తప్పుడు వివరాలు ఉన్న ఆరేడు పిటిషన్లు తమ పరిశీలనకు వచ్చాయని చెప్పిన జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మాసిహ్ ధర్మాసనం పై వ్యాఖ్య చేసింది. ప్రతి రోజూ ప్రతి ధర్మాసనమూ 60-80 చిన్నచిన్న కేసులపై విచారణ జరపాల్సి ఉంటుందని తెలిపింది. అన్ని సార్లు పేజీలన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించే అవకాశం ఉండకపోవచ్చని తెలిపింది. కొన్నిసార్లు న్యాయవాదుల మీద ఉన్న నమ్మకం ఆధారంగా విచారణ జరుపుతామని చెప్పింది.

డాక్టర్లకు ప్రత్యేక ఐడీలు.. ఎన్ఎంసీ రిజిస్ట్రేషన్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 15: దేశంలో ప్రాక్టీస్ చేయడానికి అర్హులైన ఎంబీబీఎస్ డాక్టర్లందరి రిజిస్ట్రేషన్ ప్రక్రియను నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) తన పోర్టల్‌లో ప్రారంభించింది. వైద్యులకు ప్రత్యేక గుర్తింపు కార్డు కేటాయింపులో భాగంగా ఇటీవల ఎన్ఎంసీ ఈ పోర్టల్‌ను ఆవిష్కరించింది. రిజిస్ట్రేషన్ చేయించుకున్న వైద్యులందరూ నేషనల్ మెడికల్ రిజిస్టర్ (ఎన్ఎంఆర్)లో నమోదవుతారు. ఆధార్ కార్డుల ద్వారా వారి ప్రామాణికతను ధ్రువీకరిస్తారు. ఇండియన్ మెడికల్ రిజిస్టర్ (ఐఎంఆర్)లో రిజిస్టర్ అయిన ఎంబీబీఎస్ డాక్టర్లు అందరూ మరోసారి ఎన్ఎంఆర్, ఎన్ఎంసీలలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఇటీవల ఓ ప్రకటనలో తెలిపారు.

గోదావరి బేసిన్‌లో చమురు నిక్షేపాలు..!

లఖ్‌నవూ, సెప్టెంబరు 15: గోదావరి నదీ పరీవాహక ప్రాంతంలోని భూభాగంలో చమురు, సహజవాయువుల నిక్షేపాలు ఉండే అవకాశం ఉందని బీర్బల్ సాహ్నీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పాలియోసైన్సెస్ (బీఎస్ఐపీ) శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. ఇవి సాధారణంగా సముద్ర క్రమంలో కనిపిస్తాయని, కానీ.. భూభాగంలో వీటి లభ్యతను గుర్తించడం సవాలుతో కూడుకున్న అంశమని పరిశోధనల్లో పాల్గొన్న శాస్త్రవేత్త నేహా అగర్వాల్ తెలిపారు. 'పాలియో ఎన్విరాన్‌మెంట్ (గత పర్యావరణం)ను అర్థం చేసుకోవడానికి శాస్త్రవేత్తలు ఈ ప్రాంతంలో నిక్షిప్తమైన బొగ్గు, రాతి పొరలు సహా మరిన్ని అవక్షేపాలను అధ్యయనం చేశారు. పరిశోధనలో ఆర్గానిక్ కార్బన్ పరిమాణాన్ని కొలిచారు. ఈ క్రమంలో హైడ్రోకార్బన్ ఉత్పత్తికి అవకాశం ఉన్న ప్లాంక్టానిక్ జీవుల నిక్షేపణను గుర్తించారు. కాబట్టి ఈ హైడ్రోకార్బన్‌లో చమురు, సహజవాయువులు ఉంటాయి' అని అగర్వాల్ తెలిపారు.

ఈ నెలలోనే సాహస 'సాగర్ పరిక్రమ'

» ఇద్దరు మహిళా నేవీ అధికారుల ప్రపంచ యాత్ర


రూపా, దిల్నా

న్యూఢిల్లీ, సెప్టెంబరు 15: భారత నౌకా దళానికి చెందిన ఇద్దరు మహిళా అధికారులు అత్యంత కఠినమైన సాహస యాత్ర 'సాగర్ పరిక్రమ'కు సిద్ధమవుతున్నారు. లెఫ్టినెంట్ కమాండర్లు ఎ. రూపా, కె. దిల్నా త్వరలోనే సవాలుతో కూడిన సముద్ర యాత్రను ప్రారంభించనున్నారు. భారత నౌకాదళ సెయిలింగ్ నౌక (ఐఎన్ఎస్‌వీ) తారిణిలో ఈ ఇద్దరూ భూగోళాన్ని చుట్టే సాహస యాత్ర చేపట్టనున్నారని నేవీ అధికార ప్రతినిధి వివేక్ మధ్వాల్ ఆదివారం తెలిపారు.

'శంకర్ దాదా.. ఎంబీబీఎస్'లు!

బెంగాల్ ఆరోగ్య శాఖలో భారీ కుంభకోణం

» కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించాలి.. స్థానిక మీడియా కథనం

కోల్‌కతా, సెప్టెంబరు 15: పశ్చిమబెంగాల్‌లో వైద్య విద్యలో భారీ కుంభకోణం జరిగినట్లు స్థానిక మీడియా ఆరోపించింది. పలువురు వైద్యులతో కూడిన ఈ శక్తిమంతమైన లాబీ.. వైద్య విద్యార్థులు, పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇంటర్న్‌ల నుంచి భారీగా వసూళ్లకు పాల్పడుతున్నట్లు తెలిపింది. పరీక్షల్లో మార్కులు బాగా వేయడం, పాస్ చేయించడానికి ముడుపులు తీసుకుంటున్నట్లు, డబ్బులు ఇవ్వనివారిని ఫెయిల్ చేస్తున్నట్లు ఆరోపించింది. నార్త్ బెంగాల్‌కు చెందిన ఓ వైద్యుడి ఆధ్వర్యంలో ఈ పైరవీలు నడుస్తున్నందున.. దీన్ని 'నార్త్ బెంగాల్ లాబీ'గా పేర్కొన్నట్లు తెలిపింది. ఆ వైద్యుడు సీఎం మమతా బెనర్జీకి సన్నిహితుడనీ వెల్లడించింది. గత దశాబ్ద కాలంగా రాష్ట్ర ఆరోగ్య శాఖతో పాటు అన్ని ప్రభుత్వ వైద్య కళాశాలు, ఆస్పత్రుల్లో ఆయన హవా నడుస్తోందని పేర్కొంది. ఈ దందాలో ఆరోగ్య శాఖకు చెందిన ఉన్నతాధికారులు కూడా ఉన్నట్లు వివరించింది. టీఎంసీ ఎమ్మెల్యేగా ఉన్న వైద్యుడు కూడా ఈ లాబీలో ఉన్నారని, లాబీ సభ్యులు అధికార టీఎంసీకి చెందిన వైద్య విభాగం 'తృణమూల్ ఛాత్ర పరిషత్ (టీఎంసీపీ)'కి చెందిన వారని.. పలువురు జూనియర్ వైద్యులు తెలిపినట్లు కథనం పేర్కొంది. అలాగే వైద్య కళాశాలల్లో ప్రవేశాలకు కూడా భారీ మొత్తంలో లంచాలు తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయని తెలిపింది. అలాగే ప్రభుత్వ ఆస్పత్రులు, వైద్య కళాశాలల్లో పోస్టింగులు, బదిలీల విషయంలోనూ ఈ లాబీదే హవా అని తెలిపింది. మొత్తం మీద ప్రభుత్వ వైద్య కళాశాలల నుంచి పెద్ద సంఖ్యలో గ్రాడ్యుయేట్లు, పీజీలు పాసై వస్తున్న వారిలో అత్యధికులు అనర్హులేనని పేర్కొంది. వారికి వైద్యులయ్యే అర్హత లేదని, కనీస నైపుణ్యాలు కూడా ఉండవని.. లంచాలిచ్చి పరీక్షలు పాసవుతున్నారని తెలిపింది. వారంతా 'శంకర్‌దాదా.. ఎంబీబీఎస్'లేనని ఆ కథనం తెలిపింది. ఈ లాబీ దందాపై స్థానిక అధికారులతో విచారణ జరిపిస్తే ప్రయోజనం ఉండదని.. దీనిపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించాలని సూచించింది. మొత్తం వ్యవహారంపై విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వైద్య నిపుణులు కోరుకుంటున్నట్లు తెలిపింది.

సీబీఐ కస్టడీకి సందీప్ ఘోష్, అభిజిత్

కోల్‌కతా, సెప్టెంబరు 15: కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ ఆస్పత్రి మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్, తలా పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో అభిజిత్ మండల్‌లను స్థానిక కోర్టు సెప్టెంబరు 17 వరకు సీబీఐ కస్టడీకి పంపిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఆర్‌జీ కర్ ఆస్పత్రిలో వైద్యురాలి అత్యాచారం, హత్యకు సంబంధించి ఈ ఇద్దరిని సీబీఐ ఆ కోర్టులో హాజరుపరిచింది. ఈ కేసులో వారిద్దరిది కీలక పాత్ర అని, కోర్టు తమ కస్టడీకి ఇచ్చినందున ఇద్దరిని కలిపి ప్రశ్నిస్తామని ఓ సీబీఐ అధికారి తెలిపారు. హత్యాచార ఘటన వెనుక పెద్ద కుట్ర ఉండవచ్చని, ఘోష్, మండల్‌లకు అందులో కీలక పాత్ర ఉందని సీబీఐ కోర్టులో వాదించింది.

రాజీనామా చేస్తా

(మొదటి పేజీ తరువాయి)


ఆప్ కార్యకర్తల సమావేశంలో కేజ్రీవాల్



జైలులోనే ఉన్నారు. వారూ త్వరలో బయటకు వస్తారని భావిస్తున్నాను" అనే ఆశాభావం వ్యక్తం చేశారు. తన రాజీనామా తర్వాత కొత్త సీఎం ఎంపికకు పార్టీ నిర్ణయం తీసుకుంటుందన్నారు. బీజేపీపై ఆయన తీవ్రవ్యాఖ్యలు చేశారు. "ఆప్‌ను ముక్కలు చేసేందుకే బీజేపీ నన్ను జైలుకు పంపింది. ఆప్‌లో చీలికలు తెచ్చి ఢిల్లీలో గద్దెనెక్కాలని కుట్రలు పన్నింది. కానీ పార్టీని విచ్ఛిన్నం చేయలేకపోయింది" అన్నారు. బీజేపీ కుట్రలను ముందే గుర్తించి, రాజ్యాంగాన్ని రక్షించాలనే ఉద్దేశంతోనే తాను ఇంతకాలం రాజీనామా చేయలేదని పేర్కొన్నారు. "జైలు నుంచి ప్రభుత్వాన్ని ఎందుకు నడపకూడదని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. అలా సర్కారును నడపవచ్చని వెల్లడించింది. ఫిబ్రవరిలో జరగాల్సిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలను నవంబరులో నిర్వహించాలని ఎన్నికల సంఘాన్ని డిమాండ్ చేస్తున్నా. మహారాష్ట్రతోపాటు ఢిల్లీ ఎన్నికలు జరగాలని ఆకాంక్షిస్తున్నా. ఇంటింటికీ వెళ్లి ఓట్లడుగుతాను. నేను నిర్దోషినని నమ్మితేనే ఓట్లు వేయాలని ప్రజలను కోరుతాను. సుప్రీంకోర్టు నాకు బెయిలిచ్చింది. ప్రజాకోర్టులో ప్రజలే తీర్పునిస్తారు. నేను దోషినా? నిర్దోషినా? అనేదాన్ని ప్రజలే నిర్ణయిస్తారు. నేను, మనీశ్ సిసోడియా ప్రజాకోర్టునే ఆశ్రయిస్తాం. నా నిర్దోషిత్వంపై అంతిమన్యాయనిర్ణేతలు ప్రజలే. రాజీనామా నిర్ణయం నాకు నేను విధించుకుంటున్న అగ్నిపరీక్ష" అని ఉద్వేగంగా అన్నారు. బీజేపీయేతర పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో బీజేపీ కొత్త ఆటను ప్రారంభించిందని మండిపడ్డారు. కర్ణాటకలో సిద్దరామయ్య, కేరళలో పినరయి విజయన్, పశ్చిమబెంగాల్‌లో మమతాబెనర్జీపై కేసులు నమోదు చేశారన్నారు. "బీజేపీయేతర సీఎంలందరికీ నా విన్నపం ఏమిటంటే కేసులు నమోదుచేస్తే రాజీనామాలుచేయొద్దు" అని అన్నారు.

బ్రిటిషర్లు కూడా ఊహించి ఉండరు

దేశాన్ని రెండొందల ఏళ్లు పాలించిన బ్రిటిషర్లు కూడా భవిష్యత్తును ఊహించి ఉండరని కేజ్రీవాల్ వ్యంగ్యంగా అన్నారు. "బ్రిటిషర్లు భవిష్యత్‌లో తమ కంటే క్రూరమైన పాలకులు భారత్‌లో ఉంటారని అస్సలు అనుకుని ఉండరు. 75ఏళ్ల స్వతంత్ర భారతంలో అది సాధ్యమైంది" అని బీజేపీని ఉద్దేశించి అన్నారు. జైలులో ఎన్నో పుస్తకాలు చదివానని, భగవద్గీతను ఎన్నోసార్లు పఠించానని, భగత్‌సింగ్ పుస్తకం (భగత్‌సింగ్ కీ జైల్ డైరీ)ను చదివానని చెప్పారు. "భగత్‌సింగ్ జైలులో ఉండగా.. తన మిత్రులకు, దేశ యువతకు ఎన్నో లేఖలు రాశారు. బ్రిటిష్ పాలకులు వాటిని సంబంధిత వ్యక్తులకు అందేలా చేశారు. నేను జైలు నుంచి లెఫ్టినెంట్ గవర్నర్‌కు ఎన్నో లేఖలు రాశాను. నేను జైలులో ఉన్నందున ఢిల్లీ మంత్రి ఆతిషిని జెండావందనం చేసేందుకు అనుమతించాలని ఓ లేఖలో కోరా. స్పందన లేదు. కానీ నాకు హెచ్చరికలు వచ్చాయి. మరోమారు లేఖరాస్తే ములాఖత్‌లో కుటుంబ సభ్యులను కలిసే అవకాశం కూడా దక్కదని బెదిరించారు. నాతో ఒకసారి ములాఖత్ అయిన సందీప్ పాఠక్‌ను బ్లాక్‌లిస్టులో పెట్టారు. ఇంతటి నియంతృత్వం రాబోతుందని బ్రిటిషర్లు అప్పట్లో ఊహించి ఉండరు" అని కేజ్రీవాల్ అన్నారు.

అది గిమ్మిక్కే: కాంగ్రెస్

కేజ్రీవాల్ రాజీనామా నాటకం ఓ గిమ్మిక్కేనని కాంగ్రెస్ నేత సందీప్ దీక్షిత్ విమర్శించారు. "కేజ్రీవాల్ రాజీనామాకు మేము ఎప్పటినుంచో డిమాండ్ చేస్తున్నాం. ఇప్పుడు గిమ్మిక్కుల్లో భాగంగా రాజీనామా ప్రకటన చేశారు. కేజ్రీవాల్ బెయిల్‌పై విడుదలయ్యాక ఆయనను సీఎంవోకు వెళ్లొద్దని, ఫైళ్లపై సంతకాలు చేయొద్దని సుప్రీంకోర్టు ఆదేశించింది. అలాంటి బెయిల్ షరతులను గతంలో ఏ సీఎం కూడా ఎదుర్కోలేదు"అని ఆయన అన్నారు.

పబ్లిసిటీ కోసం నాటకం: బీజేపీ

కేజ్రీవాల్ ప్రకటన పబ్లిసిటీ కోసం ఆడుతున్న నాటకమని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారి అన్నారు. సుప్రీంకోర్టు షరతులకు కట్టుబడే ఆయన రాజీనామా చేయాల్సి వస్తోందన్నారు. "ఆప్ అంటేనే అవినీతి పార్టీ అని దేశమంతా తెలుసు. పబ్లిసిటీ స్టంట్‌తో తన ఇమేజ్‌ను తిరిగి పొందాలని కేజ్రీవాల్ ప్రయత్నాలు మొదలుపెట్టారు" అని అన్నారు.

ఆతిషికే అవకాశం?

కేజ్రీవాల్ రాజీనామా చేస్తే ఢిల్లీకి తదుపరి సీఎం ఎవరు? అంటే ఆప్ వర్గాలు ఆతిషి వైపే చూపిస్తున్నాయి. కేజ్రీవాల్, సిసోడియా వంటివారు జైలులో ఉన్నప్పుడు ఆతిషి పార్టీని చీలిపోకుండా కాపాడారనే అభిప్రాయాలున్నాయి. 2013 ఎన్నికల్లో మ్యానిఫెస్టోను రూపొందించి ఆప్ అధికారం చేపట్టడానికి ఆతిషి ప్రధాన కారణం. కేజ్రీవాల్ జైలులో ఉన్నప్పుడు పంద్రాగస్టు సందర్భంగా జెండా ఎగురవేసే అవకాశం ఆతిషికి ఇవ్వాలని ఎల్జీకి లేఖ రాయడం ఆమెకున్న ప్రాధాన్యాన్ని తెలియజేస్తోంది. అయితే, సీఎం రేసులో కేజ్రీవాల్ భార్య సునీత, ఆప్ సీనియర్ నేతలు గోపాల్ రాయ్, సౌరభ్ భరద్వాజ్, కైలాశ్ గెహ్లోత్ పేర్లూ వినిపిస్తున్నాయి.

హరియాణాపై కేజ్రీవాల్ దృష్టి

ఢిల్లీ సీఎం బాధ్యతల నుంచి తప్పుకొన్నాక కేజ్రీవాల్ పూర్తిగా హరియాణా ఎన్నికలపై దృష్టిసారిస్తారని తెలుస్తోంది. రైతు ఉద్యమాల నేపథ్యంలో హరియాణాలో బీజేపీకి గడ్డుకాలమున్నట్లు విశ్లేషణలు వస్తుండగా.. దాన్ని అనుకూలంగా మలచుకునేందుకు కాంగ్రెస్ ప్రయత్నాలు చేస్తోంది. హరియాణాపై తమ పార్టీ జెండా ఎగురవేయాలనుకుంటోంది. అయితే ఫలితాలను తారుమారుచేసి ఆప్‌కు పట్టం కట్టబెట్టే దిశలో కేజ్రీవాల్ పక్కా వ్యూహంతో ఉన్నట్లు సమాచారం. హరియాణాలో పొత్తు పై ఇండియా కూటమితో చర్చలు విఫలమవడంతో ఒంటరిపోరుకు కేజ్రీవాల్ నిర్ణయించారు. "ఆప్ 2013లో అనూహ్యంగా ఢిల్లీ పీఠం చేజిక్కించుకున్న తర్వాత వరుసగా అధికారం చేపట్టింది. పంజాబ్‌లో పాగా వేసి.. గోవాలో ఓట్ల శాతాన్ని పెంచుకుంది. జాతీయ పార్టీగా ఎదిగింది. హరియాణాలో పాగావేసినా.. చెప్పుకోదగ్గ సీట్లు సాధించినా..ఆప్ జాతీయ పార్టీ హోదాకు మరో నాలుగైదేళ్ల ఢోకా ఉండదు. అదే కేజ్రీవాల్ వ్యూహంగా కనిపిస్తోంది"అని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.



అయ్యప్ప భక్తులకు శుభవార్త..!

చెంగనూరు-పంపా రైల్వేలైన్‌కు

రైల్వే బోర్డు పచ్చజెండా

» కేంద్ర క్యాబినెట్ ఆమోదమే తరువాయి

తిరువనంతపురం, సెప్టెంబరు 15: అయ్యప్ప భక్తులకు శుభవార్త..! శబరిమలకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం చెంగనూరు నుంచి పంపాబేస్ వరకు హైస్పీడ్ రైల్వే లైన్‌ను నిర్మించేందుకు రైల్వే బోర్డు ఆమోదముద్ర వేసింది. ఈ ఆర్థిక సంవత్సరంలోనే పనులను ప్రారంభించనున్నట్లు ప్రకటించింది. ఇప్పటి వరకు తెలుగు రాష్ట్రాల భక్తులు కోటాయం, ఎర్నాకుళం లేదా చెంగనూరు వరకు రైళ్లలో వెళ్లి అక్కడి నుంచి ప్రైవేటు వాహనాలు/కేఎస్ఆర్టీసీ బస్సుల్లో పంపాబేస్‌కు చేరుకునేవారు. ఈ ప్రాంతాల నుంచి రోడ్డు మార్గంలో పంపాకు దూరం 100 కిలోమీటర్లలోపే ఉన్నా.. ఘాట్ సెక్షన్ల కారణంగా కనీసం 4గంటల సమయం పడుతుంది. చెంగనూరు నుంచి పంపాకు రైల్వేలైన్ పూర్తయితే తెలుగు రాష్ట్రాల నుంచి నేరుగా పంపాబేస్ వరకు రైళ్లలో వెళ్లవచ్చు. కేంద్ర క్యాబినెట్ ఆమోదముద్ర పడిన వెంటనే నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని అధికారులు తెలిపారు. ఈ రూట్‌లో వందే భారత్ మోడల్ రైళ్లను నడుపుతామన్నారు.

కేరళలో నిఫాతో ఒకరి మృతి

మలప్పురం, సెప్టెంబరు 15: కేరళలో నిఫా వైరస్ కారణంగా ఓ 24 ఏళ్ల వ్యక్తి మృతి చెందారు. మలప్పురానికి చెందిన వ్యక్తి బెంగళూరులో నివసిస్తూ.. ఈ నెల 9వ తేదీన ఇక్కడకు తిరిగొచ్చాడని, జ్వరం తదితర లక్షణాలతో మలప్పురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మరణించాడని కేరళ ఆరోగ్య మంత్రి వీణా జార్జి ఆదివారం వెల్లడించారు. అతని శాంపిళ్లను పరీక్షించగా నిఫా వైరస్ పాజిటివ్ వచ్చినట్టు తెలిపారు. అతడితో సన్నిహితంగా మెలిగిన 151 మందిని ఐసోలేట్ చేశామని, వారిలో ఐదుగురికి జ్వరం లక్షణాలున్నాయని చెప్పారు.

'బీమాపై జీఎస్టీ'ని సమీక్షించేందుకు

మంత్రివర్గ ఉపసంఘం

» భట్టి విక్రమార్క, ఏపీ మంత్రి పయ్యావుల కేశవ్‌కు చోటు



న్యూఢిల్లీ, సెప్టెంబరు 15: జీవిత, ఆరోగ్య బీమా ప్రీమియాలపై జీఎస్టీని సమీక్షించి, రేట్ల సవరణకు సూచనలు ఇచ్చేందుకు జీఎస్టీ కౌన్సిల్ ఆదివారం 13 మంది సభ్యులతో మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించింది. ఈ కమిటీకి బిహార్ ఉప ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. తెలంగాణ ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, ఆంధ్రప్రదేశ్ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ సహా పలు రాష్ట్రాలకు చెందిన 12 మంది ఆర్థిక మంత్రులు/ఆర్థికశాఖను పర్యవేక్షిస్తున్న సీఎం/డిప్యూటీ సీఎంలను సభ్యులుగా నియమించింది. అక్టోబరు 30లోగా తుది నివేదికనివ్వాలని ఈ కమిటీని ఆదేశించింది. ఈ నెల 9న జరిగిన 54వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో పశ్చిమబెంగాల్ లాంటి రాష్ట్రాలు జీవిత, ఆరోగ్య బీమా ప్రీమియాలపై జీఎస్టీని ఎత్తివేయాలని డిమాండ్ చేశాయి. మరికొన్ని రాష్ట్రాలు జీఎస్టీని 5శాతానికి తగ్గించాలని కోరాయి. ఈ నేపథ్యంలోనే మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటుచేశారు. ప్రస్తుతం ఈ కోవలోని బీమా ప్రీమియాలపై 18% జీఎస్టీ ఉంది. కమిటీ.. ఆరోగ్య బీమాపై వ్యక్తిగత, గ్రూప్, కుటుంబ కేటగిరీల వారీగా.. జీవిత బీమా విషయంలోనూ టర్మ్, లైఫ్ ఇన్సూరెన్స్ కేటగిరీల వారీగా.. అధ్యయనం చేయనుంది. ఆ తర్వాత ఎంతమేర జీఎస్టీ నిర్ణయించాలనే అంశంపై సూచనలతో నివేదిక సమర్పించనుంది.

ఝార్ఖండ్‌కు

చొరబాట్ల ముప్పు

జంషెడ్‌పూర్‌లో బీజేపీ ఎన్నికల సభలో మోదీ


ప్రధాని మోదీతో హేమంత్ సొరెన్

రాంచీ, జంషెడ్‌పూర్, సెప్టెంబరు 15: ఝార్ఖండ్ ముక్తి మోర్చా కూటమి సర్కారు ఓటు బ్యాంకు రాజకీయాలు, అధికార దాహం కోసం బంగ్లాదేశ్ నుంచి అక్రమ వలసలను.. ఆ దేశం నుంచి రోహింగ్యాల రూపంలో చొరబాట్లను ప్రోత్సహిస్తోందని ప్రధాని మోదీ ఆరోపించారు. ఈ చొరబాటుదారులు ఝార్ఖండ్‌కు పెను ముప్పు అని.. ఫలితంగా ఆ రాష్ట్రంలోని సంతాల్ పరగణాలు, కొల్హాన్ ప్రాంతాల్లో జనాభా సంతులనం దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతాల్లోని భూములను రోహింగ్యాలు, బంగ్లాదేశీయులు తమ గుప్పిట్లోకి తెచ్చుకున్నారని, తద్వారా గ్రామాలపై పట్టుసాధించారని ఆడబిడ్డలపై అఘాయిత్యాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. నవంబరులో ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆ రాష్ట్రంలోని జంషెడ్‌పూర్ గోపాల్ మైదానంలో ఆదివారం 'పరివర్తన్ మహార్యాలీ' పేరుతో జరిగిన బహిరంగసభలో మోదీ ప్రసంగించారు. బంగ్లాదేశ్ నుంచి అక్రమ వలసలపై స్వతంత్ర కమిటీతో దర్యాప్తు చేయించాలని హైకోర్టు ఉత్తర్వులిచ్చినా రోహింగ్యాల చొరబాట్లను ఝార్ఖండ్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఆదివాసీ ఓటు బ్యాంకుతో అధికారంలోకొచ్చిన జేఎంఎం.. అడవులను ఆక్రమించుకుంటున్న బడాబాబులకు దన్నుగా నిలుస్తోందన్నారు.

'జమిలి' ఈ టర్మ్‌లోనే!

ఒక దేశం-ఒకే ఎన్నికకు అన్ని పార్టీల మద్దతుపై మోదీ సర్కారు ఆశాభావం

» త్వరలోనే జనాభా లెక్కల సేకరణ

» కులగణనపై ఇంకా నిర్ణయించలేదు

» ప్రభుత్వ వర్గాల వెల్లడి


జమిలి ఎన్నికలపై తన నేతృత్వంలోని కమిటీ నివేదికను రాష్ట్రపతికి సమర్పిస్తున్న కోవింద్(ఫైల్)

న్యూఢిల్లీ, సెప్టెంబరు 15: లోక్‌సభలో బీజేపీకి సొంతగా సంపూర్ణ మెజారిటీ లేనప్పటికీ జమిలి ఎన్నికలు నిర్వహించాలని గట్టి పట్టుదలగా ఉంది. 'ఒక దేశం-ఒకే ఎన్నిక'కు పార్టీలకతీతంగా మద్దతు లభిస్తుందని మోదీ సర్కారు ఆశాభావంతో ఉంది. మోదీ సారథ్యంలోని ప్రభుత్వం మూడోసారి అధికార పగ్గాలు చేపట్టి వంద రోజులు పూర్తవుతోందని.. పాలక కూటమిలో సమన్వయం అద్భుతంగా ఉందని.. ఈ బంధం ఐదేళ్లూ పటిష్ఠంగా కొనసాగుతుందని గట్టిగా భావిస్తోందని పేరు చెప్పడానికి ఇష్టపడని ప్రభుత్వ వర్గాలు ఆదివారం తెలిపాయి. 'జమిలి ఎన్నికలు ఈ టర్మ్‌లోనే అమలవుతాయి. వాస్తవ రూపం దాల్చబోతోంది' అని వెల్లడించాయి. లోక్‌సభ ఎన్నికలకు బీజేపీ విడుదల చేసిన మేనిఫెస్టోలో జమిలి ఎన్నికల హామీ కూడా ఉంది. లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీలకు సమాంతరంగా ఒకేసారి ఎన్నికలు జరపాలని.. ఇవి పూర్తయిన వంద రోజుల వ్యవధిలోనే స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలంటూ.. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ సారథ్యంలోని అత్యున్నత స్థాయి కమిటీ ఇప్పటికే సిఫారసు చేసింది. జాతీయ లా కమిషన్ కూడా 2029 నుంచి లోక్‌సభ, అసెంబ్లీలు, పంచాయతీలు/మున్సిపాలిటీలకు ఒకే దఫా ఎన్నికలు జరపాలని.. ఒకవేళ త్రిశంకు సభ ఏర్పడితే లేదా అవిశ్వాస తీర్మానంలో ప్రభుత్వాలు ఓడిపోతే ఐక్య ప్రభుత్వాలు ఏర్పాటుచేయాలన్న నిబంధనతో విడిగా ఓ నివేదిక సమర్పించే అవకాశం ఉంది. తన సిఫారసుల అమలుకు ప్రత్యేక గ్రూపు ఏర్పాటు చేయాలని కోవింద్ కమిటీ ప్రతిపాదించింది. అలాగే జమిలి ఎన్నికలకు 18 రాజ్యాంగ సవరణలను సూచించింది. వీటిలో ఎక్కువ సవరణలకు రాష్ట్రాల అసెంబ్లీల ఆమోదం అక్కర్లేదని వివరించింది.

'కులం' కాలమ్ ఉంటుందా?

జనాభా లెక్కల సేకరణ ప్రక్రియ త్వరలోనే ప్రారంభం కానుంది. అయితే కులాలవారీగా జనగణన చేపట్టడంపై కేంద్రం ఇంకా నిర్ణయం తీసుకోలేదు. సదరు డాక్యుమెంటుపై 'కులం' కాలమ్ పెట్టాలా.. అక్కర్లేదా అన్న దానిపై నిర్ణయం తీసుకోవలసి ఉందని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు, కొన్ని ఎన్డీయే పార్టీలు కూడా కులగణన చేపట్టాలని గట్టిగా డిమాండ్ చేస్తున్నాయి. జనాభా లెక్కలు వెల్లడైన తర్వాత చట్టసభల నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ జరుగుతుంది. ఇది పూర్తికాగానే లోక్‌సభ, అసెంబ్లీల్లో మహిళలకు మూడో వంతు సీట్ల కేటాయింపు అమల్లోకి వస్తుంది. కాగా, ప్రభుత్వ ఎన్యుమరేటర్ల ద్వారా కాకుండా తమంత తాము జనగణన దరఖాస్తును నింపాలనుకునే పౌరులు ఎన్‌పీఆర్‌లో రిజిస్టర్ చేసుకోవచ్చు. ఇదిలా ఉండగా, రెండేళ్లలో దేశంలో నక్సలిజం పూర్తిగా కనుమరుగవుతుందని కేంద్ర వర్గాలు అంచనా వేస్తున్నాయి. మోదీ ప్రభుత్వం మూడోసారి అధికారం చేపట్టిన తర్వాత మొదటి 100 రోజుల కార్యాచరణ జాబితాలోనే నక్సల్స్ సమస్యపై దృష్టి పెట్టింది. ఈ నేపథ్యంలో భద్రతా బలగాల ఆపరేషన్లలో 150 మందికి పైగా మావోయిస్టులు హతమయ్యారు.

చేతబడి నెపంతో 9 మంది హత్య

» ఛత్తీస్‌గఢ్‌లో 4 రోజుల వ్యవధిలో రెండు దారుణాలు.. మృతుల్లో 11 నెలల పసికందు

రాయ్‌పూర్, సెప్టెంబరు 15: చేతబడి చేస్తున్నారనే అనుమానంతో రెండు కుటుంబాలకు చెందిన 9 మందిని ఇరుగుపొరుగు వారే అతి కిరాతకంగా చంపేశారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో 4 రోజుల వ్యవధిలో ఈ రెండు దారుణాలు చోటు చేసుకున్నాయి.. ఆదివారం సుక్మా జిల్లా ఇట్కల్ గ్రామంలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురిపై గొడళ్లు, కర్రలతో దాడి చేసి హతమార్చారు. మృతుల్లో ముగ్గురు మహిళలు, ఇద్దరు పురుషులున్నారు. మృతులను మౌసం కన్నా (60), బుచ్చా (34), అర్జో (32), బీరి, కర్క లచ్చి (43)గా పోలీసులు గుర్తించారు. మౌసం కన్నా కుటుంబం నిర్వహిస్తున్న క్షుద్రపూజల కారణంగా పలువురు చిన్నారులు అనారోగ్యం బారిన పడ్డారని ఆరోపిస్తూ గ్రామస్థులు ఈ దాడికి ఒడిగట్టినట్లు జిల్లా ఎస్పీ కిరణ్ జి చవాన్ తెలిపారు. అంతకుముందు.. గురువారం(ఈ నెల 12న) ఛార్‌ఖేడ్ గ్రామంలోనూ ఒకే కుటుంబానికి చెందిన నలుగురిని పొరుగింటి వారే చంపేశారు. మృతుల్లో 11 నెలల మగ శిశువు కూడా ఉన్నాడు. మృతులను చైత్రం కైవర్త్య(47), యశోద (30), జమున(28), యశ్ (11 నెలలు)గా గుర్తించారు. చైత్రం కైవర్త్య తల్లి చేస్తున్న క్షుద్రపూజల కారణంగా తమ కూతురి ఆరోగ్యం దెబ్బతిందని ఆరోపిస్తూ పొరుగింట్లో ఉండే రాంనాథ్ పాట్లే కుటుంబం ఈ దాడి చేసిందని పోలీసులు చెప్పారు.

మూడంతస్తుల భవనం కూలి.. ఒకే కుటుంబంలో 10 మంది మృతి



లఖ్‌నవూ, సెప్టెంబరు 15: భారీ వర్షాల కారణంగా యూపీలోని మేరఠ్‌లో శనివారం మూడంతస్తుల భవనం కూలి ఒకే కుటుంబానికి చెందిన 10 మంది మరణించారు. ఐదుగురు గాయపడ్డారు. మరణించిన వారిలో ఐదుగురు మైనర్లు ఉన్నారు. శిథిలాల కింద మరికొంత మంది చిక్కుకున్నట్లు అధికారులు భావిస్తున్నారు. కాగా, యూపీలో కురుస్తున్న భారీ వర్షాలకు 11 జిల్లాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. భీకర వానలకు ఇప్పటి వరకు 17 మంది మరణించినట్లు సమాచారం.

ప్రధాని మోదీపై.. పుతిన్ గుర్రు

(మొదటి పేజీ తరువాయి)




కీవ్‌లో జెలెన్‌స్కీతో మోదీ(ఫైల్)

చర్చల్లో ప్రధాని (మోదీ) మీకు ఇప్పటికే తెలియజేశారు. ఆ చర్చల గురించి మీకు ప్రత్యేకంగా, వ్యక్తిగతంగా తెలియజేసేందుకు నన్ను ఇక్కడకు పంపారు. జెలెన్‌స్కీతో చర్చలు అంతరంగికంగా జరిగాయి. వారిద్దరే మాట్లాడుకున్నారు. జెలెన్‌స్కీ వెంట ఇద్దరు ఉన్నారు. ప్రధాని మోదీతో నేను న్నాను. చర్చలకు నేను ప్రత్యక్ష సాక్షిని' అని దోభాల్ పుతిన్‌కు తెలిపారు. ఆయన ఒక్కో మాట పట్టి పట్టి మాట్లాడడం చూస్తే.. మోదీ ఉక్రెయిన్ అధ్యక్షుడితో ఏం మాట్లాడారో పుతిన్‌కు వివరణ ఇచ్చినట్లుగా ఉందని, వారిద్దరి సమావేశంపై రష్యా అధ్యక్షుడు అసంతృప్తిగా ఉన్నట్లు అర్థమవుతోందని నెటిజన్లు వ్యాఖ్యానిస్తున్నారు. రష్యాలోని కజన్‌లో ఈ నెల 22-24 నడుమ 'బ్రిక్స్' దేశాల సదస్సు జరగనుంది. ఆ సందర్భంగా 22న మోదీతో ద్వైపాక్షిక భేటీకి పుతిన్ దోభాల్‌కు ప్రతిపాదించారు. వాస్తవానికి పుతిన్‌తో వ్యక్తిగతంగా సన్నిహిత సంబంధాలున్న మోదీ.. ఉక్రెయిన్‌పై యుద్ధం విరమించేలా ఆయనపై ఒత్తిడి తేవాలని అమెరికా, ఐరోపా దేశాలు బహిరంగంగానే కోరుతున్నాయి. ఈ యుద్ధంలో తామెవరి వైపూ నిలబడలేదనడం సరికాదని.. శాంతి వైపు తాము ఉన్నామని మోదీ పదే పదే చెబుతున్నారు. జూలై 8, 9 తేదీల్లో రష్యాను సందర్శించి పుతిన్‌తో చర్చలు జరిపారు. యుద్ధం జరుగుతుండగా ఆయన మాస్కోకు వెళ్లి పుతిన్‌ను కలవడంపై జెలెన్‌స్కీతో పాటు అమెరికా, ఐరోపా దేశాలు ఆక్షేపించాయి. ఇది జరిగిన ఆరు వారాల తర్వాత ప్రధాని ఆకస్మికంగా ఉక్రెయిన్ రాజధాని కీవ్‌కు వెళ్లి జెలెన్‌స్కీతో ప్రత్యేక చర్చలు జరిపారు. యుద్ధానికి స్వస్తి పలికేందుకు ఇరుదేశాల అధినేతలు కూర్చుని చర్చించుకోవాలని సూచించారు. శాంతి పునరుద్ధరణకు క్రియాశీల పాత్ర పోషించేందుకు భారత్ సిద్ధంగా ఉందన్నారు. పరిష్కారం కోసం వ్యక్తిగతంగా కృషిచేసేందుకూ సిద్ధమని తెలిపారు. కాగా.. గత వారం పుతిన్ ఓ సమావేశంలో మాట్లాడుతూ.. ఉక్రెయిన్‌తో శాంతి చర్చలకు సిద్ధమని.. అయితే సంక్షోభ పరిష్కారంలో భారత్, బ్రెజిల్, చైనా మధ్యవర్తిత్వం నెరపాలన్నారు.



మూడు రంగుల జెండా పట్టి..

టీపీసీసీ అధ్యక్షుడిగా రేవంత్ చెరగని ముద్ర

హైదరాబాద్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మున్ముందు పోరు బీఆర్ఎస్-బీజేపీ మధ్యే అని.. కాంగ్రెస్ కనీసం పోటీ కూడా ఇస్తుందా? అని అనుకుంటున్న స్థితిలో పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన రేవంత్ రెడ్డి.. తనదైన శైలిలో పార్టీని ముందుకు నడిపించి అధికారంలోకి తెచ్చారు. రేవంత్ 38నెలల పాటు ఆ పదవిలో కొనసాగారు. పీసీసీ అధ్యక్షుడి బాధ్యతలు మహేశ్ కుమర్‌గౌడ్ కొత్తగా బాధ్యతలు స్వీకరించిన సంగతి తెలిసిందే. రేవంత్ పీసీసీ అధ్యక్షుడిగా 2021 జూలై 7న బాధ్యతలు స్వీకరించే నాటికి పార్టీ క్లిష్ట పరిస్థితుల్లో ఉంది. 2018లో 19 స్థానాల్లో గెలిస్తే 13 మందిని బీఆర్ఎస్ లాగేసింది. రేవంత్ పగ్గాలు స్వీకరించే నాటికి పార్టీలో మిగిలిన ఎమ్మెల్యేలు ఆరుగురే. కనీసం ప్రతిపక్ష హోదా కూడా లేని స్థాయి నుంచి పార్టీని రేవంత్ ముందుకు నడిపించి తిరుగులేని విజయాన్ని అందించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగలిగిందంటే పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్ చేసిన అవిశ్రాంత పోరే కారణమనడంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు. మూడు రంగుల జెండా పట్టి.. సింగమోలె కదిలినాడు.. ఒక్కరూ కాంగ్రెస్ సూరీడు.. అంటూ రేవంత్‌పై వచ్చిన పాట ఎన్నికల్లో ఎంత సంచలనం సృష్టిందో, పీసీసీ అధ్యక్షుడిగా ఆయన రాష్ట్ర రాజకీయాల్లో అంతకంటే ఎక్కువ సంచలనం సృష్టించారు. ఒక వైపు ఆపరేషన్ ఆకర్ష్‌తో బీఆర్ఎస్.. గులాబీ పార్టీకి ప్రత్యామ్నాయంగా బీజేపీ సవాల్ విసురుతున్న తరుణంలో ఆయన గాంధీభవన్‌లో బాధ్యతలు స్వీకరిస్తూనే కేసీఆర్‌ను ఓడించడమే తన ఏకైక లక్ష్యమని ప్రకటించారు. రేవంత్ బాధ్యతలు స్వీకరించిన వెంటనే హుజురాబాద్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ 3,014 (1.5 శాతం)ఓట్లు మాత్రమే సాధించి మూడో స్థానంలో నిలిచింది. దీంతో ఇక కాంగ్రెస్ ఖతం అనుకున్నారు అంతా. అంతలోనే మునుగోడు ఉప ఎన్నిక.. అదే సమయంలో రాహుల్ భారత్ జోడో యాత్ర తెలంగాణలోకి ప్రవేశించింది. ఈ పరిస్థితుల్లో అటు మునుగోడు ఉప ఎన్నిక, భారత్ జోడో యాత్రను రెండింటినీ సమన్వయం చేసుకొని రేవంత్ ముందుకెళ్లారు. దుబ్బాక, హుజురాబాద్ ఉప ఎన్నికల్లో విజయం సాధించిన బీజేపీనే.. బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయం అనే భావన ప్రజల్లో బలపడింది. ఈ పరిస్థితుల్లో.. పార్టీ శ్రేణులను ఐక్యం చేసి రాష్ట్ర కాంగ్రెస్‌లో రేవంత్ నూతన ఉత్సాహాన్ని నింపారు. దళిత గిరిజన దండోరా, నిరుద్యోగ గర్జన, రైతు సంఘర్షణ సభ వంటి ఎన్నో కార్యక్రమాలను చేపట్టారు. కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దించే లక్ష్యంతో 2023 ఫిబ్రవరి నుంచి 33 రోజులపాటు చేపట్టిన యాత్ర పార్టీ శ్రేణుల్లో జోష్ నింపింది. రైతులు, దళిత, గిరిజన, బీసీ, యువత, విద్యార్థులు, మైనారిటీ వర్గాల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ చేపట్టాలనుకుంటున్న కార్యక్రమాలను డిక్లరేషన్ల రూపంలో అగ్రనేతలు సోనియా, రాహుల్‌తో విడుదల చేయించారు. ఇవన్నీ ఆయావర్గాల్లో కాంగ్రెస్ పట్ల నమ్మకాన్ని పెంచాయి. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ 64 స్థానాలు సాధించడం వెనక రేవంత్ రెడ్డి పాత్ర అత్యంత కీలకంగా నిలిచింది. ఇక, లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఒక్క సీటూ రానివ్వమన్న సవాల్‌ను రేవంత్ నిలబెట్టుకున్నారు. అందరి అంచనాలను తలకిందులు చేస్తూ.. పదేళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్‌ను ప్రతిపక్ష నాయకుడి పాత్రకే పరిమితం చేశారు.



స్థానిక సంస్థల ఎన్నికలు

కాంగ్రెస్ జెండాను ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి, పీసీసీ చీఫ్ మహేశ్ తదితరులు

బీసీల లెక్క తేలాకే!

(మొదటిపేజీ తరువాయి)

సర్పంచ్‌లుగా, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, జడ్పీ చైర్మన్లు, ఎంపీపీలు, మునిసిపల్ చైర్మన్లుగా గెలిపించుకునే బాధ్యత తన పైనా, మహేశ్‌కుమార్‌గౌడ్ పైనా ఉందన్నారు. ఈ విషయంలో తామిద్దరమూ సమన్వయం చేసుకుని ముందుకుపోతామని తెలిపారు. ఇప్పటిదాకా జరిగిన ఎన్నికలు నాయకులకు సంబంధించినవని, ఇకపై జరిగే ఎన్నికలు.. కాంగ్రెస్ జెండాలు మోసిన కార్యకర్తలకు సంబంధించినవని పేర్కొన్నారు. కార్యకర్తలను గెలిపించాల్సిన బాధ్యత తామందరిపైనా ఉందని, వారి గెలుపు కోసం తమ ఎన్నికల కంటే ఎక్కువగా కష్టపడతామని చెప్పారు.



పీసీసీ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించిన మహేశ్‌కు శుభాకాంక్షలు చెబుతున్న రేవంత్

ఒక్కొక్కటిగా గ్యారెంటీల అమలు

తాను 2021లో టీపీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టాక అందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లానని, ఇంద్రవెల్లి వేదికగా సమరశంఖం పూరించి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చామని రేవంత్‌రెడ్డి తెలిపారు. తానొకవైపు, భట్టి విక్రమార్క మరోవైపున పల్లె పల్లెనా పాదయాత్ర చేశామని గుర్తు చేశారు. రాహుల్‌గాంధీ ఇచ్చిన మాటప్రకారం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో రూ.2 లక్షల రైతు రుణమాఫీ చేశామన్నారు. రాష్ట్రంలోని 23 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.18 వేల కోట్లు వేసి వ్యవసాయం పండుగ అని నిరూపించామన్నారు. తుక్కుగూడ సభలో సోనియాగాంధీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని చెప్పారు. పంద్రాగస్టు లోగా రూ.2 లక్షల మేరకు రైతు రుణమాఫీ చేస్తానని యాదగిరిగుట్ట నరసింహస్వామి సాక్షిగా ప్రకటించి.. ఇచ్చిన మాటప్రకారం భద్రాద్రి రాములవారి సాక్షిగా పంద్రాగస్టున అమలు చేశామని సీఎం రేవంత్ అన్నారు. "పంద్రాగస్టు కల్లా రూ.2 లక్షల రుణమాఫీ అమలైతే రాజీనామా చేస్తానని బీఆర్ఎస్ నేత హరీశ్ రావు సవాల్ చేశాడు. ఆ సన్నాసి ఇప్పుడు ఎక్కడ దాక్కున్నాడు?" అని ప్రశ్నించారు. రూ.2 లక్షల పైన రుణం ఉన్న రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రూ.2 లక్షల పైన ఉన్న రుణాన్ని బ్యాంకులో చెల్లించాలని, మరుక్షణమే ఆ రూ.2 లక్షలు ఆయా రైతుల ఖాతాలో వేసే బాధ్యతను తమ ప్రభుత్వం తీసుకుంటుందని స్పష్టం చేశారు. రాబోయే పంట నుంచి సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తామని సీఎం ప్రకటించారు. నిరుద్యోగులకు ఇచ్చిన మాట ప్రకారం.. అధికారంలోకి వచ్చిన 90 రోజుల్లోనే 30 వేల ఉద్యోగాలకు సంబంధించిన నియామక పత్రాలు ఇచ్చామన్నారు. మరో 35 వేల ఉద్యోగాలకు సంబంధించి నోటిఫికేషన్లు విడుదల చేశామని, ఈ ఏడాది చివరికల్లా ఆ ఉద్యోగాలు ఇచ్చే బాధ్యత తమదని అన్నారు. నిరుద్యోగులకు నైపుణ్యం అందించేందుకు యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేసి దేశానికి ఆదర్శంగా నిలిచామని తెలిపారు. దేశంలో 140 కోట్ల మంది జనాభా, అందులో 50 శాతం యువత ఉన్నా.. ఒలింపిక్స్‌లో ఒక్క పతకం కూడా రాకపోవడం అవమానం కాదా? అని ప్రధాని మోదీని సీఎం ప్రశ్నించారు. వచ్చే ఒలింపిక్స్ లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం దీక్ష పూనిందని, త్వరలో రాష్ట్రంలో స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. 2028 ఒలింపిక్స్‌లో దేశం తరఫున బంగారు పతకాలు సాధించే బాధ్యతను తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. ఇక రీజినల్ రింగ్ రోడ్డును తీసుకువచ్చి హైదరాబాద్‌ను విశ్వనగరంగా మార్చే ప్రయత్నం చేస్తున్నామని, ముచ్చర్లలో ఫోర్త్ సిటీని అభివృద్ధి చేస్తామని అన్నారు. ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాలను జోడెద్దుల్లా ముందుకు తీసుకెళ్లేందుకుగాను పూర్తి సమయాన్ని పార్టీకి కేటాయించే అధ్యక్షుడు ఉండాలని అధిష్ఠానాన్ని తాను కోరానని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. అధిష్ఠానం అన్నివిధాలా ఆలోచించి బలహీన వర్గాలకు సముచిత ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించిందన్నారు. పార్టీని అధికారంలోకి తీసుకురావడంలో తనదైన పాత్ర పోషించిన మహేశ్‌కుమార్‌గౌడ్‌ను అధ్యక్షుడిగా నియమించిందన్నారు. మొన్నటి ఎన్నికల్లో గెలుపు సెమీ ఫైనల్స్ మాత్రమేనని, ఫైనల్స్ 2029లో ఉంటాయని సీఎం చెప్పారు. ప్రధాని మోదీని ఓడించి రాహుల్‌గాంధీని ప్రధానిని చేసినపుడే ఫైనల్స్‌లో కాంగ్రెస్ గెలిచినట్లని వ్యాఖ్యానించారు. వచ్చే పదేళ్లూ రాష్ట్రంలో కాంగ్రెస్సే అధికారంలో ఉంటుందని, 2029 పార్లమెంటు ఎన్నికల్లో రాష్ట్రంలో 15 సీట్లు గెలిస్తేనే ఫైనల్స్‌లో గెలిచినట్లవుతుందని పేర్కొన్నారు. అప్పటివరకూ ఎవరమూ విశ్రమించవద్దన్నారు.

కార్యకర్తల జోలికొస్తే చింతపండే

"నిన్న.. మొన్న మన కార్యకర్తలపై దాడులు చేసే ప్రయత్నాలు జరిగినయి. మనింటికి వస్తమని చెప్పిన్రు. కానీ, మనోళ్లే వాళ్ల ఇంటికి పోయిన్రు. చింతపండు అయినాక.. మా ఇంటికి వచ్చి తన్నారని అంటున్రు. రా.. చూసుకుందామని ఎందుకు పిలిచినట్లు?" అని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. తమ కార్యకర్తలు ఎవరి జోలికీ పోరని, ఎవరైనా తమ మంచితనాన్ని చేతకానితనంగా తీసుకుంటే మాత్రం చింతపండు అవుతుందని హెచ్చరించారు. మహేశ్‌కుమార్‌సౌమ్యుడై ఉండవచ్చని, కానీ.. ఆయన వెనకాల తానున్నానన్న విషయాన్ని మరిచిపోవద్దన్నారు. "మా ఆటలు సాగుతయి.. ఊర్లలో మా ఇష్టం వచ్చినట్లు చేయవచ్చని ఎవరైనా అనుకుంటే.. ఒక్కొక్కడికి ఉంటది"అని హెచ్చరిక జారీ చేశారు.

కాంగ్రెస్‌లో రాహుల్ ఒక్కరే పవర్ సెంటర్: మహేశ్‌కుమార్‌గౌడ్

కాంగ్రెస్‌లో ఒక్కటే పవర్ సెంటర్ అని, అది రాహులేనని టీపీసీసీ నూతన అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. గాంధీభవన్‌లోనూ పవర్ సెంటర్ లేదన్నారు. తనకు భేషజాలు లేవని, టీపీసీసీ అధ్యక్షుడినైనా.. కార్యకర్తగానే ఉంటానని స్పష్టం చేశారు. ప్రభుత్వానికి, కార్యకర్తలకు వారధిగా వ్యవహరిస్తానని, ఏ విషయమైనా తనకు చెప్పుకోవచ్చని అన్నారు. కాంగ్రెస్‌లో ప్రజాస్వామిక స్వేచ్ఛ ఎక్కువ అని, రేవంత్‌రెడ్డి టీపీసీసీ అధ్యక్షుడైన కొత్తలో సీనియర్ నాయకులందరినీ తాను సమన్వయం చేయాల్సి వచ్చిందని గుర్తు చేశారు. అయితే ఆ తర్వాత విభేదాలు పక్కన పెట్టి అందరూ కలిసి తిరగడంతో ప్రజలు అధికారాన్ని కట్టబెట్టారని తెలిపారు. ప్రభుత్వం వచ్చాక సీనియర్ నాయకులంతా ఒక్కటయ్యారని, తనకు సమన్వయం చేయాల్సిన అవసరం లేకుండా పోయిందని చమత్కరించారు. తన స్థాయికి.. పీసీసీ అధ్యక్షుడిని అవుతాననుకోలేదని మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. రాజకీయాల్లో ఎంత కష్టపడ్డా ఒక శాతం అదృష్టం కూడా ఉండాలని, ఆ అదృష్టంతోనే తనకు పదవి దక్కిందన్నారు. కాంగ్రెస్ పథకాలను కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు.

హైడ్రాను ఆపొద్దు..!

హైడ్రా హైడ్రా అనేది చరిత్రాత్మక నిర్ణయమని మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. ఎట్టిపరిస్థితుల్లోనూ దీనిని ఆపొద్దని, హైదరాబాద్‌కే పరిమితం చేయకుండా జిల్లాలకూ విస్తరించాలని సీఎం రేవంత్‌రెడ్డికి సూచించారు. హైదరాబాద్.. చెరువులు, గుట్టల నగరమని, గత పదేళ్లలో యథేచ్ఛగా చెరువులను కబళించారని ఆరోపించారు. చెరువులను యథాతథ స్థితికి తీసుకువచ్చే వరకు హైడ్రా కార్యకలాపాలు కొనసాగాలన్నారు. ఇది మన పిల్లలు, మనవల వరకు ఉపయోగపడే కార్యక్రమమన్నారు. అయితే తెలియక చెరువుల్లో ఇళ్లు కట్టుకున్న పేదలకు పునరావాసం కల్పించాలన్నారు. ప్రతి జిల్లా కేంద్రంలోనూ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నిర్మించేందుకు స్థలం కావాలని సీఎం రేవంత్‌ను కోరారు. వారంలో ఇద్దరు మంత్రులు గాంధీభవన్‌కు రావాలని, బుధవారం ఒకరు, శుక్రవారం ఒకరు కార్యకర్తలకు అందుబాటులో ఉండి ఆయా శాఖలకు సంబంధించిన విజ్ఞప్తులు స్వీకరించాలని సూచించారు. సీఎం రేవంత్‌రెడ్డి కూడా నెలలో రెండుసార్లు గాంధీభవన్‌కు రావాలని విజ్ఞప్తి చేశారు. డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క మాట్లాడుతూ.. నిబద్ధతతో పనిచేసే ప్రతి కార్యకర్తకూ పార్టీలో సముచిత స్థానం ఉంటుందనడానికి మహేశ్‌కుమార్‌గౌడ్ నియామకమే నిదర్శనమన్నారు. సెప్టెంబరు 17పై బీజేపీ ఏవేవో ప్రకటనలు చేస్తోందని, కానీ.. హైదరాబాద్ విలీనం, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో ఆ పార్టీ పాత్ర ఏముందని ప్రశ్నించారు. ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. పార్టీ కార్యకర్తలపై కేసులను ఎత్తివేయాలని వీహెచ్ కోరారు. చాలా కాలం తర్వాత బీసీ నాయకత్వం రావడం సంతోషమన్నారు.

అట్టహాసంగా కాంగ్రెస్ ర్యాలీ

» గన్‌పార్కు వద్ద మహేశ్‌కుమార్ నివాళి

హైదరాబాద్ సిటీ/అఫ్జల్‌గంజ్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ అధ్యక్షుడిగా మహేశ్‌కుమార్‌గౌడ్ పదవీ బాధ్యతల స్వీకరణ సందర్భంగా గన్‌పార్కు నుంచి గాంధీభవన్ వరకు కాంగ్రెస్ ర్యాలీ అట్టహాసంగా నిర్వహించారు. దారి పొడవునా భారీ జెండాలతో నిర్వహించిన ర్యాలీ డప్పుల మోతలు, డీజే సౌండ్‌లతో కోలాహలంగా సాగింది. ఉదయం నుంచే గన్‌పార్కు ప్రాంతంలో సందడి నెలకొంది. గాంధీభవన్ వైపు వచ్చే మార్గాలన్నీ ఫ్లెక్సీలతో నిండిపోగా.. ర్యాలీ ప్రారంభమయ్యే గన్‌పార్కు నుంచి గాంధీభవన్ వరకు నేతలు, కార్యకర్తలు పెద్దఎత్తున ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. కాగా, మహేశ్‌కుమార్‌గౌడ్.. నార్సింగిలోని తన నివాసంలో పూజలు చేసుకొని ఇంటి నుంచే ఓపెన్ టాప్ జీపులో భారీ వాహన శ్రేణితో గన్‌పార్కు వద్దకు చేరుకున్నారు. కాంగ్రెస్ కార్యకర్తల నినాదాల మధ్య గన్‌పార్కులోని అమరవీరుల స్తూపానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయనకు గాంధీటోపీని ధరింపజేశారు. ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌తో కలిసి ఓపెన్ టాప్ జీపులో భారీ ర్యాలీ మధ్యాహ్నం 2గంటలకు ప్రారంభమైంది. పోలీసు కంట్రోల్‌రూమ్, దామోదరం సంజీవయ్య విగ్రహం, పబ్లిక్ గార్డెన్, నాంపల్లి చౌరస్తా నుంచి గాంధీభవన్‌కు చేరుకుంది. ర్యాలీ అరగంటకు పైగా సాగింది. గాంధీభవన్ పరిసరాలన్నీ కాంగ్రెస్ కార్యకర్తలతో సందడిగా మారాయి. జిల్లాల నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు గన్‌పార్కు వద్దకు చేరుకోవడంతో ఒక్కసారిగా గందరగోళ పరిస్థితి నెలకొంది.

నేడు సీఎం చేతుల మీదుగా రాజీవ్‌గాంధీ విగ్రహ ఆవిష్కరణ

» పాల్గొననున్న ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నేతలు

హైదరాబాద్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సచివాలయం ఎదుట ఏర్పాటు చేసిన దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని సీఎం రేవంత్ రెడ్డి సోమవారం ఆవిష్కరించనున్నారు. సాయంత్రం 3.45 గంటలకు ఈ కార్యక్రమం జరగనుంది. ఇందులో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీ, డీసీసీ అధ్యక్షులు, పార్టీ అనుబంధ సంఘాల నేతలు పాల్గొంటారని హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

బీఆర్ఎస్ నేతల్లో ఇంకా అదే అహంకారం

» గాంధీ, కౌశిక్‌రెడ్డి గొడవ ఆ పార్టీ వ్యవహారం: పొన్నం

వర్గల్, సెప్టెంబరు 15: ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు జనం బుద్ధి చెప్పినా ఆ పార్టీ నేతల్లో మార్పు కనిపిస్తలేదని.. ఇంకా అదే అహంకారాన్ని చూపుతున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. ఎమ్మెల్యేలు గాంధీ, కౌశిక్ రెడ్డి గొడవ బీఆర్ఎస్ అంతర్గత వ్యవహారమని, ఆ ఘర్షణతో కాంగ్రెస్‌కు ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఆదివారం సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం గౌరారంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్యేల ఘర్షణపై బీఆర్ఎస్ రాద్ధాంతం చేస్తుందని ఆరోపించారు. అప్పట్లో కేసీఆర్ ప్రతిపక్ష పార్టీలు లేకుండా చేయాలనే కుట్రతో ఫిరాయింపులకు ఆజ్యం పోయగా.. ప్రస్తుతం ఆ పాపం వారికే చుట్టుకుందన్నారు. 'సీఎం రేవంత్‌రెడ్డి అద్భుత పథకాల అమలుతో ఆదరణ పొందుతుంటే వారు జీర్ణించుకోలేకపోతున్నారు. నిబంధనల ప్రకారం పీఏసీ చైర్మన్ పదవి గాంధీకి ఇచ్చాం. గతంలో మిత్రపక్షమైన ఎంఐఎంకు ఇచ్చిన విషయాన్ని వారు మర్చిపోయినట్లున్నారు' అని వ్యాఖ్యానించారు.

ఆ వివాదం బీఆర్ఎస్ అంతర్గత అంశం: దుద్దిళ్ల

మంథని, సెప్టెంబరు 15: బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అరికెపూడి గాంధీ, కౌశిక్ రెడ్డి వివాదం ఆ పార్టీ అంతర్గత అంశమని, దాన్ని వాళ్లే పరిష్కరించుకోకుండా కాంగ్రెస్ పార్టీకి అంటగట్టడం సరికాదని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ఈ మేరకు ఆదివారం పెద్దపల్లి జిల్లా మంథనిలో ఆయన మీడియాతో మాట్లాడారు. అరికెపూడి గాంధీ స్వయంగా తాను బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేగా చెప్పుకుంటుంటే ఆ పార్టీ వాళ్లు కాంగ్రెస్‌పై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ప్రతిపక్ష పార్టీ హైదరాబాద్ ఇమేజ్‌ను దెబ్బతిసే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక ఇక్కడ ఉన్న ప్రజలంతా తెలంగాణ ప్రజలేనని అన్నారు.

సీఎం రేవంత్ నివాసం వద్ద బ్యాగు కలకలం

బంజారాహిల్స్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్ నివాసం వద్ద కనిపించిన ఓ బ్యాగు కలకలం సృష్టించింది. జూబ్లీహిల్స్‌లోని సీఎం రేవంత్‌రెడ్డి నివాసం సమీపంలో ఓ నలుపు రంగు బ్యాగు పడి ఉంది. దాన్ని చూసిన భద్రతా సిబ్బంది అప్రమత్తమయ్యారు. ఎవరూ దాని గురించి రాకపోవడంతో సీఎస్‌డబ్ల్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు రంగంలోకి దిగి మెటల్ డిటెక్టర్‌తో బ్యాగును పరిశీలించి, కార్యాలయానికి తరలించారు. అందులో ఏముందనే దానిపై స్పష్టత రాలేదు.

రేషన్ కార్డుల నిబంధనలు సవరించాలి

» క్యాబినెట్ సబ్ కమిటీకి అసదుద్దీన్ ఒవైసీ వినతి

హైదరాబాద్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మారిన పరిస్థితులకు అనుగుణంగా రేషన్ కార్డులు, హెల్త్ కార్డుల జారీకి నిబంధనలను సవరించాలని మజ్లిస్ పార్టీ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ ప్రభుత్వాన్ని కోరారు. 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రంలో 5.67 లక్షల నిరుపేద కుటుంబాలు అంత్యోదయ అన్నయోజన కార్డులను వినియోగించుకుంటున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు రేషన్ కార్డుల జారీ కోసం ఏర్పాటు చేసిన క్యాబినెట్ సబ్ కమిటీకి ఆదివారం వినతి పత్రం సమర్పించారు. దీర్ఘకాలిక, ప్రాణాంతక వ్యాధులతో బాధపడుతున్న వారి కుటుంబాలకు, ఒంటరి మహిళలకు, పట్టణ ప్రాంతాల్లోని హస్త కళాకారులకు అంత్యోదయ కార్డులను అందజేయాలని కోరారు. రేషన్‌కార్డుల జారీకి గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.5 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షల ఆదాయ పరిమితిని సవరించాలని విజ్ఞప్తి చేశారు. భూపరిమితిని ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా అర్హత ప్రమాణాలను సవరించి కార్డులు జారీ చేయాలని కోరారు.

ఎమ్మెల్యే గాంధీ ఇంటి వద్ద భద్రత పెంపు

హైదర్‌నగర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ఇంటి వద్ద ఆదివారం పోలీసులు భద్రతను పెంచారు. ఎమ్మెల్యే గాంధీని పీఏసీ చైర్మన్‌గా నియమించినప్పటి నుంచి ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, గాంధీ మధ్య మొదలైన మాటల యుద్ధం కాస్తా దాడుల వరకు వెళ్లింది. ఈ వివాదంపై కార్యకర్తలు సామాజిక మాధ్యమాల్లో విమర్శలు చేసుకుంటూ ఉండటంతో ఇంటెలిజెన్స్ హెచ్చరికల మేరకు ఆదివారం ఉదయం నుంచి గాంధీ ఇంటి వద్ద భద్రతను భారీగా పెంచారు. కూకట్‌పల్లి ఏసీపీ ఆధ్వర్యంలో 50 మంది పోలీసులు ఇంటి చుట్టూ బారికేడ్లు ఏర్పాటు చేసి భద్రత కల్పించారు. మధ్యాహ్నం మరో 100 మంది పోలీసులను మోహరించడంతో ఏం జరుగుతుందోనని స్థానికంగా అలజడి నెలకొంది. సాయంత్రానికి పోలీసు భద్రత మళ్లీ 50 మందితోనే కొనసాగింది.

ఎమ్మెల్యే గాంధీ ఇంటి వద్ద భద్రత పెంపు

హైదర్‌నగర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ఇంటి వద్ద ఆదివారం పోలీసులు భద్రతను పెంచారు. ఎమ్మెల్యే గాంధీని పీఏసీ చైర్మన్‌గా నియమించినప్పటి నుంచి ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, గాంధీ మధ్య మొదలైన మాటల యుద్ధం కాస్తా దాడుల వరకు వెళ్లింది.



సీఎంకు చెక్కును అందజేస్తున్న సువెన్ లైఫ్ సైన్సెస్ సీఈవో వెంకట్

సీఎంఆర్ఎఫ్‌కు సువెన్ లైఫ్ 2 కోట్ల విరాళం

హైదరాబాద్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయనిధికి సువెన్ లైఫ్ సైన్సెస్ కంపెనీ రూ.2 కోట్లు విరాళంగా అందజేసింది. ఆదివారం జూబ్లీహిల్స్‌లోని సీఎం రేవంత్ రెడ్డి నివాసంలో ఆయన్ను కలిసి కంపెనీ సీఈవో, చైర్మన్ వెంకట్ జాస్తి విరాళం చెక్కును అందజేశారు.



సాగర్ కాల్వ గండి పూడ్చివేత పనులు పరిశీలిస్తున్న మంత్రి పొంగులేటి

సాగర్ జలాల కోసం ఎదురు చూపులు

» ఎడమ కాల్వ గండ్లను పూడ్చాలని రైతుల వేడుకోలు

» కాల్వల పునరుద్ధరణ పనుల్లో వేగం పెంచండి: పొంగులేటి

కల్లూరు, కూసుమంచి సెప్టెంబరు 15:సాగర్ ఎడమకాల్వ రెండోజోన్ పరిధిలోని ఖమ్మం జిల్లా కల్లూరు డివిజన్ మధిర బ్రాంచ్ కాల్వకు సత్వరమే సాగునీరు అందించి ఎండిపోతున్న వరి పైరును కాపాడాలని ఆ ప్రాంత రైతులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. ఇటీవల ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు వరి పొలాల గట్లకు గండ్లు పడి నీరు బయటకు వెళ్లిందని రైతులు వివరించారు. వరద ప్రభావంతో ఎగువన కూసుమంచి వద్ద సాగర్ ఎడమ కాల్వకు పడిన గండిని యుద్ధప్రాతిపదికన పూడ్చివేయాలని కోరారు. మధిర బ్రాంచ్ కాల్వ పరిధిలో 31వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. ఇప్పుడు పంట చిరు పొట్ట దశకు చేరుకుంది. ఈ దశలో ఉన్నందున సత్వరమే సాగునీరు అందిచాలని, లేకపోతే పైరు ఎండి పోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏపీలో బుడమేరుకు గండ్లను పూడ్చినట్టే.. కూసుమంచి వద్ద సాగర్ కాల్వకు పడిన గండిని పూడ్చేందుకు మంత్రులు చొరవ తీసుకోవాలని రైతులు విజ్ఞప్తి చేశారు. మరోవైపు ఖమ్మం జిల్లాలో సాగర్ ఎడమకాల్వ గండి పూడ్చివేత పనుల్లో వేగం పెంచాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. కూసుమంచి మండలం హట్యతండ వద్ద సాగర్ ఎడమకాల్వ గండిపూడ్చివేత పనులను ఆదివారం మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. కాల్వకు గండ్లు పడిన ప్రదేశాలు, తాత్కాలికంగా చేపడుతున్న పనులు, చేపట్టనున్న శాశ్వత పనులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఉష్ణోగ్రతలు పెరిగినందున సాగులో ఉన్న పంటలు ఎండిపోకుండా వెంటనే సాగర్ జలాలు అందించాలని అధికారులను ఆదేశించారు. 24 గంటలూ పనులు కొనసాగించాలన్నారు. అవసరమైన మేర అదనపు యంత్రాలు, షిఫ్టులవారీగా కార్మికులు పనిచేసేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు.

యుద్ధ ప్రాతిపదికన గండ్లకు మరమ్మతు

» కేంద్రం సహకరిస్తుందనే ఆశిస్తున్నాం: మంత్రి ఉత్తమ్

(కాగిత రామచంద్రాపురం నుంచి ఆంధ్రజ్యోతి ప్రతినిధి/హుజూర్‌నగర్)

రాష్ట్రంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలతో దెబ్బతిన్న కాల్వలు, చెరువులకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదివారం సూర్యాపేట జిల్లాలోని కోదాడ, హుజూర్‌నగర్‌లలో దెబ్బతిన్న కాల్వలను ఉత్తమ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 773 చోట్ల కాల్వలు, చెరువులు దెబ్బతిన్నాయని.. తాత్కాలిక మరమ్మతులకు రూ.73 కోట్లు, శాశ్వత పునరుద్ధరణకు రూ.483 కోట్లు అవసరమని కేంద్రానికి నివేదిక ఇచ్చామని తెలిపారు. కేంద్రం నిధులు ఇచ్చినా, ఇవ్వకపోయినా మరమ్మతులను పూర్తి చేస్తామని వెల్లడించారు. నీటి పారుదలకు అవసరమైన నిధులను సీఎం కేటాయించారని, వారం రోజుల్లో పనులు పూర్తి చేసి రైతులకు నీరందిస్తామని తెలిపారు. రాష్ట్రంలో వర్షాలతో రూ.10,300 కోట్ల నష్టం జరిగిందని కేంద్రానికి నివేదిక ఇచ్చామని చెప్పారు. కేంద్రం నుంచి నిధులు వస్తాయని ఆశిస్తున్నామని తెలిపారు. నాగార్జునసాగర్ నుంచి పాలేరు జలాశయానికి నీటిని తరలించే సాగర్ ఎడమకాల్వకు కాగిత రామచంద్రాపురం వద్ద పడిన గండిని పూడ్చేందుకు రేయింబవళ్లు పని చేయాలని అధికారులను ఆదేశించారు. కోదాడలోని రెడ్ల కుంట ప్రధాన కాల్వ గండికి రెండు మూడు రోజుల్లో మరమ్మతులు చేయాలని సూచించారు. హుజూర్‌నగర్‌లోని ముక్త్యాల ప్రధాన కాల్వ కింద 1.07 లక్షల ఎకరాలకు నీరందాల్సి ఉందని, ఫ్లడ్ లైట్ల వెలుగులో వారం రోజుల్లో గండిని పూడ్చాలని ఆదేశించారు. తన 30 ఏళ్ల రాజకీయ జీవితంలో ప్రభుత్వ యంత్రాంగం వరద సహాయక చర్యల్లో ఇంత వేగంగా స్పందించిన దాఖలాలు లేవని ఉత్తమ్ అన్నారు. వరదలు వచ్చిన గంటలోపే సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులు సహాయక చర్యల్లో ఉన్నారని తెలిపారు.

ఐదు సీఈల పరిధిలోనే భారీ నష్టం..

వర్షాలతో ఐదు చీఫ్ ఇంజనీర్ల పరిధిలోనే భారీగా నష్టం జరిగిందని మంత్రి వెల్లడించారు. సీఈ వరంగల్ పరిధిలో 67 చోట్ల చెరువులు/కాలువలు/మత్తడి/స్లూయిస్‌లు దెబ్బతినగా, 75 చోట్ల గండ్లు పడ్డాయని.. సీఈ ఖమ్మం పరిధిలో 106 చోట్ల, సీఈ ములుగు పరిధిలో 91 చోట్ల, సీఈ ఆదిలాబాద్ పరిధిలో 60 చోట్ల, సీఈ సూర్యాపేట పరిధిలో 49 చోట్ల నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలోని వట్టెం పంప్‌హౌస్, ఖమ్మం జిల్లాలో భక్త రామదాసు పంప్‌హౌస్ దెబ్బతిన్నాయని తెలిపారు.



రెడ్లకుంట మేజర్ వద్దకు ట్రాక్టర్‌పై వెళ్తున్న మంత్రి ఉత్తమ్

ప్రకృతి వైపరీత్యాలతో రాజకీయాలు..

ప్రకృతి వైపరీత్యాలతో నష్టం జరిగితే.. దాని ద్వారా కొంత మంది లబ్ధి పొందే ప్రయత్నం చేయాలనుకుంటున్నారని ఉత్తమ్ మండిపడ్డారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి రూ.97 వేల కోట్లు వెచ్చించి.. 98 వేల ఎకరాలకే నీళ్లిచ్చారని విమర్శించారు. కాళేశ్వరం పథకం డిజైన్ చేసింది, కట్టింది.. బీఆర్ఎస్ ప్రభుత్వమేనని.. అది కూలింది కూడా వారి హయాంలోనేనని పేర్కొన్నారు. సిగ్గులేకుండా కాళేశ్వరం పథకాన్ని సమర్థించుకుంటున్నారని మండిపడ్డారు. రూ.27 వేల కోట్లు పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో వెచ్చిస్తే.. ఒక్క ఎకరం కూడా తడవలేదని చెప్పారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని దశలవారీగా పూర్తి చేస్తామని ప్రకటించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని కల్వకుర్తి, బీమా, నెట్టెంపాడు ప్రాజెక్టులను పదేళ్లలో పూర్తి చేయలేదని.. 2025 డిసెంబర్ కల్లా పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేస్తామని ఉత్తమ్ తెలిపారు.

పార్టీ నడుపుతున్నారా? సర్కస్సా?

- ఒకే అంశంపై ముఖ్యమంత్రి, మంత్రులది తలో మాట
- నా ఎత్తును పదేపదే విమర్శిస్తే.. నేను లిల్లీపుట్ అనలేనా
- సీఎం రేవంత్‌పై హరీశ్ రావు ధ్వజం



హైదరాబాద్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఒకే అంశంపై ముఖ్యమంత్రి ఓ మాట, మంత్రులు మరో మాట్లాడుతుండడం చూస్తుంటే.. రేవంత్ రెడ్డి రాష్ట్రంలో పార్టీ నడుపుతున్నారా? లేదా సర్కస్ నడుపుతున్నారా? అనే సందేహం కలుగుతుందని బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావు అన్నారు. సీఎం రేవంత్ గాంధీ భవన్‌లో మాట్లాడిన మాటలు, ఉపయోగించిన భాషపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి స్థానానికి ఉన్న గౌరవాన్ని రేవంత్ తగ్గిస్తున్నారని విమర్శించారు. ఆదివారం హైదరాబాద్‌లోని బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యాలయంలో ఆయన మాట్లాడారు. మా వాళ్లే కౌశిక్ రెడ్డి ఇంటికెళ్లారని ఓ పక్క ముఖ్యమంత్రి, గాంధీకి తమకు సంబంధం లేదని, ఇద్దరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేల గొడవని మంత్రి శ్రీధర్‌బాబు మరోపక్క అనడం చూస్తుంటే విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. వర్షాల వల్ల వచ్చిన బురదకు తోడు ముఖ్యమంత్రి అసత్యాల వరదతోనూ రాష్ట్ర ప్రజలు తిప్పలు పడుతున్నారన్నారు. ముఖ్యమంత్రి స్థానంలో ఉన్నామని, ప్రభుత్వాన్ని నడిపిస్తున్నామనే ఇంగితం లేకుండా రేవంత్ చిల్లర మాటలు మాట్లాడుతున్నారని ఆరోపించారు. రేవంత్ పదే పదే తన ఎత్తు గురించి దుర్భాషలాడుతున్నారని వాపోయిన హరీశ్.. తెలంగాణ ఉద్యమం తనని మరింత ఎత్తుకు చేర్చిందని చెప్పారు. ఆత్మనూన్యత భావం వల్లే రేవంత్ ఎత్తు అంశాన్ని ప్రస్తావిస్తున్నారని విమర్శించారు. తాను తాటిచెట్టంత ఎదిగినా రేవంత్ వెంపలి చెట్టంత కూడా ఎదగలేదని వ్యాఖ్యానించారు. ఇన్నాళ్లు మర్యాద ఇచ్చామని, ముఖ్యమంత్రిని సన్నాసి, లిల్లీపుట్ అని తాము అనలేమా అని ప్రశ్నించారు. హరీశ్ రావు ఎక్కడ దాక్కున్నాడని సీఎం ప్రశ్నించారని తాను రేవంత్ గుండెల్లోనే నిద్రపోయానని ఎద్దేవా చేశారు. అదృష్టం కొద్దీ సీఎం అయిన రేవంత్ ఆ పదవిలో ఉండేది ఐదేళ్లేనని, కాంగ్రెస్ ఏ రాష్ట్రంలోనూ ఐదేళ్లకు మించి అధికారంలో లేదన్నారు. గాంధీభవన్‌లో సీఎం చెప్పినవన్నీ అబద్ధాలేనని, రుణమాఫీ అమలు కాలేదనేందుకు ఆధారాలున్నాయని చెప్పారు. సీఎం సొంతూరు కొండారెడ్డిపల్లిలో రైతులందరికీ రుణమాఫీ జరిగిందా? అనే అంశంపై చర్చకు సిద్ధమా అని సవాలు విసిరారు. వానాకాలం రైతు భరోసా ఇప్పటివరకు ఇవ్వలేదన్నారు. ఇక, ఫార్మాసిటీ కోసం రూ.1,500 కోట్లు ఖర్చు పెట్టి గత ప్రభుత్వం 12 వేల ఎకరాలు సేకరిస్తే.. సీఎం రేవంత్ అక్కడ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.

అంబులెన్స్‌లో గంజాయి రవాణా

- 2 కోట్ల విలువైన నాలుగు క్వింటాళ్ల సరుకు పట్టివేత
- కొత్తగూడెంలో టైర్ పంక్చర్ కావడంతో బయటపడ్డ గుట్టు

చుంచుపల్లి, సెప్టెంబరు 15: అంబులెన్స్‌ను కూడా గంజాయి రవాణాకు వాడేశారు కొందరు కేటుగాళ్లు.. అయితే, ఆ వాహనం టైరు పంక్చర్ కావడంతో రూ.కోట్ల విలువ చేసే గంజాయి గుట్టురట్టయింది. అంబులెన్స్‌లో గంజాయి తరలిస్తున్న ఘటన కొత్తగూడెంలో వెలుగు చూసింది. ఓ అంబులెన్స్ టైర్ పంక్చర్ కావడంతో కొత్తగూడెంలోని రామవరం ప్రాంతంలో శనివారం అర్ధరాత్రి నిలిచిపోయింది. అది గమనించి సాయం చేసేందుకు ముందుకొచ్చిన స్థానిక యువకులు.. వాకబు చేయగా పరిస్థితి అనుమానాస్పదంగా కనిపించింది. దీంతో వారు ఇచ్చిన సమాచారంతో అక్కడికి చేరుకున్న పోలీసులు అంబులెన్స్‌లోని వ్యక్తిని ఎక్కడికెళ్తున్నావని.. ప్రశ్నించారు. దీంతో సదరు వ్యక్తి తడబడడంతో అనుమానించి వాహనంలో తనిఖీ చేయగా.. 4 క్వింటాళ్ల గంజాయి దొరికింది. దీంతో అంబులెన్స్‌ను, అందులోని వ్యక్తిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.2 కోట్ల వరకు ఉంటుందని సమాచారం. కేసు దర్యాప్తు కొనసాగుతోంది.

బౌద్ధమత ఆనవాళ్లకు నెలవు నాగార్జునకొండ

- హైకోర్టు న్యాయమూర్తి సృజన

నాగార్జునసాగర్, సెప్టెంబరు 15: పర్యాటక కేంద్రమైన నాగార్జునకొండ బౌద్ధమత ఆనవాళ్లకు నెలవని హైకోర్టు న్యాయమూర్తి సృజన అన్నారు. రెండ్రోజుల సాగర్ పర్యటనలో భాగంగా ఆదివారం జలాశయం మధ్యలో ఉన్న నాగార్జునకొండను సందర్శించారు. కొండపై ఉన్న పురావస్తు ప్రదర్శనశాలను తిలకించారు. పునర్నిర్మిత కట్టడాలైన సింహళీయం, మహాస్తూపం, అశ్వమేధ యాగశాల, బౌద్ధ మత స్తూపాలను సందర్శించారు.

నేడు సాగర్‌కు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి

నాగార్జునసాగర్‌ను సోమవారం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే కుటుంబసమేతంగా సందర్శించనున్నారు. సాగర్ పర్యటనలో భాగంగా ఆయన ప్రధాన డ్యాం, బుద్ధవనం, నాగార్జునకొండలోని మ్యూజియంను తిలకించనున్నారు. జస్టిస్ అలోక్‌అరాధే సాగర్ పర్యటన సందర్భంగా నల్లగొండ జిల్లా అధికారులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు.

వైద్యుల సంఘం ఎన్నికలకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్

హైదరాబాద్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సెంట్రల్ అసోసియేషన్ ఎన్నికలకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఎన్నికలు నిర్వహించేందుకు సీనియర్ న్యాయవాదులు జి.ఎం మొహిద్దీన్, న్యాయపతి ప్రశాంత్‌లను రిటర్నింగ్ అధికారులుగా నియమించింది. సోమవారం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. సోమవారం నుంచి ఈ నెల 19 వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. ఉపసంహరణకు ఈ నెల 21న అవకాశమిచ్చారు. సెప్టెంబరు 29న ఎన్నికలు నిర్వహించనున్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు.

డిజిటల్‌గా యాదగిరీశుడి ప్రసాద టికెట్లు

భువనగిరి అర్బన్, సెప్టెంబరు 15: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రసాదం టికెట్లు డిజిటల్ సేవల ద్వారా అందుతున్నాయి. ఇప్పటివరకు ఆఫ్‌లైన్ ద్వారా మాత్రమే అందించే ప్రసాద టికెట్ల విక్రయంలో అవకతవకలు జరుగుతున్నట్లు ఆరోపణలు రావడంతో ఆన్‌లైన్ సేవలను అందుబాటులోకి తెచ్చారు. ఇప్పటికే యాదాద్రిలో ఆర్జిత సేవలు సహా అన్ని విషయాల్లో డిజిటల్ సేవలు ఊపందుకున్నాయి. తాజాగా ప్రసాదం టికెట్ల విక్రయం కూడా ఈ జాబితాలో చేరింది. టికెట్, ప్రసాదం పొందేందుకు వేర్వేరు కౌంటర్లు ఏర్పాటు చేశారు. పీవోఎస్ (పాయింట్ ఆఫ్ సేల్) విధానం అందుబాటులో ఉన్నందున కొనుగోలు వివరాలన్ని కంప్యూటర్లలో నిక్షిప్తమవుతాయి. తద్వారా అవకతవకలకు తావులేకుండా పారదర్శకంగా సేవలు అందించగలుగుతున్నామని ఈవో భాస్కర్‌రావు తెలిపారు.

'రామయ్య' పేరిట ప్రైవేట్ కార్యక్రమాలు నిషిద్ధం

శాంతి కల్యాణం నిర్వహణపై భద్రాచలం ఈవో అభ్యంతరం

భద్రాచలం, సెప్టెంబరు 15: భద్రాచలంలో శ్రీరామ టెంపుల్ ఆఫ్ యూఎస్ఏ ఖగోళయాత్ర బృందం ఆధ్వర్యంలో భద్రాద్రి సీతారాముల శాంతికల్యాణం నిర్వహించడంపై భద్రాచలం దేవస్థానం అధికారులు, వైదిక సిబ్బంది తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. సదరు సంస్థ వెబ్‌సైట్‌లో పొందుపరిచిన భద్రాద్రి రామయ్య మూలవరుల చిత్రాన్ని వెంటనే తొలగించాలని ఆదేశించారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ ప్రాంగణంలోని చిత్రకూట మండపంలో దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, ప్రధాన అర్చకులు అమరవాది విజయరాఘవన్, ఉప ప్రధాన అర్చకులు అమరవాది గోపాలకృష్ణమాచార్యులు, కోటి రామస్వరూపాచార్య, కోటి శ్రీమన్నారాయణాచార్యులు ఇతర వైదిక సిబ్బంది విలేకరులతో మాట్లాడారు. ప్రపంచంలో ఎక్కడైనా సీతారాముల ఆలయం నిర్మించి కల్యాణం నిర్వహిస్తే తమకు ఎటువంటి అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. ఇదే సమయంలో భద్రాద్రి శ్రీరామ టెంపుల్, భద్రాద్రి శ్రీ సీతారాముల శాంతికల్యాణం, ఆలయ మూలవరుల చిత్రం వాడటం పూర్తిగా నిషేధమన్నారు. భద్రాద్రి సీతారాముల కల్యాణం నిర్వహించే పూర్తి హక్కులు కేవలం భద్రాద్రి దేవస్థానానికే ఉన్నాయని చెప్పారు. మరెవరైనా వ్యక్తిగత లాభాపేక్షతో వాణిజ్యపరంగా భద్రాద్రి పేరును వినియోగిస్తే సహించేది లేదని హెచ్చరించారు.

కమిషనర్‌కు నివేదిక

మరోవైపు, ఈ విషయాన్ని దేవాదాయశాఖ కమిషనర్ హనుమంతరావు దృష్టికి తీసుకెళ్లినట్లు దేవస్థానం ఈవో రమాదేవి తెలిపారు. కమిషనర్ ఆదేశాల మేరకు చర్యలు చేపడతామన్నారు. ఇటు భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం, భద్రాద్రి సీతారాముల కల్యాణం, మూలవరుల చిత్రంపై త్వరలోనే పేటెంట్ హక్కు కోసం దరఖాస్తు చేస్తామని దేవస్థానం ఆమె వెల్లడించారు.



గణేశా.. ట్యాంక్‌బండ్ పిలిచె!

హుస్సేన్‌సాగర తీరాన నిమజ్జనానికి తొలగిన అడ్డంకులు.. గణేశ్ ఉత్సవ సమితి హెచ్చరికలతో దిగొచ్చిన యంత్రాంగం

హైదరాబాద్ సిటీ/కవాడిగూడ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గణనాథుల 'నిమజ్జనం'పై గందరగోళానికి తెరపడింది. విగ్రహాలను తన మీదుగా గంగమ్మ ఒడికి చేర్చడానికి తావు లేదని బెట్టు చేసిన ట్యాంక్‌బండ్ ఎట్టకేలకు గణపతులకు స్వాగతం పలికింది. ఈసారి కూడా మహా నిమజ్జనం ట్యాంక్‌బండ్ నుంచి ఆర్భాటంగా జరగనుంది. హైకోర్టు ఆదేశాల మేరకు ట్యాంక్‌బండ్ నుంచి నిమజ్జనానికి అనుమతి లేదంటూ ఎక్కడికక్కడ ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి.. విగ్రహాలను నీళ్లలో వేయడానికి భారీ ఇనుప జాలీలు పెట్టిన అధికారగణం ఎట్టకేలకు దిగొచ్చింది. అంతేనా.. ట్యాంక్‌బండ్ పైనుంచి నిమజ్జనం కోసం యుద్ధప్రాతిపదికన క్రేన్లు ఏర్పాటు చేస్తున్నారు. మహా నిమజ్జనం సమీపిస్తున్న వేళ భక్తులకు కేక పుట్టించే పరిణామమిది. ఇదంతా గణేశ్ ఉత్సవ సమితి పోరాటం, హెచ్చరికల ఫలితమే!! ఆదివారం ట్యాంక్‌బండ్‌పై ఏడు క్రేన్లు అమర్చారు. సోమవారం మరో ఎనిమిది క్రేన్లు ఏర్పాటు చేస్తారు. ఇక.. ఎన్టీఆర్ మార్గ్‌లో తొమ్మిది, పీపుల్స్ ప్లాజా వద్ద ఏడు, జలవిహార్ సమీపంలో రెండు, సాగర్‌లోని బేబీ పాండ్ వద్ద మరో రెండు క్రేన్లు ఉన్నాయి. మొత్తంగా హుస్సేన్‌సాగర్ చుట్టూ వినాయక విగ్రహాల నిమజ్జనం కోసం 31 క్రేన్లు అందుబాటులో తేనున్నారు.

ఇంతకీ ఏం జరిగింది?

ట్యాంక్‌బండ్ పై నుంచి నిమజ్జనం చేయడానికి వీల్లేదంటూ ఈసారి కూడా జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ విభాగాల అధికారులు హడావుడి చేశారు. అయితే ఎన్టీఆర్ మార్గ్ నుంచి నిమజ్జనం కోసం పరిమిత స్థాయిలో క్రేన్లు అమర్చారు. మంగళవారమే మహా నిమజ్జనోత్సవం కావడం.. ట్యాంక్‌బండ్‌పై ఆంక్షలు విధించడంతో ఎప్పటిలాగే గణేశ్ ఉత్సవ సమితి ప్రతినిధులు కదిలారు. ఆదివారం ఉదయం 9.30కు ట్యాంక్‌బండ్‌పైకి వచ్చారు. అక్కడ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, అడ్డుగా పెట్టిన బారికేడ్లు, జాలీలు తొలగించారు. భక్తులను పిలిపించుకొని ట్యాంక్‌బండ్ నుంచి విగ్రహాలను నిమజ్జనం చేయించారు. ఈ క్రమంలో అక్కడ స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. రెండు గంటలపాటు ఆ మార్గంలో ట్రాఫిక్ జాం అయింది. ఆదివారం మధ్యాహ్నంలోపు నిమజ్జన ఏర్పాట్లు చేయకపోతే గనక సోమవారం నగరవ్యాప్తంగా ఆందోళన చేస్తామని, నిమజ్జనానికి తరలించకుండా ఎక్కడి విగ్రహాలు అక్కడే ఉంచుతామని హెచ్చరించారు. ఏళ్లుగా ట్యాంక్‌బండ్‌పై విగ్రహాల నిమజ్జనం జరుగుతోందని, కొత్త నిబంధనల పేరిట ఇబ్బంది పెట్టాలని చూడటం సబబు కాదన్నారు. 2022, 23లో కూడా ఇలానే చెప్పి.. చివరకు నిమజ్జన ఏర్పాట్లు చేశారని సమితి ప్రతినిధులు గుర్తు చేశారు. సమితి ప్రతినిధులు వెళ్లిన అనంతరం పోలీసులు తిరిగి ఫ్లెక్సీలు ఏర్పాటుచేసి బారికేడ్లు అడ్డుగా పెట్టారు. విగ్రహాలు నిమజ్జనం చేసేందుకు వచ్చిన భక్తులు ఇతర మార్గాల వైపు పంపించారు. ఉన్నతస్థాయి అధికారుల ఆదేశాలతో మధ్యాహ్నం నుంచి ఏర్పాట్లు మొదలయ్యాయి. ఫ్లెక్సీలు తొలగించిన అధికారులు.. క్రేన్లు అమర్చేందుకు అనుమతినిచ్చారు. సాధారణంగా నిమజ్జనానికి మూడు, నాలుగు రోజుల ముందే సాగర తీరంలో క్రేన్ల ఏర్పాటు మొదలవుతుంది.





ట్యాంక్‌బండ్‌పై జాలీలను తొలగిస్తున్న ఉత్సవ సమితి నేతలు, ట్యాంక్‌బండ్‌పై నిమజ్జనం కోసం క్రేన్లను ఏర్పాటు చేస్తున్న దృశ్యం

మహా గణపతీ.. ఏం జన సంద్రమిదీ!

- సెలవు రోజు ఖైరతాబాద్ గణేశ్ వద్ద కిటకిట
- ఒక్కరోజే 6 లక్షలకు పైగా భక్తుల రాక
- సొమ్మసిల్లిన కొందరు.. ట్రాఫిక్‌జాం
- మేడ్చల్‌లో అపశ్రుతి.. యువకుడి మృతి

ఖైరతాబాద్, మేడ్చల్ సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): మహా నిమజ్జనోత్సవం సమీపిస్తుండటం.. సెలవు రోజు కావడంతో ఆదివారం ఖైరతాబాద్ మహా గణపతి దర్శనానికి పెద్ద సంఖ్యలో భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచి అర్ధరాత్రి దాకా ఆ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులను నియంత్రించలేక పోలీసులు ఒకదశలో చేతులెత్తేశారు. క్యూలైన్లలలో గంటలతరబడి నిల్చున్నవారిలో కొందరు సొమ్మసిల్లి పడిపోయారు.. జనాల మధ్య చిన్నపిల్లలు, వృద్ధులు ఉక్కిరిబిక్కిరయ్యారు. మొత్తమ్మీద ఖైరతాబాద్‌లో ఆదివారం ఒక్కరోజే దాదాపు 6లక్షలకు పైగా భక్తులు వచ్చారని చెబుతున్నారు. జనం రద్దీతో ఖైరతాబాద్ పరిసరాల్లో తీవ్ర ట్రాఫిక్‌జాం నెలకొంది. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడం పోలీసులకు సవాల్‌గా మారింది. కాగా మంగళవారం మహా నిమజ్జనం నేపథ్యంలో అర్ధరాత్రి దాటాక 2 గంటల వరకు మెట్రోరైళ్లు నడుపుతామని హైదరాబాద్ మెట్రో రైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఒక్కరోజే ఖైరతాబాద్ స్టేషన్‌లో 30వేల ఎంట్రీలు, 55వేల ఎగ్జిట్లు జరిగాయని వెల్లడించారు. కాగా మల్కాజ్‌గిరి-మేడ్చల్ జిల్లా రాజబొల్లారం తండాలో నిమజ్జనంలో విషాదం జరిగింది. నిమజ్జనం చేస్తుండగా తండాకు చెందిన నరేందర్ (28) చెరువులో పడి చనిపోయాడు.

దారుస్సలాం ఎజెండా నడవదు

సమితి ప్రతినిధులు

'భాగ్యనగరం మాది. వినాయకసాగర్‌లో నిమజ్జనం హిందువుల ధార్మిక హక్కు. ఈ హక్కును ఏ శక్తీ ఆపలేదు. ట్యాంక్‌బండ్‌పై నిమజ్జనాన్ని ఆపాలని చూస్తే జరిగే పరిణామాలకు ప్రభుత్వం బాధ్యత వహించాల్సి ఉంటుంది' అని భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి పేర్కొంది. సమితి రాష్ట్ర అధ్యక్షుడు జీ రాఘవరెడ్డి, కార్యదర్శి డాక్టర్ శశిధర్ మాట్లాడుతూ.. దారుస్సలాం ఎజెండా ఇక్కడ నడవదన్నారు. తమ విశ్వాసాలను అవమానపర్చేందుకు ప్రభుత్వానికి ఎన్ని గుండెలు? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల భాగస్వామ్యంలో నిర్మించుకున్న వినాయక సాగర్‌లో 45 ఏళ్లుగా విగ్రహాల నిమజ్జనం జరుగుతోందని, కోర్టు ఆదేశాల సాకుతో ప్రభుత్వ విభాగాలు రహస్య ఎజెండా అమలు చేసే ప్రయత్నం చేస్తున్నాయని ఆరోపించారు. దారుస్సలాం, నిజాంపాలన చట్టాలను గణేశ్ నిమజ్జన వేడుకల్లో అవలంబించొద్దని పేర్కొన్నారు.



కేసీఆర్‌ను కలిసిన బీఆర్ఎస్ నేతలు

హైదరాబాద్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను ఆ పార్టీ ముఖ్యనేతలు కలిశారు. ఎర్రవెల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో ఆదివారం కేసీఆర్‌ను కలిసిన వారిలో వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, వేముల ప్రశాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, వివేకానంద, కౌశిక్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, మర్రి జనార్దన్‌రెడ్డి, బాల్కసుమన్, కోరుకంటి చందర్ ఉన్నారు. ఈ సందర్భంగా పార్టీ వ్యవహారాలు, రాష్ట్రంలోని తాజా పరిణామాలపై చర్చించినట్లు తెలుస్తోంది.

ఫార్మాసిటీ రద్దు చేస్తే.. భూములిచ్చేయండి

- సీఎం రేవంత్‌కు కేటీఆర్ లేఖ

హైదరాబాద్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో తలపెట్టిన ఫార్మాసిటీ ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం కొనసాగిస్తుందా? లేదా? అనే అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టత ఇవ్వాలని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రికి ఆయన ఓ లేఖ రాశారు. ఫార్మా సిటీ కోసం సేకరించిన భూమిని ఇతర ప్రాజెక్టులకు వినియోగించడం కుదరదని హైకోర్టు స్పష్టం చేసిందని కేటీఆర్ గుర్తు చేశారు. ఒక వేళ ఫార్మాసిటీ ప్రాజెక్టును రద్దు చేస్తే రైతుల నుంచి సేకరించిన భూములను వెనక్కి ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులతో కలిసి పోరాటం చేస్తామని హెచ్చరించారు. కాగా, కౌశిక్ రెడ్డి- అరికెపూడి గాంధీ వివాదం అంశాన్ని మంత్రి శ్రీధర్ బాబు.. ఇద్దరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేల మధ్య గొడవ అనడాన్ని ఎక్స్ వేదికగా కేటీఆర్ తప్పుబట్టారు. ప్రలోభాలతో పార్టీలో చేర్చుకున్న వారిని తమ వారిని చెప్పుకోలేని కాంగ్రెస్ పరిస్థితి చూస్తే జాలేస్తుందని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి ప్రజాస్వామ్యాన్ని తుంగులో తొక్కుతుంటే.. ప్రజాస్వామ్యం, హక్కులపై ఉపన్యాసాలిచ్చే రాహుల్ గాంధీ ఏం చేస్తున్నారని కేటీఆర్ ధ్వజమెత్తారు.

పోటాపోటీగా సెప్టెంబరు 17!

పబ్లిక్ గార్డెన్స్‌లో 'ప్రజాపాలన దినోత్సవం'.. పరేడ్ గ్రౌండ్‌లో 'తెలంగాణ విమోచన దినోత్సవం'

హైదరాబాద్/న్యూఢిల్లీ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సంస్థానం స్వతంత్ర భారతదేశంలో విలీనమైన 'సెప్టెంబరు 17' వేడుకల అంశం మరోసారి రాజకీయ పార్టీల మధ్య వివాదాన్ని రగిలించింది. ఇప్పటికే ఒక్కో పార్టీ ఒక్కో పేరుతో ఈ వేడుకలు నిర్వహిస్తుండగా.. తాజాగా రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం దీనికి 'తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం'గా పేరు పెట్టడంతోపాటు కేంద్ర మంత్రులను కూడా ఆహ్వానించింది. మరోవైపు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 'తెలంగాణ విమోచన దినోత్సవం'గా నిర్వహిస్తూ.. సీఎం రేవంత్‌రెడ్డిని ఈ కార్యక్రమానికి ఆహ్వానించింది. దీంతో కాంగ్రెస్, బీజేపీ పోటాపోటీగా చేపట్టిన ఈ కార్యక్రమాలు చర్చనీయాంశంగా మారాయి. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తొలిసారి సెప్టెంబరు 17 కార్యక్రమం జరుగుతుండడంతో రేవంత్ సర్కారు దీనిని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం పేరిట నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌లో వేడుకలు నిర్వహించాలని నిర్ణయించింది. ఈ వేడుకలకు హాజరు కావాలంటూ కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా, సాంస్కృతికశాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌తోపాటు రాష్ట్రం నుంచి కేంద్ర కేబినెట్‌లో ప్రాతినిధ్యం వహిస్తున్న కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లను కూడా సీఎం రేవంత్‌రెడ్డి ఆహ్వానించారు. ఈ మేరకు వారికి ముఖ్యమంత్రి ప్రత్యేకంగా లేఖలు రాశారు. ఇదిలా ఉండగా.. సెప్టెంబరు 17ను తెలంగాణ విమోచన దినోత్సవంగా అధికారికంగా నిర్వహిస్తున్న కేంద్ర ప్రభుత్వం వరుసగా మూడో సంవత్సరం కూడా పరేడ్ గ్రౌండ్ వేదికగా వేడుకలకు సిద్ధమైంది. కేంద్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి కేంద్ర సాంస్కృతికశాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్, బొగ్గు, గనులశాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి, హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. ఈ వేడుకలకు సీఎం రేవంత్‌రెడ్డిని కూడా ఆహ్వానించినట్లు బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు కె.లక్ష్మణ్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి విస్మరిస్తే.. తెలంగాణ సమాజం ఆయనను క్షమించదన్నారు.

పేరు మార్పు సబబు కాదు: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబరు 17ను అత్యంత ప్రాధాన్యం కలిగిన రోజుగా గుర్తించి కార్యక్రమాన్ని నిర్వహించాలనుకోవడం సంతోషకరమంటూనే.. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ విమోచన దినోత్సవంగా నిర్వహిస్తున్న పేరును మార్చడం సబబు కాదన్నారు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి. ఈ మేరకు సీఎంకు ఆయన లేఖ రాశారు. "ప్రతిపాదిత 'ప్రజాపాలన దినోత్సవాని'కి ఆహ్వానించినందుకు మీకు ధన్యవాదాలు. కానీ, నిజాం నవాబు ప్రైవేటు సైన్యమైన రజాకార్ల కిరాతక పాలన నుంచి హైదరాబాద్ సంస్థానం స్వాతంత్ర్యం పొందేందుకు.. ఏళ్ల తరబడి పోరాడిన విధానం, రజాకార్ల హింసకు వేలమంది ప్రాణాలు కోల్పోయిన సంగతి.. ఈ గడ్డపై పుట్టిన బిడ్డగా మీకు తెలుసు. వారందరి వీరోచిత పోరాటం, త్యాగాలను స్మరించుకుంటూ.. ప్రస్తుత తరానికి మన పెద్దల ధైర్య సాహసాలను తెలియజేసి జాతీయ భావన కల్పించాల్సిన అవసరం ఉంది. ఇంతటి స్ఫూర్తిదాయకమైన రోజు, వేలాది మంది త్యాగాల ఫలితమైన విమోచన దినోత్సవానికి పేరు మార్చడం.. వాస్తవ చరిత్ర నుంచి ప్రజల దృష్టిని మరల్చడమేనని అర్థమవుతోంది. ఇది సంతుష్టీకరణ రాజకీయాలను ప్రోత్సహించినట్లవుతుంది" అని లేఖలో కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఘనమైన తెలంగాణ చరిత్రను ప్రజల స్మృతిపథం నుంచి తుడిచివేసేందుకు జరుగుతున్న ప్రయత్నంలో తాను భాగస్వామిని కాలేనని తెలిపారు. సమీప భవిష్యత్తులోనైనా వాస్తవాలను అర్థం చేసుకుని.. సెప్టెంబరు 17ను తెలంగాణ విమోచనం దినోత్సవంగా గుర్తిస్తారని విశ్వసిస్తున్నట్లు పేర్కొన్నారు. కాగా, ఒవైసీ సోదరులకు భయపడే కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ విమోచన దినోత్సవాన్ని నిర్వహించడం లేదని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా ఇలాగే వ్యవహరించిందన్నారు ప్రజాపాలన దినోత్సవం పేరుతో కాకుండా తెలంగాణ విమోచన దినోత్సవంగా సెప్టెంబరు 17ను నిర్వహించాలంటూ సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన లేఖ రాశారు.

ప్రజా వంచన దినోత్సవం జరుపుకోండి

- 50 ఏళ్లు రాష్ట్ర ప్రజలను వంచించారు కదా
- జనాన్ని హింసించిన రజాకార్ల పార్టీతో దోస్తీనా
- కాంగ్రెస్‌పై కేంద్ర మంత్రి బండి సంజయ్ ధ్వజం



పరేడ్ గ్రౌండ్‌లో ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న బండి సంజయ్

హైదరాబాద్ సిటీ/హైదరాబాద్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ఎందుకు నిర్వహించడం లేదో సమాధానం చెప్పాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. 50 ఏళ్లు అధికారంలో ఉన్న ఆ పార్టీ ప్రజలను వంచించినందున.. 'తెలంగాణ ప్రజా వంచన దినోత్సవం' నిర్వహించుకోవాలని విమర్శించారు. తెలంగాణ ప్రజలను హింసించిన రజకార్ల పార్టీ వారసులకు కాంగ్రెస్ వత్తాసు పలకడం సిగ్గు చేటన్నారు. తెలంగాణ విమోచన దినోత్సవ నేపథ్యంలో సికింద్రాబాద్‌లోని పరేడ్ మైదానంలో సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్(సీబీసీ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను ఆదివారం బండి సంజయ్ ప్రారంభించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా, తెలంగాణ విముక్తి కోసం జరిగిన పోరాటాలు, సమర యోధుల త్యాగాలను ఎగ్జిబిషన్‌లో కళ్లకు కట్టినట్లు చూపారని పేర్కొన్నారు. తెలంగాణ విమోచన కోసం జరిగిన పోరాటాల చరిత్రను రాష్ట్ర పాలకులు 75 ఏళ్లపాటు తొక్కిపెట్టేందుకు ప్రయత్నించారని మండిపడ్డారు. రాబోయే తరాలకు ఈ చరిత్రను అందించాలన్న ఉద్దేశంతో తెలంగాణ విమోచన దినోత్సవాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆపరేషన్ పోలోతో తెలంగాణకు విముక్తి కల్పించిన మహనీయుడు సర్దార్ పటేల్ అని కొనియాడారు. తెలంగాణ విమోచన ఉత్సవాలపై కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు అధికారంలో ఉన్నప్పుడు ఒక మాట, లేనప్పుడు మరో మాట మాట్లాడాయని అన్నారు. ఈ సందర్భంగా సంజయ్ పరేడ్ మైదానంలో యువకులతో కలిసి కాసేపు క్రికెట్ ఆడారు. తెలంగాణ విమోచన పోరాటాలను పాఠ్యాంశంగా పొందుపర్చాలని ఎంపీ లక్ష్మణ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. మజ్లిస్‌తో ఉన్న బంధం కారణంగానే కాంగ్రెస్ ప్రభుత్వం విమోచన దినోత్సవాన్ని నిర్వహించడం లేదని ఆరోపించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.